ఆదివారం
25•2•2018
హైదరాబాద్
• వెల.6 రూ.
• సంపుటి 7 • సంచిక 259
• పేజీలు : 16 + (24/16) + 36 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



రెవెన్యూ సిబ్బందికి నజరానా



భూ రికార్డుల ప్రక్షాళన విజయవంతంగా పూర్తి చేసినందుకు.. ఒక నెల మూలవేతనం

- 35,749 మంది ఉద్యోగులకు లబ్ధి
- రెవెన్యూ ఉద్యోగులకు మనసారా కృతజ్ఞతలు
- దేశంలో ఎవరూ సాధించని ఘనత ఇది
- భవిష్యత్తులో కూడా ఉద్యోగులకు మంచి జీతభత్యాలు
- చిన్న జిల్లాలతోనే భూ ప్రక్షాళన విజయవంతం: సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అత్యంత క్లిష్టమైన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన రెవెన్యూ శాఖ ఉద్యోగులకు ప్రోత్సాహకంగా ఒక నెల మూలవేతనాన్ని అందివ్వాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. 10,809 మంది రెవెన్యూ ఉద్యోగులు, 24,410 మంది వీఆర్‌ఏలు , 530 మంది సర్వే విభాగం ఉద్యోగులు.. మొత్తం 35,749 మంది ఉద్యోగులకు ఒక నెల మూలవేతనం అదనంగా అందించాలని సీఎం అధికారులను మిగతా 2వ పేజీలో

పాస్ పుస్తకాల టెండర్లు రద్దు
సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ తీరుపై సీఎం ఆగ్రహం

27న సీఎం కేసీఆర్ సింగరేణి యాత్ర

మార్చి 5న ధర్మపురి, ముథోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో పర్యటన 2

సంఘటిత రైతుశక్తి.. సమన్వయ సమితి

వ్యవసాయాభివృద్ధిలో కీలకపాత్ర

- నేడు హైదరాబాద్‌లో, రేపు కరీంనగర్‌లో ప్రాంతీయ సదస్సులు
- మార్గదర్శనం చేయనున్న సీఎం కేసీఆర్
- ఐక్యంగా కదిలినప్పుడే వ్యవసాయానికి స్వర్ణయుగం
- రైతు సమితి కరదీపికను ముద్రించిన వ్యవసాయశాఖ

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రైతు సమన్వయ సమితుల ఆవిర్భావం తెలంగాణ వ్యవసాయరంగ చరిత్రలో కీలక మలుపు కానున్నది. వ్యవసాయాన్ని సుసంపన్నం చేసేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆలోచనల నుంచి పురుడుపోసుకొన్న సమితులు రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించనున్నాయి. సేద్యానికి సంబంధించి రైతులు ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారం రైతుల చేతుల్లోనే ఉందని నిరూపించే దిశగా బాటలు పడుతున్నాయి. వ్యవసాయమన్నది దండుగ కాదు.. పండుగ అని ప్రతి రైతూ ఆనందంగా అనుభూతి చెందే మిగతా 11వ పేజీలో



శనివారం బయోఏషియా సదస్సులో కేంద్రమంత్రి సురేశ్‌ప్రభుకు జ్ఞాపికను అందజేస్తున్న ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు

ఫార్మాపై చొరవ అభినందనీయం

తెలంగాణను ప్రశంసించిన కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు
ఫార్మా రాజధానిగా హైదరాబాద్: మంత్రి కేటీఆర్
బయోఏషియా సదస్సు చర్చాగోష్ఠిలో పాల్గొన్న మంత్రులు
కేటీఆర్ ప్రశ్నలకు జవాబులిచ్చిన సురేశ్‌ప్రభు 2

అద్భుతాలకు అరుదైన గౌరవం

తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు హడ్కో డిజైన్ అవార్డు-2017
టీఎస్‌కాప్ మొబైల్ యాప్‌కు ఎన్సీఆర్బీ ఉత్తమ ఐటీ ప్రాజెక్టు పురస్కారం
తెలంగాణ మీసేవకు టెక్నాలజీ సభ అవార్డు 11



అరుణారెడ్డి

విశ్వవేదికపై అరుణపతాక

చరిత్ర సృష్టించిన హైదరాబాదీ బుడ్డా అరుణారెడ్డి
జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో కాంస్యంతో మెరిసిన యువతార
జిమ్నాస్టిక్స్‌లో దేశానికి తొలి పతకం అందించిన తెలంగాణ బిడ్డ 16






బ్యాంకుల్లో వరుస కుంభకోణాలు

- తెరపైకి మరో మూడు ఆర్థిక నేరాలు
- నిందితులపై సీబీఐ కేసులు
- ఓబీసీని 389 కోట్లకు ముంచిన వజ్రాల వ్యాపారి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: దేశ బ్యాంకింగ్ వ్యవస్థ వరుస కుంభకోణాలతో కుదేలవుతున్నది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.11,400 కోట్ల భారీ కుంభకోణం బయటపడి పది రోజులు తిరక్కుండానే మరో మూడు ఆర్థిక మోసాలు వెలుగులోకి వచ్చాయి. పీఎన్‌బీతోపాటు ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీవోఎం)లో జరిగిన ఈ మోసాలకు సంబంధించి ఆయా బ్యాంకులు కొద్ది రోజుల క్రితం కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)ను ఆశ్రయించడంతో నిందితులపై కేసులు నమోదయ్యాయి. వీరిలో ఒక వజ్రాభరణాల వ్యాపారి, ఒక ప్రభుత్వ ఉద్యోగి, మరో వ్యాపారి ఉన్నట్టు అధికారులు శనివారం వెల్లడించారు. ఢిల్లీలోని కరోల్ బాగ్‌కు చెందిన వజ్రాభరణాల ఎగుమతి సంస్థ ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే వజ్రాభరణాల ఎగుమతి సంస్థ రూ.389 కోట్లకు తమను మోసగించినట్లు ఓబీసీ ఫిర్యాదు చేయడంతో ఆ సంస్థపై గురువారం సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కుంభకోణంపై ఓబీసీ ఆరునెలల క్రితమే ఫిర్యాదు చేసినప్పటికీ ఆలస్యంగా స్పందించిన సీబీఐ ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు ఆ సంస్థ డైరెక్టర్లు సభ్య సేథ్, రీటా సేథ్, కృష్ణకుమార్ సింగ్, రవి సింగ్‌పై, ద్వారకా దాస్ సేథ్ సెజ్ ఇన్‌కార్పొరేషన్ అనే మరో సంస్థపై కేసు నమోదు చేసింది. ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ బ్యాంకు అధికారులతో కుమ్మక్కై 2007–12 మధ్యకాలంలో రూ.389 కోట్ల రుణాలను తీసుకున్నదని, బంగారాన్ని, ఇతర విలువైన రత్నాల కొనుగోలుకు, అక్రమ లావాదేవీలకు పాల్పడి బంగారాన్ని, నిధులను ఇతర దేశాలకు తరలించేందుకు ఆ సంస్థ ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)లను ఉపయోగించిందని, ఉనికిలో లేని కొన్ని డొల్ల కంపెనీలతో కూడా ఈ సంస్థ వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నట్లు గుర్తించామని సీబీఐకి ఇచ్చిన ఫిర్యాదులో ఓబీసీ స్పష్టం చేసింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో..

అమిత్ సింగ్లా అనే వ్యాపారవేత్తతో పాటు మరికొందరు ఇతరులు ఫోర్జరీ పత్రాల రుణం పొంది తమ బ్యాంకును మోసగించారని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఫిర్యాదు చేయడంతో సీబీఐ బుధవారం ఆ నిందితులపై కేసు నమోదు చేసింది. 2010–12 మధ్య కాలంలో అమిత్ సింగ్లా క్యాష్ క్రెడిట్ ఫెసిలిటీ ద్వారా తమ బ్యాంకు నుంచి రూ.9.5 కోట్ల రుణం తీసుకున్నాడని, ఇందుకోసం ఆయన ఢిల్లీ, హర్యానాల్లోని మూడు ఆస్తులను తనఖా పెట్టాడని, అప్పట్లో ఈ మూడు ఆస్తులకు టెక్ మాచ్ ఇంటర్నేషనల్ అనే సంస్థ రూ.180 కోట్ల విలువ కట్టిందని బీవోఎం తన ఫిర్యాదులో పేర్కొన్నది. సింగ్లా తీసుకున్న రుణం 2013లో మొండి బకాయిగా మారడంతో ఈ ఆస్తులను వేలం వేసేందుకు ఉపక్రమించగా.. వాటి అసలు మార్కెట్ విలువ కేవలం రూ.2.5 కోట్లేనని తేలిందని బీవోఎం ఆరోపించింది. దీంతో అమిత్ సింగ్లాతో పాటు ఆయన ఆస్తులకు ఉద్దేశ్యపూర్వకంగా అధిక విలువ కట్టిన టెక్ మాచ్ సంస్థ అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది.

పీఎన్‌బీలో మరో మోసం

కొద్ది రోజుల క్రితం రూ.11,400 కోట్ల భారీ కుంభకోణంతో కుదేలైన పీఎన్‌బీలో తాజాగా మరో కుంభకోణం తెర మీదికి వచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ముద్ర (మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీ) రుణాల్లో మోసాలు జరిగినట్లు వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారంపై సీబీఐ బుధవారం కేసు నమోదు చేసింది. రాజస్థాన్‌లోని బర్మేర్ శాఖలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ 2016 సెప్టెంబర్ నుంచి 2017 మార్చి మధ్య కాలంలో అక్రమంగా 26 ముద్ర రుణాలను మంజూరు చేసి పీఎన్‌బీకి రూ.62 లక్షల నష్టాన్ని కలిగించినట్లు ఆరోపణలు రావడంతో సీబీఐ ఈ కేసు దాఖలు చేసింది. లబ్ధిదారుల ఆస్తులు, వ్యాపారాలతో పాటు అసలు వారు ఈ రుణాలను ఎందుకు తీసుకుంటున్నారన్న దానిపై కూడా ముందస్తు పరిశీలనలు జరుపకుండానే ఆయన ఈ రుణాలను మంజూరు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ 26 రుణాల్లో ఐదు ఖాతాలు నిరర్థక ఆస్తులుగా మారాయని సీబీఐ అధికారులు తెలిపారు.

మిషన్ కాకతీయ నాలుగోదశ కింద
382 చెరువులకు అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మిషన్ కాకతీయ నాలుగోదశ కింద శనివారం భారీగా చెరువుల పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. హైదరాబాద్ మినహా దాదాపు మిగిలిన అన్నిజిల్లాల పరిధిలోని 382 చెరువుల పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతి ఇచ్చింది. ఈ చెరువుల కింద 23,870.38 ఎకరాల ఆయకట్టు ఉండగా... పునరుద్ధరణ పనులను రూ.93.18 కోట్లతో చేపట్టనున్నట్టు 34 వేర్వేరు జీవోల్లో పేర్కొన్నారు.

రేపటినుంచి ఇ-గవర్నెన్స్ సదస్సు

- హాజరుకానున్న మంత్రి కేటీఆర్, కేంద్రమంత్రులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు



వివరాలు వెల్లడిస్తున్న వసుధా మిశ్రా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పలురాష్ట్రాల్లో అమలవుతున్న ఇ-గవర్నెన్స్ విధానాల గురించి తెలుసుకోవడం, నూతన సాంకేతికత ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఇ-గవర్నెన్స్‌పై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు పరిపాలనా సంస్కరణల విభాగం అదనపు కార్యదర్శి వసుధా మిశ్రా చెప్పారు. ఈ నెల 26, 27 తేదీల్లో హెచ్ఐసీసీలో జరుగనున్న సదస్సులో ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో ఇ-గవర్నెన్స్‌ను ఎలా విస్తృతం చేయాలనే అంశంపై చర్చించనున్నట్టు ఆమె శనివారం సచివాలయంలో మీడియాకు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, కేంద్రమంత్రులు, సీఎస్ ఎస్కే జోషి, కేంద్ర ఉన్నతాధికారులు, వివిధరాష్ట్రాల ప్రతినిధులు, పలురంగాల నిపుణులు హాజరవుతారని తెలిపారు. 8 క్యాటగిరీల్లో సాగే ఈ సదస్సులో ఐదు ప్లీనరీ సెషన్లు జరుగుతాయని చెప్పారు. 18 ఉత్తమ ఇ-గవర్నెన్స్ బహుమతులతోపాటు ప్రత్యేకజ్యూరీ అవార్డును ప్రదానం చేయనున్నట్టు ఆమె వెల్లడించారు. ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలువబోతుందని ఆమె వివరించారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.41 గంటలకు



సూర్యాస్తమయం: 6.18 గంటలకు

హేవళంబి నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణ మాసం, శుక్లపక్షం, దశమి రాత్రి 8.12 వరకు, తదుపరి ఏకాదశి. నక్షత్రం: మృగశిర ఉదయం 9.54 వరకు, తదుపరి ఆరుద్ర. అమృత ఘడియలు: తె. 1.41 నుంచి 3.17 వరకు తిరిగి రాత్రి 10.50 నుంచి 12.26 వరకు, రాహుకాలం: సాయంత్రం 4.50 నుంచి 6.18 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.45 నుంచి 5.31 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.40 నుంచి రాత్రి 7.16 వరకు.

ఫార్మాపై చొరువ అభినందనీయం

- తెలంగాణను ప్రశంసించిన కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు
- ఫార్మా రాజధానిగా హైదరాబాద్: మంత్రి కేటీఆర్
- బయోఏషియా సదస్సు చర్చాగోష్ఠిలో పాల్గొన్న మంత్రులు
- కేటీఆర్ ప్రశ్నలకు సురేశ్‌ప్రభు జవాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న బయో ఏషియా సదస్సు చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు. చిత్రంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి సురేశ్‌ప్రభు ఉన్నారు.

ఫార్మారంగంలో తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న చొరువ అభినందనీయమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖల మంత్రి సురేశ్‌ప్రభు ప్రశంసించారు. ఫార్మా రంగం అనూహ్యంగా అభివృద్ధి చెందుతున్నదని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ రంగం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న బయోఏషియా సదస్సులో శనివారం ఆయన.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావుతో కలిసి చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. తొలుత ఇదేవేదికపై ప్రసంగించిన కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు.. ఫార్మారంగం గతంలో స్టార్టప్‌గా ఉండేదని, ఇప్పుడు సొంతరంగంగా ఎదిగిందని చెప్పారు. వైద్య రంగంలో మందుల వాడకం తప్పనిసరైన తరుణంలో పరిశ్రమను, ప్రజలను సమన్వయం చేయాలన్నారు. మంత్రి కేటీఆర్ చర్చాగోష్ఠిని ప్రారంభిస్తూ.. హైదరాబాద్.. 'ఫార్మా రాజధాని'గా నిలిచిందన్నారు. దేశంలోని మొత్తం ఫార్మా ఉత్పత్తిలో హైదరాబాద్ వాటా 35 శాతం ఉన్నదని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తవుతున్న వ్యాక్సిన్స్‌లో 35 శాతానికి పైగా ఉత్పత్తిచేస్తున్న హైదరాబాద్.. 'వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్'గా గుర్తింపు పొందిందన్నారు. చర్చాగోష్ఠిలో కేంద్ర మంత్రికి రాష్ట్రమంత్రి కేటీఆర్ పలు ప్రశ్నలు వేశారు.

మంత్రి కేటీఆర్: జీడీపీ కంటే ఫార్మారంగం వృద్ధిరేటు తగ్గింది. ప్రపంచంతో పోటీపడేలా మన పరిశ్రమను ఎలా తీర్చిదిద్దుతారు? కేంద్రం చర్యలేమిటి?

కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు: మీరు చెప్పిన విషయం మా దృష్టిలో ఉన్నది. దీని పరిష్కారానికి కృషిచేస్తా. దేశంలో ఉన్న పలు వ్యాధులను ఒకసారి గమనించండి. అవి మన దేశానికే ప్రత్యేకం. వీటిని నయంచేసేందుకు అవసరమైన మందులను మరే దేశానికి చెందిన ఫార్మా కంపెనీలు తయారుచేయలేవు. అందుకే ఆయా వ్యాధులను మనదేశ కంపెనీలు అధ్యయనం చేయాలి. పరిష్కారం చూపాలి. తద్వారా వారికి ప్రత్యేక మార్కెట్ దక్కి ఫలితం కూడా ఆశాజనకంగా ఉంటుంది.

కేటీఆర్: ఎగుమతుల ప్రోత్సాహానికి, దిగుమతుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారా?

కేంద్ర మంత్రి: ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా ఆలోచన చేయాల్సి ఉన్నది. ఏమి చేయనున్నామో ప్రత్యేకంగా చెప్పలేకపోతున్నా. ఎందుకంటే వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీవో) ఒప్పందంతో ఇది మిళితమైంది. ఔషధ పరిశ్రమను గుర్తించాల్సింది ఏమిటంటే.. డబ్ల్యూటీవోలో భాగమవ్వడం వల్ల కొత్త మార్కెట్ వస్తుంది. షరతులు కూడా వర్తిస్తాయి. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. పరిశ్రమ కూడా దీనికి సిద్ధంగా ఉండాలి.

కేటీఆర్: పరిశోధనలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారా?

కేంద్ర మంత్రి: 1996లో నేను మంత్రిగా ఉన్నప్పుడు పరిశోధనలకు ప్రోత్సాహం అందించాం. ఈ ఇరవైఏండ్లలో పరిశ్రమ ఎంతో వృద్ధిని సాధించింది. ఫార్మా రంగం వృద్ధి కోసం మరింత ప్రయత్నిస్తాం.


కేటీఆర్: స్టార్టప్‌లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారా? నానోసైన్స్ వంటి వాటికి ఏమైనా ఉంటాయా?

కేంద్ర మంత్రి: పరిశ్రమ నుంచి ప్రతిపాదనలు, ఆలోచనలు రావాలి. ఇదేమీ చిన్న పరిశ్రమ కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పోకడలను అర్థం చేసుకున్న రంగంగా తమకేం కావాలో చెప్తే.. మేం వాటిని పరిష్కరిస్తాం.

మీరు అకౌంటెంట్.. నేను బయాలజీ విద్యార్థిని

చర్చాగోష్ఠిలో కేంద్ర మంత్రి సురేశ్‌ప్రభు పలు గణాంకాలను ధారాళంగా చెప్పడంపై మంత్రి కేటీఆర్ సంభ్రమాశ్చర్యాలు వ్యక్తంచేశారు. 'అనేక గణాంకాలు వెంటవెంటనే చెప్పగలిగారు. మీలాగా ఇక్కడున్న మరెవ్వరూ చెప్పలేరు. బయాలజీ విద్యార్థినైన నాతో అయితే కష్టమే. పూర్వాశ్రమంలో మీరు అకౌంటెంట్. ఆ పరిజ్ఞానం ఉపయోగపడిందేమో' అని కేటీఆర్ చమత్కరించారు. అనంతరం కేంద్ర మంత్రి సురేశ్‌ప్రభును మంత్రి కేటీఆర్ శాలువాతో సన్మానించి కాకతీయ తోరణం ఉన్న జ్ఞాపికను బహూకరించారు. 'మీరు గొప్ప, ఆదర్శమైన నాయకుడు. మీతో వేదికను పంచుకున్నందుకు సంతోషంగా ఉన్నది' అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

లోకం పోకడ



పోనీ.. సిన్మా టికెట్లిస్తారా అనడుగుతున్నారు!

27న సీఎం సింగరేణి యాత్ర

- సీఎం పర్యటన సందర్భంగా కార్మికులకు ఒకరోజు సెలవు
- మార్చి 5న ధర్మపురి, ముధోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో పర్యటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈ నెల 27న సింగరేణి యాత్ర చేపట్టనున్నారు. మంచిర్యాలలోని శ్రీరాంపూర్ గనుల ప్రాంతంలో ఆయన పర్యటిస్తారు. అక్కడి ప్రగతిమైదాన్‌లో మధ్యాహ్నం జరిగే సమావేశంలో సింగరేణి కార్మికులనుద్దేశించి సీఎం కేసీఆర్ మాటాలడుతారు. సీఎం పర్యటన సందర్భంగా రామగుండం 1,2,3.. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ గనులకు చెందిన కార్మికులకు ఈ నెల 27న సెలవు ప్రకటించారు. శనివారం ప్రగతిభవన్‌లో సింగరేణి యాత్రకు సంబంధించి సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, ఎంపీలు కవిత, బాల్కసుమన్ సింగరేణి సీఎండీ శ్రీధర్ ఉన్నారు.

మార్చి 5న నియోజకవర్గాల్లో..

మార్చి 5న సీఎం కేసీఆర్ ధర్మపురి, ముధోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఉదయం ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గం ధర్మపురికి వెళ్తారు. అక్కడ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ధర్మపురి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో సమావేశమై, సమస్యలపై చర్చిస్తారు. అనంతరం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న ముధోల్ నియోజకవర్గంలో పర్యటిస్తారు. బాసర దేవాలయంలో పూజలు జరిపి, అక్కడి ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. సాయంత్రం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న నిర్మల్‌లో జిల్లా అధికారుల కార్యాలయాల సముదాయానికి, పోలీస్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారు.

రెవెన్యూ సిబ్బందికి నజరానా

మొదటిపేజీ తరువాయి...

ఆదేశించారు. అదే సమయంలో పట్టాదార్ పాస్‌పుస్తకాల ముద్రణ కోసం సెక్యూరిటీ ప్రింటింగ్‌ప్రెస్‌కు ఇచ్చిన టెండర్లను ముఖ్యమంత్రి రద్దుచేశారు. ముందుగా అంగీకరించిన ధరకంటే ఎక్కువ చెల్లించాలంటూ సెక్యూరిటీ ప్రింటింగ్‌ప్రెస్ మెలిక పెట్టడంతో సీఎం కేసీఆర్ ఆగ్రహించి కొత్త టెండర్లను పిలువాలని అధికారులను ఆదేశించడంతో మార్చి 2ను గడువుగా నిర్దేశిస్తూ రెవెన్యూశాఖ తాజా టెండర్లకు పిలుపునిచ్చింది. భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం, కొత్త పాస్ పుస్తకాల పంపిణీపై ప్రగతిభవన్‌లో శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని దేశంలో మరెక్కడా చేయని విధంగా వంద రోజుల వ్యవధిలోనే రెవెన్యూ ఉద్యోగులు రేయింబవళ్లు పనిచేసి విజయవంతం చేశారని ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. విధి నిర్వహణ పట్ల ఇంతటి చిత్తశుద్ధి, అంకితభావం కలిగిన ఉద్యోగులుండటం తెలంగాణ ప్రజలు, రైతుల అదృష్టంగా ముఖ్యమంత్రి అభివర్ణించారు. తెలంగాణ ప్రజలు, రైతుల పక్షాన రెవెన్యూ ఉద్యోగులకు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. 'దాదాపు 80 ఏండ్లుగా భూ రికార్డుల నిర్వహణ సరిగాలేదు. భూమి క్రయవిక్రయాలు, యాజమాన్యంలో వచ్చిన మార్పులను ఎప్పటికప్పుడు నమోదు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. దీంతో భూ రికార్డులు గందరగోళంగా మారాయి. తెలంగాణలో పంట పెట్టుబడి పథకం అమలు చేసేందుకు ఏ భూమికి ఎవరు యజమానో ఖచ్చితంగా తేలాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో భూ రికార్డులను సరిచేసి, పూర్తి పారదర్శకంగా పథకం అమలుచేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కేవలం వంద రోజుల్లోనే రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లో తిరిగి, రైతులతో మాట్లాడి భూమి యాజమాన్య హక్కులపై స్పష్టత తెచ్చారు. సొంత భూములున్న రైతులతోపాటు, అసైన్డ్‌దారుల విషయంలో కూడా స్పష్టత సాధించారు. రాష్ట్రంలో 22.5 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచగా, అందులో 20 లక్షల ఎకరాల విషయంలో స్పష్టత వచ్చింది. మిగతా రెండున్నర లక్షల ఎకరాల విషయంలో స్పష్టత కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు. కోర్టు కేసుల్లో ఉన్న భూములు, అటవీ–రెవెన్యూ శాఖల మధ్య వివాదంలో ఉన్న భూములు మినహాయిస్తే మిగతా విషయాల్లో పూర్తి పట్టు సాధించారు. ఇది సాధారణ విషయం కాదు. దేశంలో ఎవరూ సాధించని ఘనత రెవెన్యూ ఉద్యోగులు సాధించారు. వారికి ప్రోత్సాహకరంగా ఉండేందుకు ఒక నెల మూల వేతనాన్ని అదనంగా అందిస్తాం' అని సీఎం కేసీఆర్ ప్రకటించారు.

'కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉంటుందో భూ రికార్డుల ప్రక్షాళన నిరూపించింది. చిన్న జిల్లాలుండడం వల్లనే భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని నిర్వహించడం సాధ్యమైంది. కొత్త కలెక్టర్ల ప్రతిభకు, పనితీరుకు ఇది గీటురాయి. కలెక్టర్లు తమ విధిని గొప్పగా నిర్వహించారు' అని సీఎం అభినందించారు. 'తెలంగాణ రాష్ట్రంలో అధికశాతం మంది అధికారులు, ఉద్యోగులు నిజాయితీగా, చిత్తశుద్ధితో పని చేస్తున్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ ఉద్యోగుల పని తీరులో ఎంతో మార్పు వచ్చింది. కష్టపడి పనిచేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడానికి ఎంతో కృషి చేస్తున్నారు. వైద్య సిబ్బంది ఎంతగానో కష్టపడడం వల్ల ప్రజారోగ్యం మెరుగుపడింది. గతంలో రెండు లక్షల లోపే ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు జరిగేవి. ఇప్పుడా సంఖ్య చాలా పెరిగింది. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజినీర్లు, రోడ్ల నిర్మాణంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ అధికారులు, ఇంకా ఇతర శాఖల అధికారులు చాలా కష్టపడి పనిచేసి మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలు కూడా అత్యంత పారదర్శకంగా ఉన్నాయి. అవినీతికి ఆస్కారం ఇవ్వని విధంగా ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయి. ఈ పథకాలను అమలుచేస్తున్న ఉద్యోగులకు మంచి వేతనాలు లభించాలన్నదే ప్రభుత్వ అభిమతం. అందుకే తెలంగాణ వచ్చిన వెంటనే ఉద్యోగులకు 42 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేశాం. తెలంగాణ ఇంక్రిమెంటు ఇచ్చాం. భవిష్యత్తులో కూడా ఉద్యోగులకు మంచి జీతభత్యాలు ఇవ్వాలని నిర్ణయించాం' అని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు జీఆర్ రెడ్డి, సీనియర్ అధికారులు ఎస్ నర్సింగరావు, రాజేశ్వర్‌తివారీ, రామకృష్ణారావు, శివశంకర్, వాకాటి కరుణ, స్మితా సబర్వాల్, కలెక్టర్లు రఘునందన్‌రావు, ఎంవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం పట్ల కృతజ్ఞతలు

రెవెన్యూ ఉద్యోగులకు ఒక నెల బేసిక్ పే చెల్లించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినందుకు తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మఠం శివశంకర్ కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్ర తహసీల్దార్ల సంఘం స్వాగతిస్తూ హర్షం వ్యక్తంచేసింది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి, అధ్యక్షుడు గౌతంకుమార్‌లు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పట్టాదార్‌పాస్ పుస్తకాల టెండర్లు రద్దు

రైతులకు అత్యంత భద్రతతో కూడిన పట్టాదార్ పాస్‌పుస్తకాలు అందించాలన్న బృహత్ లక్ష్యం పట్ల సెక్యూరిటీ ప్రింటింగ్‌ప్రెస్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మొదటి నిర్ణయించిన ధరకు కాకుండా అధికధరను చెల్లించాలని మెలిక పెట్టడంతో సెక్యూరిటీ ప్రింటింగ్‌ప్రెస్ తీరుపై సీఎం కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భూ యజమానులందరికీ పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వడానికి ఒక్కోదానికి రూ.200 తో ముద్రించడానికి సెక్యూరిటీ ప్రింటింగ్‌ప్రెస్ ముందుకొచ్చింది. ఆ తరువాత సంస్థ ఆ ధరను రూ. 200 నుంచి రూ. 250కి పెంచాలంటూ ప్రభుత్వాన్ని కోరింది. ఈ విషయాన్ని తెలుసుకొన్న సీఎం కేసీఆర్ వారి తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ టెండర్లను రద్దు చేయాలని సూచించడంతో అధికారులు వెంటనే వాటిని రద్దుచేసి తాజాగా మళ్లీ పిలిచారు. మార్చి 2వ తేదీ మధ్యాహ్నం వరకు గడువు విధించారు. అదేరోజు మధ్యాహ్నం టెండర్లను తెరుస్తారు.



1 యాదాద్రి కొండ కింద జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో స్వామివారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం



2 లక్ష్మీనారసింహుడి కల్యాణం అనంతరం స్వామివారికి ముత్యాల తలంబ్రాల వేడుక నిర్వహిస్తున్న అర్చకులు



3 కొండ కింద నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి. చిత్రంలో విప్ గొంగిడి సునీత

జగదానందదాయకం.. నృసింహుని కల్యాణం

- యాదాద్రిలో కన్నులపండువగా మహోత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు అల్లోల, నాయిని
- భారీగా తరలివచ్చి కల్యాణతంతును వీక్షించిన భక్తజనం

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: చరాచర జగత్తు తనివితీరా దర్శించి మహదానందంతో పులకరించిపోతుండగా యాదాద్రి బాలాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు, రాత్రి కొండ కింద జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శ్రీవారి కల్యాణమహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. యాజ్ఞికులు ఎస్ శ్రీనివాసాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపూడి నర్సింహాచార్యులు శ్రీవారి కల్యాణతంతును జరిపారు. కొండకింద జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో కల్యాణ తంతు రాత్రి 8.30 గంటలకు మొదలై అర్ధరాత్రి వరకు నిర్వహించారు. తుల లగ్నంలో శ్రీస్వామి వారికి, అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్చారణలు, నాదస్వరం, భక్తినినాదాల మధ్య పరిణయనోత్సవ వేడుకను వైభవంగా జరిపించారు. దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. కలెక్టర్ అనితారామచంద్రన్, జాయింట్ కలెక్టర్ రవినాయక్, డీసీపీ రామచంద్రారెడ్డి, ఆలయ ఈవో గీత, అనువంశికధర్మకర్త బీ నర్సింహామూర్తిలు వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకను వీక్షించడానికి అశేష భక్తజనం యాదాద్రికొండకు తరలివచ్చారు.

ఉగ్ర నరసింహుడు శాంతమూర్తిగా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన శనివారం ఉగ్రనరసింహుడు శాంతమూర్తి అయిన శ్రీరాముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రమ్యమైన మోముతో చిరుచిద్విలాసంతో పల్లకీ సేవలో తిరువీధుల్లో శ్రీనారసింహుడు తరలివస్తుండగా అశేషమైన భక్తజనులు స్వామివారి సేవలో పాల్గొని తరించారు. యాదాద్రిలో ఆదివారం ఉదయం శ్రీమహావిష్ణువు అలంకారం.. రాత్రి శ్రీవారి దివ్య విమాన రథోత్సవాన్ని నిర్వహిస్తారు.



శనివారం హైటెక్స్ శిల్పకళ వేదికలో టీ న్యూస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గోల్డెన్ ప్రాపర్టీ షో-2018ను ప్రారంభిస్తున్న టీ న్యూస్ ఎండీ జోగినపల్లి సంతోష్‌కుమార్. చిత్రంలో క్రెడాయ్ తెలంగాణ, హైదరాబాద్ అధ్యక్షులు, గుమ్మి రాంరెడ్డి, ఎస్ రాంరెడ్డి కూడా ఉన్నారు.

అట్టహాసంగా 'టీ న్యూస్' గోల్డెన్ ప్రాపర్టీ షో

సీఎం కేసీఆర్ నిర్ణయాల వల్లే రాష్ట్రం నంబర్‌వన్: టీ న్యూస్ ఎండీ సంతోష్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న విప్లవాత్మకమైన నిర్ణయాల వల్లే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని టీన్యూస్ ఎండీ జోగినపల్లి సంతోష్‌కుమార్ చెప్పారు. దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా హైదరాబాద్ ఖ్యాతిగాంచిందని చెప్పారు. శిల్పకళా వేదికలో టీన్యూస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'గోల్డెన్ ప్రాపర్టీ షో'ను శనివారం సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రపంచస్థాయి సదస్సులతో హైదరాబాద్‌కు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు లభిస్తున్నదని, భాగ్యనగరంలో రియల్ రంగం పరుగులు పెడుతున్నదని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్ రాంరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఇండ్ల ధరలు పెరుగుతున్నందున, సొంతింటి కలను సాకారం చేసుకోవడానికి ఇదే మంచి తరుణమని క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు గుమ్మి రాంరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో టీ న్యూస్ సీఈవో ఎం నారాయణ్‌రెడ్డి, సీజీఎం ఎస్ ఉపేందర్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎస్ సురేశ్‌బాబు, అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ శ్రీనివాస్, రామకృష్ణ వెనూజియా వైస్ ప్రెసిడెంట్ అనిత, టీన్యూస్ ఏజీఎం ఎం కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు కలకలం

డబ్బాల్లోనివి తూనిక రాళ్లని తేల్చిన బాంబుస్క్వాడ్

మధిర, నమస్తే తెలంగాణ: భువనేశ్వర్-ముంబై వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు ఉన్నందనే వార్త శనివారం కలంకలం రేపింది. హైదరాబాద్ నుంచి వచ్చిన బాంబు నిర్వీర్య బృందం పరిశీలించి డబ్బాల్లో కాంటారాళ్లు ఉన్నట్టు తేల్చడంతో రోజంతా తలెత్తిన ఉత్కంఠకు తెరపడింది. రైలులోని ఎస్-11 కోచ్‌లో 57వ సీటు కింద తెల్లసంచిలో రెండుడబ్బాలు అనుమానాస్పదంగా ఉన్నాయని ప్రయాణికులు కోచ్ టీసీకి తెలిపారు. టీసీ వెంటనే హైదరాబాద్‌లోని రైల్వే కంట్రోల్‌రూంకు సమాచారం ఇచ్చారు. ఆ రైలు మధిర సమీపంలో ఉన్నట్టు గుర్తించి అక్కడి రైల్వేపోలీసులకు తెలుపడంతో వారు రెండుడబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫాం చివరన నిర్జన ప్రదేశంలో వాటిని పెట్టారు. బాంబ్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది తనిఖీ చేసి డబ్బాల్లో పేలుడు పదార్థాలు ఉన్నట్టు అనుమానం వ్యక్తంచేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన బాంబు నిర్వీర్య బృందం డబ్బాల్లో కాంటారాళ్లు ఉన్నట్లు తేల్చడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పద డబ్బాల్లో లభించినబాట్లు. (ఇన్‌సెట్) డబ్బాలు

బ్రెయిన్ ట్యూమర్స్‌ను ముందుగా గుర్తించగలిగితే చాలు

అత్యాధునిక శస్త్రచికిత్సలతో మెదడులో గడ్డల సమూల నిర్మూలన

సుధాకర్ (28) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అమెరికాలో వేగంగా మారిపోతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని గడువుకంటే ముందే ప్రాజెక్ట్ పూర్తిచేయాలన్న కంపెనీ ఆదేశంతో రోజు అదనపు గంటలు పనిచేస్తున్నాడు. ప్రాజెక్ట్ మూడొంతులు పూర్తయిన దశలో ఓ రోజు సాయంత్రం కాఫీ మిషన్ వద్దకు వెళ్ళేందుకు లేచి హఠాత్తుగా కళ్ళు తిరిగి పడిపోయాడు. వాంతి చేసుకున్నాడు. ఈ హఠాత్పరిణామంలో ఆందోళన చెందిన టీమ్ లీడర్ పూనుకుని వెంటనే దగ్గరలోని ఓ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు జరిపిన డాక్టర్లు మెదడులో గడ్డ (బెనిగ్న్ ప్రైమరీ ట్యూమర్) ఉన్నట్లు గుర్తించి సర్జరీ చేయించుకోవాలని సిఫార్సు చేశారు.

విపరీతంగా వేధిస్తున్న తలనొప్పితో రాజన్న (65) రోజువారీ జీవితం దుర్భరంగా తయ్యారయ్యింది. తలనొప్పికి సంబంధించిన మందులు ఏవీ పనిచేయకపోగా తాజాగా కాళ్లూ, చేతులు తిమ్మిరెక్కుతున్నాయి. నడుస్తున్నప్పుడు బ్యాలెన్స్ కోల్పోయి తూలటం మొదలయ్యింది. ఏకాగ్రత కుదరకపోవటం, జ్ఞాపకశక్తి మందగిస్తుండటంతో ముప్పయ్ సంవత్సరాలుగా నిర్వహిస్తున్న హోమ్ టూషన్స్ కూడా నిలిపివేయాల్సి వచ్చింది. రోజురోజుకు పెరిగిపోతున్న ఆరోగ్య సమస్యలతో ఆందోళన చెందిన ఈ మాజీ జూనియర్ కాలేజీ మ్యాథ్స్ లెక్చరరుకు తన తలనొప్పి లెక్క ఏమిటో ఎంతకు అంతుబట్టలేదు. ఇటీవల హైదరాబాదుకు వచ్చిన ప్రధాన ఆస్పత్రిలో చూపించుకోగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించిన డాక్టర్లు సర్జరీ చేయించుకోవలసిందిగా సిపార్సు చేశారు.

మెదడులో గడ్డ అంటే ఏమిటి?

శరీరంలోని ఇతర భాగాలలో లాగానే మెదడులో గడ్డ కూడా అసాధారణమైన కణాలు అనేకం ఒకచోట చేరి ఏర్పడే కణజాలం. సాధారణంగా మన శరీరంలోని కణాలు పెరిగి పెద్దవై చివరకు మరణిస్తుంటాయి. కొత్త కణాలు పుట్టుకొచ్చి వాటి స్థానాన్ని భర్తీ చేస్తుంటాయి. కానీ గడ్డల విషయంలో ఈ ఆరోగ్యకరమైన పరిణామం దారితప్పుతుంది. శరీర అవసరాలతో సంబంధం లేకుండా కొన్ని కణాలు ఒకచోట చేరి ట్యూమర్ కణాలుగా తయారవుతాయి. ఆపైన అవి పెరుగుతూపోయి గడ్డ ఏర్పడుతుంది. కాన్సర్‌లో ఇది మరింత అసాధారణంగా ఉంటుంది. దీనిలో కొత్తగా అసంఖ్యాక కణాలు అతివేగంగా పుట్టుకొస్తుండటమే కాకుండా ఆ కణాలు మరణించటం అనేది ఉండదు. దాంతో పెద్ద సంఖ్యలో కణాలు ఏర్పడతాయి. ఆ గడ్డ అదుపులేకుండా పెద్దదవుతూ ఉంటుంది. కొంతకాలం తరువాత ఆ కణాలు శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుని అక్కడా ఇదే విధమైన మృత్యుకణాలను పెంచుతాయి.

మెదడులో ప్రాథమిక గడ్డలు (ప్రైమరీ ట్యూమర్లు) మెదడు, కేంద్రనాడీ మండలంలోని వివిధ రకాల కణాల నుంచి ఏర్పడతాయి. వీటిలో రెండు రకాలు ఉంటాయి బెనిగ్న్ ప్రైమరీ ట్యూమర్లు, మెలిగ్నెంట్ ప్రైమరీ ట్యూమర్లు. బెనిగ్న్ ప్రైమరీ ట్యూమర్లు మెదడులో లోతుగా పాతుకుని ఉండవు. అందువల్ల అవి ఉన్న ప్రాంతంలో శస్త్రచికిత్స చేయటానికి వీలయితే వీటిని సులభంగా తొలగించి వేయగలుగుతాం. ఈ రకమైన ట్యూమర్లు కాన్సర్ కారకమైనవి కావు. ఇవి చురుకుగా ఉండి మెదడులోని ఇతర భాగాలలోని కణజాలానికి విస్తరించే అవకాశం ఏమీ ఉండదు. అయితే వీటితో సమస్య ఏమిటంటే ఒకసారి సర్జరీచేసి తీసివేసినా ఇవి తిరిగి పెరిగే అవకాశం మాత్రం ఉంటుంది. ఇవి తీవ్రమైన ప్రభావాన్ని చూపించేవిగా, కొన్ని సందర్భాలలో ప్రాణాంతకంగా కూడా తయారు కాగలవు. ఇక మెలిగ్నెంట్ ప్రైమరీ ట్యూమర్లు మాత్రం కాన్సర్ గడ్డలు. ఇవి వేగంగా పెరుగుతూ మెదడులోని చుట్టుపక్కల కణజాలంలోకి విస్తరిస్తాయి. కానీ శరీరంలోని ఇతర ప్రాంతాలలో ఏర్పడిన కాన్సర్ గడ్డల మాదిరిగా మెదడులోని కాన్సర్ గడ్డలు దేహంలోని ఇతర అవయవాలకు వ్యాపించవు. కేంద్ర నాడీమండలంలోకి భాగాలకే పరిమితం అవుతుంటాయి.

ఎందుకు ఏర్పడతాయి?

మెదడులో గడ్డలు ఎందుకు ఏర్పడతాయన్నదానికి ఖచ్చితమైన సమాధానం చెప్పటం కష్టం. అయితే పరిశోధనలు, అధ్యయనాల ద్వారా కొన్ని ప్రత్యేక పరిస్థితులు బ్రెయిన్ ట్యూమర్స్‌కు దారితీస్తున్నట్లు గుర్తించారు. చిన్నవయస్సులో తలకు రేడియేషన్ ఇస్తే తరువాత దశలో వారి మెదడులో గడ్డలు ఏర్పడుతున్నాయి. అదే విధంగా కొన్ని కుటుంబాలలో వంశపారం పర్యంగా మెదడులో గడ్డలు ఏర్పడుతుండటాన్ని గమనించారు. వయస్సు పైబడటం కూడా మెదడు లో గడ్డలు ఏర్పడటానికి కారణం అవుతున్నది. ఏ వయస్సు వారిలో నైనా బ్రెయిన్ ట్యూమర్స్ ఏర్పడవచ్చు. అయితే బ్రెయిన్ టూమర్ల వ్యాధిగ్రస్థులలో 65-79 సం.ల మధ్య వయస్సుగల వారి సంఖ్య ఎక్కువగా ఉంటున్నది. మరి మెదడులో గడ్డలను గుర్తించటం ఎలా? ఈ గడ్డలన్నీ కాన్సర్లేనా?



బ్రెయిన్ ట్యూమర్లకు అందుబాటులో ఉన్న చికిత్సలు ఏమిటి? వీటికి సమాధానాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తే బ్రెయిన్ ట్యూమర్స్‌కు నమ్మకమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయనేది తెలుస్తుంది. సరైన సమయంలో గుర్తించి చికిత్స చేయించుకుంటే మెదడులో గడ్డలతో బాధపడినవారు ఆ తరువాత సాధారణ జీవితం గడపవచ్చు అన్న విషయం వెల్లడి అవుతుంది.

బ్రెయిన్ ట్యూమర్ల లక్షణాలు

మెదడులోని వివిధ భాగాలు వేర్వేరు బాధ్యతలను నిర్వర్తిస్తూ శరీరంలోని భిన్నఅవయవాలను నియంత్రిస్తుంటాయి. అందువల్ల ట్యూమర్ ఏర్పడిన భాగం మెదడు తన విధులను నిర్వహించటంలో లోటుపాట్లు ఏర్పడతాయి. ఫలితంగా మెదడులో గడ్డ ఏర్పడిన ప్రదేశం, ఆ ట్యూమర్ రకాన్నిబట్టి మెదడులో ఆయా గడ్డలకు సంబంధించిన వ్యాధి లక్షణాలు వ్యక్తం అవుతుంటాయి. బ్రెయిన్ ట్యూమర్లు అన్నింటిలో కనిపించే సాధారణ లక్షణం తలనొప్పి. ఇది సంప్రదాయ తలనొప్పి లాగా బాధానివరణి మాత్రలకు, చికిత్సకు ఏమాత్రం లొంగదు. పైగా కాళ్లూ, చేతులు తిమ్మి రెక్కుతాయి. జలదరించినట్లు అవుతుంటుంది, ఏకాగ్రత కుదరదు. జ్ఞాపకశక్తికి సంబంధించిన సమస్యలు ఎదురవు తుంటాయి. మానోభావా లలో-వ్యక్తిత్వంలో మార్పులు కనిపిస్తాయి. నడుస్తున్నప్పుడు బ్యాలెన్స్ కోల్పోయి తూలుతుంటారు. పొట్టలో వికారంగా ఉండి వాంతు లవుతుంటాయి. వినికిడి-దృష్టిలో ఇబ్బందులు ఏర్పడుతాయి. కొన్నిట్యూమర్లు బాగా పెద్దవిగా మారి తీవ్రమైన సమస్యగా తయారయి ఆరోగ్యం వేగంగా దిగజారే పరిస్థితి ఏర్పడే దాకా ఎటువంటి వ్యాధి లక్షణాలను వ్యక్తం చేయవు. మరికొన్ని మెదడు గడ్డలు నెమ్మదిగా పెరుగుతూ వ్యాధి లక్షణాలు వెల్లడిస్తుంటాయి.

కాన్సరస్ బ్రెయిన్ ట్యూమర్లలో రకాలు.

మెదడులోని ఏ కణజాలంలో గడ్డలు ఏర్పడ్డాయన్న అంశం ఆధారంగా ఈ బ్రెయిన్ ట్యూమర్లను రెండు రకాలుగా గుర్తిస్తారు. మొదటి రకం గ్లియోమాస్. ఇవి మెదడులో అత్యధికంగా కనిపించే గడ్డలు. నాడులను ఆరోగ్యంగా ఉంచే అస్ట్రోసైట్స్‌గ్లియల్ కణజాలం కణాల నుంచి ఈ గడ్డలు ఏర్పడతాయి. ఆ తరువాత మెదడులో కనిపించే అత్యధిక ట్యూమర్ కణజాలం మెనిన్ జియల్ కణాలతో కూడినది. ఈ గడ్డలు మెదడు, వెన్నును కప్పివుంచే సన్నని పొరయిన మెనిన్జెస్ కణాల నుంచి ఏర్పడతాయి. అదే విధంగా మెదడులో ఎర్పడే గడ్డలను వైద్యనిపుణులు నాలుగు స్థాయిలు (గ్రేడ్లు)గా విభజిస్తారు. బ్రెయిన్ ట్యూమర్‌లోని కణజాలాన్ని మైక్రోస్కోప్‌లో చూసిచేసే ఈ గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్-4 విభజనలో మొదటి స్థాయి గడ్డలో అసాధారణ కణాల సంఖ్య స్వల్పంగా ఉంటుంది. కణాలు సాధారణ మెదడు కణాల లాగానే కనిపిస్తాయి. వాటి సంఖ్య నెమ్మదిగా పెరుగుతుంటుంది. గ్రేడ్-2లో కణాలు కాన్సర్ లక్షణాలను సంతరించు కోవటం ప్రారంభిస్తాయి. సాధారణ మెదడు కణాలతో పోలిస్తే కొంత భిన్నంగా అగుపిస్తాయి. మూడో స్థాయిలో కణాలు భిన్నమైనవిగా కనిపిస్తూ వేగంగా సంఖ్యను పెంచుకుంటూంటాయి. గ్రేడ్-4కు వచ్చే సరికి గడ్డలోని కణాలపూర్తిగా భిన్నమైనవి గా ఉండి అతి వేగంగా సంఖ్యను పెంచుకుంటూ ట్యూమర్ పెదద్దిగా మారిపోతుంటుంది.

చికిత్స

బ్రెయిన్ ట్యూమర్ల చికిత్స ఇటీవలి సంవత్సరాలలో చాలా అభివృద్ధి చెందింది. ఇదివరకు ఎన్నడూ లేనంత సురక్షితంగా, ఖచ్చితంగా పనిచేసే శస్త్రచికిత్సలు, రేడియేషన్ థెరపీ, కిమోథెరపీ చికిత్స పద్ధతులు ఇపుడు అందుబాటులోకి వచ్చాయి. మెరుగైన ఫలితాలు, వేగవంతమైన ఉపశమనం కోసం చాలా సందర్భాలలో ఒకటి కంటే ఎక్కువ పద్ధతులను ఉపయోగించటం ప్రాచుర్యంలోకి వచ్చింది. యశోద హాస్పిటల్స్‌లోని న్యూరో ఇనిస్టిట్యూట్‌లో బ్రెయిన్ ట్యూమర్స్ చికిత్సకోసం అత్యాధునిక వైద్యపరికరాలు, ప్రత్యేక ఐ.సి.యూ.తోపాటు దేశవిదేశాలలోని అగ్రశ్రేణి వైద్యకేంద్రాలలో శిక్షణపొందిన-పనిచేసిన న్యూరో సర్జన్లు-న్యూరో ఫిజీషియన్లు నిరంతరం అందుబాటులో ఉంటున్నారు. ట్యూమర్ రకం-దాని గ్రేడ్, పరిమాణం, మెదడులో అది ఉన్న ప్రదేశం, వ్యక్తి వయస్సులను పరిగణనలోకి తీసుకుని వైద్య నిపుణులు మెదడులో గడ్డలకు చికిత్సా పద్ధతి ఎంపిక చేస్తుంటారు.కొన్ని సందర్భాలలో సెరిబల్ ఫ్లూయిడ్‌లో కాన్సర్ కణాలు ఏమైనా ఉన్నాయా అన్న విషయం వారు ముందుగా నిర్ణారించుకుంటారు. రేడియేషన్ అవసరమని భావించినపుడు దీర్ఘకాలిక ప్రభావాలను వ్యాధిగ్రస్థులు-కుటుంబసభ్యులకు వివరిస్తారు.

కాన్సర్‌కారక మెదడు గడ్డల చికిత్సలో మొదట శస్త్రచికిత్సచేసి వీలైనంత మేరకు ఆగడ్డను తీసివేస్తారు. శస్త్రచికిత్స ద్వారా మెదడులోని గడ్డను సంపూర్ణంగా తీసివేయాలన్న లక్ష్యంతో పని చేస్తారు. తరువాతిదశలో ఆ కాన్సర్ గడ్డ రకం, వ్యాధిగ్రస్థుల శరీర స్థితిని దృష్టిలో ఉంచుకుని కీమోథెరపీ లేదా రేడియో థెరపీతో చికిత్స చేస్తారు. కొంతమందిలో తీవ్రంగా ఉన్న వ్యాధి లక్షణాలను అదుపుచేయటానికి మొదట కీమోథెరపీని ఉపయోగిస్తున్నారు. గడ్డలోని కొంత భాగాన్ని తొలగించినా ఎంతో ఉపశమనం లభిస్తుంది. మెదడుపై ఒత్తిడి తగ్గిన ఈ స్థితిలో పూర్తి ఉపశమనం కోసం రేడియేషన్, కిమోథెరపీలలో తగిన విధానాన్ని ఎంపికచేయానికి వీలు చిక్కుతుంది. వీటి చికిత్సకు మందులను ఉపయోగించటం (కీమోథెరపీ) ద్వారా సర్జరీ ద్వారా తొలగించగా మెదడు గడ్డకు సంబంధించి ఇంకా మిగిలి ఉన్న ట్యూమర్ కణాలను నాశనం చేస్తారు. బ్రెయిన్ ట్యూమర్ చికిత్స చేయించుకున్న వారిలో డెబ్బయ్ శాతం మంది అయిదేళ్లకు పైగా జీవిస్తున్నారు. చికిత్స వల్ల జీవనకాలం పెరగటం, వ్యాధి లక్షణాలు పూర్తిగా అదుపులోకి రావటం కారణంగా మెదడులో గడ్డలకు చికిత్స పట్ల ఆసక్తి, చికిత్సా ఫలితాల పైన విశ్వాసం పెరుగుతున్నాయి. తక్కువ స్థాయి(గ్రేడ్-1, గ్రేడ్ -2) బ్రెయిన్ ట్యూమర్లను సర్జరీ ద్వారా తొలగించి వేస్తారు. ఆపైన క్రమం తప్పకుండా పరీక్షిస్తూ ఆ గడ్డలు తొలగించిన ప్రాంతంలో మార్పులను పరిశీలిస్తూ ఉంటారు. మెదడులో ఏర్పడిన ట్యూమర్లను తొలగించటంతోపాటు వారు సాధారణ జీవితం గడపేందుకు సిద్ధం చేయటం బ్రెయిన్ ట్యూమర్ల చికిత్సలో భాగంగా రూపొందింది. చికిత్సానంతరం పాటించాల్సి న ప్రత్యేక జాగ్రత్తలను తెలియజేస్తారు. చికిత్స పొందిన వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని, అవసరా లను దృష్టిలో ఉంచుకుని ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీలను సిఫార్సు చేస్తారు. బ్రెయిన్ ట్యూమర్ల చికిత్స తరువాత పలు జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. క్రమం తప్పకుండా డాక్టరుకు చూపించు కుంటూ ఉండాలి. కోలుకున్న తరువాత వ్యక్తి నెమ్మదిగా తన పూర్వపు వృత్తి ఉద్యోగ బాధ్యతలను చేపట్ట గల అవకాశాలను పరిశీలించాలి. ఇందుకు గాను వైద్యులతోపాటు కుటుంబ సభ్యుల సహకారం, పూర్తి మద్దత్తు అవసరం అవుతుంది.



డాక్టర్ ఆనంద్ బాలసుబ్రమణియమ్
సీనియర్ న్యూరో సర్జన్
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్



డాక్టర్ బి.జె. రాజేష్
సీనియర్ న్యూరో సర్జన్
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్



డాక్టర్ సవిత్ర్ శాస్త్రి
సీనియర్ న్యూరో సర్జన్
యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ



డాక్టర్ శ్రీనివాస్ బొట్ల
సీనియర్ న్యూరో సర్జన్
యశోద హాస్పిటల్స్, మలక్‌పేట్



డాక్టర్ వేణు గోపాల్
సీనియర్ న్యూరో సర్జన్
యశోద హాస్పిటల్, మలక్‌పేట్

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం, 25 ఫిబ్రవరి 2018
WWW.NTNEWS.COM

మన విలువలే మనకు బలం

అంకుశం



పరాంకుశం వేణుగోపాల స్వామి

చిన్నప్పుడు మా ఇంటిలో 'కెనెడీ భావపరంపర' అనే పుస్తకం ఉండేది. అందులో కెనెడీ ప్రసంగాలు, ఫోటోలు ఉండేవి. కెనెడీ హత్య తరువాత, ఆయన భౌతిక కాయాన్ని తీసుకుపోతున్నప్పుడు, చిన్నకుమారుడు చివరి సాల్యూట్ చేస్తున్న ఫోటో చిన్నప్పుడు నన్ను కదిలించింది. నెహ్రూ ప్రధానిగా ఉన్నకాలంలోనే, కెనెడీ అమెరికా అధ్యక్షుడై అనతికాలంలోనే హతుడయ్యాడు. అప్పటి రెండు దేశాల మధ్య మైత్రి మైత్రికి సూచికనే తెలుగులో కెనెడీ పుస్తకం. 1962లో చైనా యుద్ధం జరిగినప్పటి మరో పుస్తకం 'శంఖారావం' అనే కవితా సంపుటి, ఆనాటి ఉపాధ్యాయులు (ఇతరులు కూడా ఉండి ఉంటారు) కవితలు రాసి ప్రచురించిన దేశభక్తి రచనలవి. చైనాను తరుమడం, భారత జెండా ఆకాశంలో రెపరెపలాడటం ఆ కవితల్లో ఉండేది. ఆ యుద్ధంలో చైనాది పై చేయి అయిందనేది ఎవరూ పరోక్షంగా కూడా ప్రస్తావించక పోయేవారు. నెహ్రూ దార్శనికతతో ప్రభావితమైన తరమది. ప్రజాస్వామ్య లౌకిక భావాలు బలంగా ఉండేవి. కెనెడీ– నెహ్రూ తరువాత కాలంలో సోవియెట్ యూనియన్‌తో మైత్రి నెలకొన్నది. మా ఇంటిలో 'సోవియెట్ భూమి' రంగుల క్యాలెండర్ ఏటా కొత్తది వేలాడుతుండేది. సోవియెట్ భూమి పత్రిక కోసం ఎదురు చూసేటోళ్ళం. కెనెడీ పుస్తకం చూసిన తరువాత మా అన్నను అడిగాను– అమెరికా మంచిదా, రష్యా మంచిదా అని. కెనెడీ ఉన్నప్పుడు అమెరికా, ఆ తరువాత రష్యా శాంతియుత దేశం అని ఆయన చెప్పారు.

అమెరికా స్వాతంత్ర్యం పొందిన కొత్తలో వలసవాద వ్యతిరేక పోరాటాలకు మద్దతు ఇచ్చేది. కానీ వలసవాద వ్యతిరేకత వంటి విలువలు ఆనాటి అమెరికా ప్రయోజనాలకు అనుగుణమైనవి. యూరోపియన్ సామ్రాజ్యాలు బలహీనమయ్యే వరకే ఆ విలువలు పనిచేసినయి. ఈ విషయంలో 1898 నాటి అమెరికా స్పానిష్ యుద్ధాన్ని మైలురాయిగా చెప్పుకోవచ్చు. స్పెయిన్ సామ్రాజ్యాన్ని ఎదిరించడానికి క్యూబా పోరాటాన్ని సమర్థించిన అమెరికా ఆ తరువాత తాను ఒక వలసవాదిగా అక్కడ బైఠాయించింది. పసిఫిక్ సముద్రంలో– స్పెయిన్ సేనలను ఓడించి ఫిలిపీన్స్‌ను స్వాధీ నం చేసుకున్నప్పుడు అమెరికా సామ్రాజ్యవాదంపై ఇంకా ఎవరికీ అనుమానాలు లేవు. ఆ తరువాత కాలంలో అమెరికా– సోవియెట్ యూనియన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం ఇటీవలి చరిత్ర. సోవియెట్ యూనియన్ కుప్పకూలిపోవడం, అమెరికా ఏకచ్ఛత్రాధిపత్యం కూడా చూసినం. ఇప్పుడు అమెరికా ప్రాబల్యం క్షీణించడాన్ని కూడా చూస్తున్నాం.

1960 దశకంలోని భారత్‌కు, ఇప్పటికీ ఎంతో తేడా ఉన్నది. ఆనాడు అలీన దేశంగా అంతర్జాతీయ వేదికలపై తన గొంతు వినిపించినప్పుడు అది– నైతిక బలం మాత్రమే. కానీ ఇప్పుడు ప్రాంతీయశక్తిగా నిలువడానికి ప్రయత్నిస్తున్నది. బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో భారత్ కీలక పాత్ర పోషించింది. పాకిస్థాన్‌ను ముక్కలు చేయడంగా కాకుండా, బంగ్లాదేశ్ విముక్తిలో భారత్ పోషించిన పాత్ర విలువలతో కూడినదిగా మనం అర్థం చేసుకున్నాం. శ్రీలంకలో తమిళ టైగర్లకు మద్దతు ఇవ్వడాన్ని కూడా నైతిక కోణంలోనే చూశాం. కానీ శ్రీలంకకు సైన్యాన్ని పంప డం పట్ల మాత్రం భిన్నమైన అభిప్రాయాలు కలిగాయి. మన దేశం ప్రాంతీయంగా ప్రాబల్యాన్ని పెంచుకుంటున్నదనేది ఇప్పుడు చాలామందికి అవగాహనకు వచ్చింది. అయితే దీనిని విలువలతో కూడిన విదేశాంగ నీతిగానే భావిస్తున్నారు తప్ప, ఆధిపత్యభావన అనేదిగా లేదు. భారతీయులు అమెరికా సమాజం అంటే ఇష్టపడుతరు. కానీ అంతర్జాతీయ రంగంలో అమెరికా పాత్ర పట్ల అనుమానం గా చూస్తరు. ఆయా దేశాల విధానాలతో నిమిత్తం లేకుండా, పాశ్చాత్య సమాజాలతో భారతీయులు కలిసిపోవడానికి కారణం – రాజకీయ విలువలే.

చైనాతో యుద్ధం సాగినప్పుడు అమెరికా మైత్రి ఉపయోగపడలేదు. చైనాతో సరిహద్దు వివాదం ఇంకా రగులుతూనే ఉన్నది. ఈ ఘర్షణ సరిహద్దుకు మాత్రమే పరిమితం కాలేదు. దక్షిణాసియా ప్రాంతానికి, హిందు మహాసముద్రంలోకి విస్తరించింది. చైనా, భారత్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సాగుతున్నదని ఇటీవలి విశ్లేషణలు వినబడుతున్నాయి. చైనా దృష్టి అమెరికా మీద ఉన్నది. హిందు మహాసముద్రంలో, అందులోనూ పాక్ జలసంధి నుంచి (ఇంకా చెప్పాలంటే ఆడాన్ జలసంధి నుంచి) మలాకా జలసంధి వరకు నౌకా మార్గాలు కీలకమైనవి. వీటిపై పట్టు కోసం అమెరికా, చైనా మధ్య పోటాపోటీగా ఉన్నది. భారత్ అమెరికావైపు మొగ్గు చూపుతున్న క్రమంలో చైనాతో పరోక్షంగానైనా ఘర్షణ తలెత్తవచ్చు. వర్ధమాన ఆర్థిక వ్యవస్థలుగా చైనా, భారత్ పేర్లను కలిపి చెబుతున్నప్పటికీ రెండు సమానంగా లేవు. చైనా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. బలమైన సైనిక శక్తి. కృత్రిమ మేధ, జన్యుశాస్త్రం, నానో టెక్నాలజీ వంటి ఏ రంగంలో చూసినా పరిశోధనలు భారీగా సాగుతున్నాయి. భౌగోళిక రాజకీయాలలో అమెరికాతో సై అంటే సై అంటున్నది.

> భారత్ ఆంతరంగికంగా తన ఉదారవాద ప్రజాస్వామిక, లౌకిక విలువలను కాపాడుకున్నప్పుడే, చుట్టుపక్కల దేశాలకు మార్గదర్శనం చేయగలుగుతుంది. దక్షిణాసియాలోనే కాదు, పాశ్చాత్య దేశాలలోనైనా, ఏ ఖండంలోనైనా మన దేశం నిలబడగలిగేది మన విలువల ప్రాతిపదికగానే.

చైనాను కట్టడి చేయడం ఎట్లా అనేది భారత్‌లో సాగుతున్న చర్చ.ప్రధాని మోదీ అధికారానికి కొత్తలో పొరుగు దేశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు కనిపించారు. కానీ వ్యూహపరమైన వైఫల్యాలే ఎక్కువ కనిపిస్తున్నాయి. నేపాల్‌తో ఎన్నిసార్లు వివాదాలు తలెత్తినా రెండు సమాజాలు పాలు నీళ్ళ మాదిరిగా కలిసిపోయేవి. కానీ ఇటీవలి దిగ్బంధం తరువాత భారత్ పట్ల నేపాల్ సమాజంలో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తున్నది. కమ్యూనిస్టుపార్టీలు ఏకమై అధికారం చేపట్టడంలో చైనా తెరవెనుక పాత్ర ఉన్నది. భారత్ నుంచి సరఫరాలు లేకుండా నేపాల్ మనగలగడం కష్టం. అయినా చైనాతో సుహృద్భావం పెరిగింది. శ్రీలంకలో రాజపక్సే ప్రభుత్వం చైనాకు అనుకూలంగా ఉండేది. నిరంకుశ పాలకుడైన రాజపక్సేకు వ్యతిరేకంగా భిన్న రాజకీయశక్తుల ఐక్య సంఘటన ఏర్పడి అధికారానికి వచ్చింది. ఈ ప్రయోగం వెనుక భారత్ పాత్ర ఉందంటారు. కానీ ఇటీవలి అక్కడ కూడా చైనా అనుకూల పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. 1988లో మాల్దీవులలో భారత్ ఆపరేషన్ కాక్టస్ పేర సైనిక చర్య జరిపింది. చాలా కాలంగా అక్కడి రాజకీయాలను ప్రభావితం చేస్తున్నది. కానీ ఇప్పుడు అక్కడ భారత వ్యతిరేక ప్రభుత్వం ఏర్పడ్డది. మాల్దీవులకు సమీపంలోకి చైనా యుద్ధ నౌకలు చేరుకున్నాయి. ఒక భూటాన్ మినహా, భారత్ పొరు గు దేశాలన్నీ చైనా వన్ బెల్ట్ వన్ రోడ్ పథకంలో భాగమవుతున్నాయి. దక్షిణాసియా ప్రాంతంలో భారత్ ఆధిపత్య ధోరణి నడువాలని కాదు కానీ, వ్యతిరేక పరిస్థితులు ఏర్పడటం అభిలషణీయం కాదు. అమెరికాను నమ్ముకుని చైనాను ఢీకొనడం కూడా మంచిది కాదు. ఈ నేపథ్యంలో భారత్ విధానం ఏమై ఉండాలనే చర్చ సాగుతున్నది.

భారత విదేశాంగ విధానం మీద ఇటీవల దౌత్యవేత్తలు, అంతర్జాతీయ విశ్లేషకులు వెలుబుచ్చిన అభిప్రాయాలను పరిశీలిస్తే– రెండు సూచనలు ఆలోచింపదగినవిగా ఉన్నయి. అందులో ఒకటి– చైనాను కట్టడి చేయాలంటే భారత్ ఏమి చేయాలనేది. చైనాను ఎదుర్కోవడానికి భారత్ ఎన్ని యుక్తులు పన్నినా లాభం లేదు. చైనాను తట్టుకోవడానికి ఏకైక మార్గం భారత్ కూడా ఎదుగడమే. మన దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందితే అదే మనకు బలం, చైనాకు చెక్. రెండవ సూచన– సైనికంగా, ఆర్థికంగా చైనాను ఎదుర్కోవడం కష్టం. ఇటువంటి పరిస్థితుల్లో భారత్ వ్యూహం ఏమై ఉండాలె? చైనాకు భిన్నంగా భారత్ ప్రజాస్వామిక రాజ్యం. ఉదారవాద విలువలు కలది. ఇదే మన దేశానికి బలం. నెహ్రూ కాలం నుంచి మన దేశానికి బలం మన దేశం ఆచరిస్తున్న విలువలే. పొరుగు దేశాలలో మన విలువలను ప్రచారం చేయాలె. భారత్ ప్రజాస్వామ్య లౌకిక రాజ్యంగా మనగలగాలంటే, చుట్టూ రా కూడా ఉదారవాద ప్రజాస్వామ్య వ్యవస్థలు ఉండాలని కోరుకోవాలె. చుట్టూరా దేశాలలో ప్రజాస్వామిక విలువల కోసం పోరాడే శక్తులకు మద్దతు ఇవ్వాలె. చైనాకు ఉన్న బలహీనత మన బలం ప్రజాస్వామిక విలువలే.

భారత్ ఆంతరంగికంగా తన ఉదారవాద ప్రజాస్వామిక, లౌకిక విలువలను కాపాడుకున్నప్పుడే, చుట్టుపక్కల దేశాలకు మార్గదర్శనం చేయగలుగుతుంది. దక్షిణాసియాలోనే కాదు, పాశ్చాత్య దేశాలలోనైనా, ఏ ఖండంలోనైనా మన దేశం నిలబడగలిగేది మన విలువల ప్రాతిపదికగానే.

pvegos@gmail.com

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

తెలంగాణం



కర్నె ప్రభాకర్

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా, విద్యావంతులుగా మారితేనే తెలంగాణ పరిపూర్ణ సౌభాగ్య రాష్ట్రంగా విరాజిల్లుతుందన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ భావన. ఇందులోభాగంగానే ఉమ్మడి పాలనలో జరిగిన అన్యాయాలను సరిద్దిడానికి మూడున్నరేండ్లుగా ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తూనే నిరక్షరాస్య నిర్మూలన, ప్రజల ఆరోగ్యంపై కూడా దృష్టి సారించింది. కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య కార్యక్రమం అమలులో భాగంగా విద్యారంగాన్ని ప్రక్షాళన చేస్తున్న ప్రభుత్వం ఏ రాష్ట్రంలో లేనన్ని గురుకుల పాఠశాలలను ప్రారంభించి విద్యను పేద వర్గాలకు చేరువ చేస్తున్నది. మనిషి సరైన విద్యను అందుకోవాలంటే ముందు ఆరోగ్యవంతుడుగా ఉండాలి. ఉమ్మ డి పాలకులు సర్కారీ వైద్యాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలోనైతే పరిస్థితి మరింత ఘోరంగా ఉండేది. మన్యం ప్రాంతంలో అతిసారా, విషజ్వరాలు ప్రబలి వందలాదిమంది మరణించే దయనీయ పరిస్థితులు ఉండేవి. గత పాలకులు ప్రభుత్వ వైద్యాన్ని సర్వనాశనం చేసినందున టెక్నాలజీ ఇంత అభివృద్ధి జరిగిన ఈ రోజుల్లో కూడా మారుమూల గ్రామాల ప్రజలు భూతవైద్యులనే నమ్ముకొని ప్రాణాలమీదకు తెచ్చుకున్న సందర్భాలను ఎన్నో మన గతంలో చూశాం. ఈస్థితిలో ఎన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా ఆరోగ్యవంతుడు కాని వ్యక్తి మనుగడే ప్రశ్నార్థకం కాబట్టి ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి.

> పేద ధనిక తేడా లేకుండా ముఖ్యమైన 52 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రభుత్వమే ఉచితంగా చేయిస్తున్న ఘనతతో తెలంగాణ ప్రభు త్వం చరిత్రకెక్కుతుందనడంలో అతిశయోక్తి లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా దాని వెనుక ముఖ్యమంత్రి అధ్యయనం, అనేకమంది వ్యక్తుల అనుభవాలు క్రోడీకరించి ఉంటాయి.

ఇప్పటి వరకు అనేక సమస్యలతో ఛిన్నాభిన్నమైన తెలంగాణ పౌరసమాజం తమ కుటుంబాలకు నిలదొక్కుకోవాలన్న ఆరాటంతోనే సమయం గడిచిపోయింది. వాతావరణ మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం రసాయనాల కాలుష్యంతో లోపభూయిష్టమైన తిండిగింజలు, స్వచ్ఛత లేని నీరు తదితర కారణాల వల్ల అన్ని వర్గాల వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అనారో గ్యం. క్యాన్సర్, మూత్రపిండాల, గుండె సంబంధిత వ్యాధులు రావడం, వాటి గురించి తెలిసేలోపే ప్రాణాలు కోల్పోయే క్రమంలో ఈ మధ్య మరణాల సంఖ్య తీవ్రంగా పెరుగుతుండటం బాధాకరం. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడే నాటికి వైద్యరంగంలో ఆవరించిన ఉన్న దారుణమైన పరిస్థితిని చక్కదిద్ది సంపూర్ణ ఆరోగ్య తెలంగాణ దిశగా నడిపించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ వైద్యరంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టి సత్ఫలితాలు రాబడుతున్నారు.

వైద్యాన్ని ప్రజల ప్రాథమికహక్కుగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఈ మూడున్నరేండ్లుగా వైద్య రంగానికి సాలీనా ఆరువేల కోట్ల వరకు కేటాయిస్తూ ప్రభుత్వ దవాఖానల నిర్వహణలో సంస్కరణలు చేపట్టింది. ఆరుగురు సభ్యులతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఏర్పాటైంది. ప్రభుత్వ దవాఖానల్లో ఒక్కో బెడ్ నిర్వహణకు ప్రతి నెల సగటున రూ. 5016 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. రూ.600కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ దవాఖానల కోసం మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 40 డయాలిసిస్‌సెంటర్లు, 40 డయాగ్నొస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నా రు. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న ఉస్మానియా, గాంధీ దవా ఖానలకు తోడుగా మరో నాలుగు వెయ్యి పడకల పెద్ద దవాఖా నలను నిర్మించబోతున్నారు. కింగ్‌కోటి దవాఖానస్థాయిని పెంచి మల్టీస్పెషాలిటీ దవాఖాన మారుస్తున్నారు. 92 అర్బన్ హెల్త్ సెంటర్లను పీహెచ్‌సీల స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తున్నారు. కేంద్ర ఏరి యా దవాఖానల్లో 20ఐసీయూలను ఏర్పాటు చేశారు. శాన్–ఐపీవీ వ్యాక్సిన్ ద్వారా శాశ్వత పోలియో పరిష్కారం కోసం ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే శిశువు తల్లి గర్భంలో పడిన నాటి నుంచి కాలం చేసిన వారి భౌతికకాయాలను దవాఖానల్లోని మార్చూరీల వద్ద నుంచి స్వస్థలాలకు తరలించేంత వరకు ప్రభుత్వం ప్రజలను కంటికి రెప్ప లా చూసుకునేలా పథకాల రూపకల్పన జరిగింది. అంతిమయాత్ర వాహనాలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 50వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. తమ ఇంటి మనిషి చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబసభ్యుల అసహాయ స్థితిని సొమ్ము చేసుకునేందుకు శవాన్ని తరలించడానికి వాహనాలకు అడ్డగోలు కిరాయిలు డిమాం డ్ చేసే దారుణమైన పరిస్థితి నుంచి ప్రభుత్వ విధానం ద్వారా పేదవర్గాలకు ఊరట కలిగింది.

శిశువు తల్లి గర్భంలో పడిన నాటి నుంచే జాగ్రత్తలు తీసుకునేలా ప్రభుత్వం పథకాలను రూపకల్పన చేసింది. తెలంగాణ ప్రభుత్వం మహిళాశిశు సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నదనడానికి 'కేసీఆర్ కిట్' పథకం నిలువెత్తు నిదర్శనం. కార్పొరేట్ దవాఖానల్లో అవసరం లేకు న్నా సిజేరియన్ శస్త్రచికిత్సలు చేస్తూ మహిళల ప్రసవాలను కూడా వ్యాపారంగా మార్చిన పరిస్థితిని మనం చూశాం. ఇక పేదరికం అనుభవిస్తున్న మహిళలు అటు కార్పొరేట్ దవాఖానలకు వెళ్లలేక, ఇటు సర్కారు దవాఖానాల్లో సరైన వసతి లేక నాటు పద్ధతుల్లో పురుడుపోసే పరిస్థితులు నేటికీ ఉన్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికే కేసీఆర్ కిట్ పథకం వచ్చింది. మహిళలు, శిశువుల సంక్షేమంపై, వారి ఆరోగ్యం పై ప్రభుత్వం పెట్టిన శ్రద్ధకు నిదర్శనమిది. ప్రజారోగ్యానికి పూర్తి భరోసా కలిపిస్తున్న కేసీఆర్ ప్రభుత్వం తాజాగా మరో విప్లవాత్మక కార్యక్రమానికి రూపమిస్తున్నది. అదే 'తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్'. ఈ సెంటర్ ద్వారా ప్రజలందరికీ ఉచితంగా 52 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటువంటి ఆలోచన చేసిన తెలంగాణ ప్రపంచంలో నే మొదటి రాష్ట్రంగా నిలిచిందని చెప్పవచ్చు.

అమెరికాలాంటి అగ్ర దేశాల్లో అక్కడి పౌరులకు ఆరోగ్య బీమా ద్వారా వైద్య సదుపాయం కలిపిస్తున్నది. ఆ దేశాల్లో ప్రతి కుటుంబం కూడా ఒక మెడికల్ బడ్జెట్ కేటాయించుకుంటుంది. అలా మెడికల్ బడ్జెట్ కేటాయించడం మన లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సాధ్యం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ప్రభుత్వ వైద్యం పైనో, లేక సొంత డబ్బులతో ప్రైవేట్ వైద్యం చేయించుకోవడం జరుగుతున్నది. ఈస్థితిలో గ్రామంలో రైతు కూలి నుంచి మొదలు ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి వరకూ ఆరోగ్యాన్ని పరిరక్షించే బాధ్యతను ప్రభుత్వమే భుజాన వేసుకున్న తెలంగాణ ప్రపంచంలోనే మొదటి రాష్ట్రంగా నిలుస్తుంది. రక్త, మల, మూత్ర పరీక్షలతో పాటు టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా జ్వరాల నిర్ధారణ, కాలేయం, మూత్ర పిండాలు, థైరాయిడ్ పనితీరును తెలుసుకోవడానికి, రక్తంలో కొలెస్ట్రాల్, రక్తంలో మూడు నెలల సగటు చక్కెరస్థాయి తదితర ఖరీదైన పరీక్షలను ప్రభుత్వం ఉచితంగా అందించాలని నిర్ణయించడం గొప్ప నిర్ణయం. దీనికి సంబంధించి ట్రయల్ రన్ నడుస్తున్నది. పేద ధనిక తేడా లేకుండా ముఖ్యమైన 52 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రభుత్వమే ఉచితంగా చేయిస్తున్న ఘనతతో తెలంగాణ ప్రభు త్వం చరిత్రకెక్కుతుందనడంలో అతిశయోక్తి లేదు. రాష్ట్ర ప్రభు త్వం ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా దాని వెనుక ముఖ్యమంత్రి అధ్యయనం, అనేకమంది వ్యక్తుల అనుభవాలు క్రోడీకరించి ఉంటాయి. లంబాడీ తండా నుంచి గోండు గూడెం వర కూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శాస్త్రీయంగా ఆలోచించి పథకాన్ని ప్రవేశపెట్టడం దాని అమలులో ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షించడం గతంలో నూ, ప్రస్తుతం ఏ రాష్ట్రంలోనూ జరుగుతున్న స్థితి లేదు. సీఎం స్వయంగా పథకాన్ని రూపొందించినప్పుడు అది తప్పకుండా ప్రజలకు చేరుతుందనడంలో అతి శయోక్తి లేదు. అందుకే రాష్ట్రంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి ప్రజల నుంచి హర్షామోదాలు వ్యక్తమవుతున్నాయి.

(వ్యాసకర్త : శాసనమండలి సభ్యులు)



కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోతో జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు, పెట్టుబడులే కాకుండా పరస్పర సహకారానికి అంగీకారం కుదిరింది. ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాలతో మైత్రి మరింత బలపడుతుంది.

నరేంద్రమోదీ



నీరవ్ మోదీపై ప్రధాని మోదీ ఎట్టకేలకు పెదవి విప్పారు. 'ఆర్థిక వ్యవహారాల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టగలిగాను. ప్రజల సొమ్మును ఇలా దోచుకెళ్లడాన్ని అనుమతించం'అని అంటున్నాడు. మరి నీరవ్ మోదీ దేశం విడిచి వెళ్లటానికి సాయపడిందెరు?

ప్రశాంత్‌భూషణ్



పేదవాడు ఆకలితో ఆహారపదార్థాలను దొంగిలిస్తే అతనికి చావు ఎదురవుతుంది. అదే ఓ ధనవంతుడు బ్యాంకును దోపిడీ చేస్తే అతన్ని ఎవరూ ముట్టుకోలేరు. ఇండియా అంటే ఇదే!

రాజ్‌దీప్ సర్దేశాయ్



అసోం, అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రకృతి వనరులు టూరిజం అభివృద్ధికి తోడ్పడుతాయి. ఈ ప్రాంతంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసి ఈశాన్యభారత అభివృద్ధికి బాటలు వేస్తాం.

సర్బానంద సోనోవాల్

డైనమిజానికి ప్రతీక

విశ్లేషణ



కల్లూరి శ్రీనివాస్‌రెడ్డి

తరాలు మారుతున్నాయి. ఆలోచనలు మారుతున్నాయి. ప్రపంచ పరివర్తన వేగాన్ని అందుకోవడమే నేటి తరానికి ఒక అనివార్యత. అది సమాజమా, రాజకీయమా, ప్రభుత్వమా అని కాదు. వేగం అన్ని వ్యవస్థలకు అనివార్యమైపోయింది. ఒక ఉద్యోగి తన స్కిల్స్‌తో పని వేగం పెంచాలి, ఒక ప్రభుత్వం పనితనంలో వేగం చూపాలి. 'రాజకీయం' ఆలోచనల్లో వేగం పెంచాలి. వాటన్నిటి ఫలితాలే సమాజగమనాన్ని నిర్దేశిస్తాయి. టాలెంటెడ్ ఉద్యోగి ఒక కంపెనీకి ఎంత అవసరమో, ప్రపంచ పరివర్తనను ప్రజలకు అందించడానికి పాలకుల్లో డైనమిజం అంతే అవసరం. దేశంలో రాజకీయవ్యవస్థ కూడా రోజురోజుకు పరివర్తన చెందుతున్నది. పోటీ ప్రపంచ గమనాన్ని తన ప్రజలకూ అందించగలిగే సమర్థ పాలకులు కావాలనే కోరిక ఈ తరం ప్రజల్లో బాగా పెరుగుతున్నది. అకడమిక్ విద్య కంటే, వృత్తి విద్యకే ఈ తరం బాగా మొగ్గు చూపుతుండటం అందరికీ తెలిసిందే. సుమారు 8 లక్షల మందికి పైగా తెలంగాణ యువత విదేశాల్లో ఉద్యోగాలు చేయడమో, విద్య కోసం వెళ్లడమో, స్థిరపడడమో జరిగింది. దీని వేగం రెండు దశాబ్దాలుగా బాగా పెరిగింది, పెరుగుతూనే ఉన్నది. గత మూడేళ్లలో దేశంలో అన్నిరాష్ట్రాల కన్నా తెలంగాణ ఐటీ రంగం ఐదు శాతం అభివృద్ధి చెందుతుండటాన్ని గమనిస్తే ఉపాధి కల్పనలో తెలంగాణ వేగాన్ని గమనించొచ్చు. పరివర్తనకు తగ్గ నాయకత్వాన్ని సమాజం ఎప్పుడూ కోరుకుంటుంది. ఐటీ రంగంలో హైదరాబాద్ నగరానికి మేమే పేరు తెచ్చామనే వాళ్లు ఉండొచ్చు. కానీ రాష్ట్ర విభజన జరిగితే నగరం దివాళా తీస్తుందని చెప్పినోళ్లు ఉన్నారు. విభజన జరిగిన తొలినాళ్లలో నగరంలోని పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ప్రభుత్వం తరపున బలమైన భరోసా కల్పించడంలో కేటీఆర్ చేసిన కృషి ఎవరూ కాదనలేనిది. కొట్లాట పారిశ్రామికవేత్తలతో కాదు, పాలనాపరమైన దోపిడీదారులతోనే అనే ఉద్యమకాలం నాటి కేసీఆర్ మాటను నిలబెట్టడంలో కేటీఆర్ విజయం సాధించారు. హైదరాబాద్ నుంచి ఒక్క పెట్టుబడిదారుడు కూడా తెలంగాణ సరిహద్దులు దాటి బయటికి అడుగుపెట్టలేదు. కేటీఆర్ పాలనా సమర్థతకు అది మొదటి విజయం. విభజన కాలం నాడు తెలంగాణ వ్యతిరేకులు సృష్టించిన అపోహలను పటాపంచలు చేయడంలో ఆయన పూర్తి విజయం సాధించారు. సంపద సృష్టికర్తలంతా హైదరాబాద్‌ను వదిలేసి విశాఖకు తరలిపోతారని చెప్పినోళ్లు, ఇవాళ గుడ్లప్పగించి చూస్తున్నారు. ఎవరూ ఊహించని ప్రపంచ స్థాయి సంస్థలు గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి కంపెనీలు హైదరాబాద్‌కు తరలివచ్చాయి. నాలుగేండ్లలో కొత్తగా లక్ష కోట్లకు పైగా పెట్టుబడులతో నాలుగువేలకు పైగా పరిశ్రమలు రావడం మామూలు విషయం కాదు. వాటి ద్వారా ఉపాధి అవకాశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నాలుగు లక్షలకు పైగా పెరుగుతున్నాయి.

ఇంతటి పాలనాపరమైన సత్ఫలితాలు సాధించడంలో కేసీఆర్ విధానపరమైన చర్యలున్నాయి. ప్రపంచ పెట్టుబడులు తెలంగాణ దారి పట్టడానికి టీఎస్ ఐపాస్ బాగా పనిచేసింది. అయితే ఇన్వెస్టర్లకు పాలనా పరమైన ఇబ్బందులు లేకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పరిశ్రమల అనుమతులను సులభతరం చేసి దాన్ని మానిటరింగ్ చేయడంలో పరిశ్రమల మంత్రి కేటీఆర్ పడుతున్న శ్రమ అంతకన్నా విలువైంది. పెట్టుబడులను ఆకర్షించడంలో అప్పటి ఉమ్మడి రాష్ట్రం దేశం లో 13వ స్థానంలో ఉండేది. ఇవాళ పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానానికి చేరింది. ఇది ఎవరో చెపుతు న్న విషయం కాదు, స్వయాన భారత ప్రభుత్వం చెపుతున్న విష యం. కేవలం నాలుగేండ్లలో తెలంగాణ ఇంతటి అద్భుతాన్ని సాధించడం పరిశ్రమల యువ మంత్రి పాలనా సామర్థ్యానికి ఒక కొలమానం. దాన్నే డైనమిజం అంటున్నాం.

టాలెంట్ అనే పదం సహజంగా విద్యార్థుల ప్రతిభకు సంబంధించి వాడుతుంటాం. కానీ రాజకీయ రంగంలో, పాలనా రంగంలో టాలెంటే కొలమానమవుతున్న కాలమిది. రాజకీయాన్ని వృత్తిగా చేపట్టడం సహజంగా జరుగుతుంది. కానీ పాలనా పరంగానూ టాలెంట్‌ను చాటుకోవడమనేదే పొలిటికల్ కెరీర్‌లో కీలకం. అందునా కొత్త రాజకీయ తరం పనితనానికి 'టాలెంటే' గీటురాయి. రాజకీయాల్లో కొత్త తరం యువనేతలు పెరుగుతున్నారు. అందులో టాలెంట్ ఉన్న యువనేతలు ప్రపంచ పరివర్తన వేగాన్ని అందుకోగలుగుతున్నారు. ప్రపంచ నూతన ఆవిష్కరణల ఫలాలను ప్రజలకు అందించగలుగుతున్నారు.

ఈ నాలుగేండ్లు జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు తెలంగాణ వేదికగా మారింది. ఆ సదస్సులు మన రాష్ట్రానికి తేవడంలో యువ మంత్రికి అడ్మినిస్ట్రేషన్‌ను నడుపడంలో ఉన్న స్కిల్స్, పొలిటికల్ టాలెంట్ బాగా ఉపయోగపడ్డాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నుంచి మొదలు కుంటే మొన్నటి వరల్డ్ ఐటీ కాంగ్రెస్, నిన్నటి బయోఏషియా సదస్సు దాకా ప్రపంచ ప్రతిష్ఠాత్మక సదస్సులు తెలంగాణలో జరిగాయంటే కేటీఆర్‌లో బెస్ట్ పొలిటీషియన్, బెస్ట్ అడ్మినిస్ట్రేటర్‌నూ చూడొచ్చు. నాస్కామ్ ఇండియా 25 ఏండ్లుగా ముంబైని వదిలేసి బయట సదస్సుల్లో ఎన్నడూ భాగస్వామి కాలేదు. అలాంటి నాస్కామ్‌ను కూడా వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సదస్సులో భాగస్వామిని చేస్తూ హైదరాబాద్‌కు తేవడంలో కేటీఆర్ సమర్థతను గుర్తించకతప్పదు. కేటీఆర్ మంచి ఉపన్యాసకుడు కూడా. ఎదుటివారిని మెప్పించి ఒప్పించే సామర్థ్యం ఆయనలో అపారం. కేటీఆర్‌కు పని పట్ల ఉన్న కమిట్‌మెంట్, విశ్వసనీయతలే ఆయనకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి అనేక అవార్డులను తెచ్చిపెట్టాయి. రాజకీయాల్లో పదకొండేళ్ల అనుభవం. పరిపాలనలో నాలుగేండ్ల అనుభవం. ప్రపంచ, దేశ, ప్రాంత గమనాన్ని తక్కువ కాలంలోనే ఎక్కువ అర్థం చేసుకున్నారు. ఒక యువనేతలో ఇన్ని లక్షణాలను ఒకేసారి చూడటం చాలా అరుదు. అందుకే ప్రధాని, కేంద్ర మంత్రులు కేటీఆర్‌ను ఆదరిస్తుంటారు. తెలంగాణ సమస్యలను, పాలనాపరమైన పనులను కాదనలేని రీతిలో ప్రజెంట్ చేయడంలో ఆయన దిట్ట అని ఢిల్లీలో మంత్రులు, అధికారులు ప్రశంసిస్తుంటారు.

> యువనేతలో తెలంగాణ ఒక డైనమిజాన్ని చూస్తున్నది. ఆయనలో క్లాస్ కంటే మాస్ లీడర్‌గా మరింత బలంగా ఉన్నాడు. తెలంగాణ పునర్ నిర్మాణ పథకాల రచనలో యువనేత సేవలూ ఉన్నాయి. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్, మిషన్ భగీరథ మొదలు పెట్టడం, వీటన్నిటికి మించి పేద ఆడబిడ్డల పెళ్ళిళ్లకు ప్రభుత్వ సహాయ కార్యక్రమానికి 'కల్యాణలక్ష్మి' పేరును ప్రతిపాదించింది కూడా ఈ యువనేతే. దీన్నిబట్టి ఆయనలో మాస్ లీడర్ ఎంత బలంగా ఉన్నాడో ఎవరికైనా అర్థమవుతుంది.

చాలమంది సీఎంలకు వారసులుంటారు. కానీ అందరూ ఎదిగిరాలేరు. అవకాశాలు కలిసొచ్చినా ఎదిగిరావడమనేది అంత సులభం కాదు. రాజకీయాల్లో టాలెంట్, అడ్మిస్ట్రేషన్‌ను నడపడంలో స్కిల్స్ ఉన్నపుడే ఎదిగిరావడం సులభం. కేటీఆర్‌లో ఉన్న ప్రత్యేకత అదే. మీడియా ఇంటర్వ్యూలలో తన రాజకీయ ఎదుగుదల గురించి చాలాసార్లు స్పష్టంగా చెప్పిన సందర్భాలూ ఉన్నాయి. 'నేను కేసీఆర్ కుమారుడిని కాబట్టే రాజకీయంగా అవకాశం వచ్చిన మాట నిజం. అలాగే సమర్థ ఉద్యమ నాయకుడి, సమర్థ పాలకుడైన కేసీఆర్ కుమారుడిగా గర్విస్తాను. కేసీఆర్ గారు అవకాశమిచ్చారు. కానీ ఎదిగిరావడమనేది మాత్రం నా సమర్థతపైనే ఆధారపడింది' అని విస్పష్టంగా వినమ్రంగా చెబుతారు.

యువనేతలో తెలంగాణ ఒక డైనమిజాన్ని చూస్తున్నది. ఆయనలో క్లాస్ కంటే మాస్ లీడర్‌గా మరింత బలంగా ఉన్నాడు. తెలంగాణ పునర్ నిర్మాణ పథకాల రచనలో యువనేత సేవలూ ఉన్నాయి. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్, మిషన్ భగీరథ మొదలు పెట్టడం, వీటన్నిటికి మించి పేద ఆడబిడ్డల పెళ్ళిళ్లకు ప్రభుత్వ సహాయ కార్యక్రమానికి 'కల్యాణలక్ష్మి' పేరును ప్రతిపాదించింది కూడా ఈ యువనేతే. దీన్ని బట్టి ఆయనలో మాస్ లీడర్ ఎంత బలంగా ఉన్నాడో ఎవరికైనా అర్థమవుతుంది.

యువ నేత సోషల్ మీడియా ద్వారా పబ్లిక్ రిలేషన్‌ను బాగా పెంచుకున్నారు. సామాన్యులు సైతం ట్వీట్ చేస్తే స్పందిస్తుంటారు. వారి సమస్యలను పరిష్కరిస్తుంటారు. ఆదుకుంటుంటారు. యువనేతకు ప్రజలకు మధ్యన సోషల్ మీడియా వారధిలా పనిచేస్తున్నది. ఆమేరకు ప్రజాసంబంధాలు బాగానే ఉన్నాయి. కానీ ప్రత్య క్ష ప్రజాసంబంధాలే మరింత మెరుగు పడాల్సిన అవసరం ఉన్నది. టెక్నాలజీ ఉపయోగాన్ని సామాన్యుడికి సైతం అందుబాటులోకి తేవడంలో ఆయన అభిరుచి కాదనలేనిది. పొలంలో రైతును సైతం కొత్త టెక్నాలజీతో అనుసంధానం చేసి సమస్యలను పరిష్కరించే కాలం రాబోతున్నది. కొత్త తరం కొత్త ఆలోచనలే రేపటి తెలంగాణను ఆవిష్కరించడం ఖాయం. అలాంటి మాస్ డైనమిక్ పాలనే తెలంగాణ అభివృద్ధికి బలమైన బాటలు వేస్తుంది.

kallurisreddy@gmail.com

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నీ స్ఫూర్తితో దేశ రక్షణలో మమేకమవుతా!



ఒక ఫొటో వెయ్యి పదాలతో సమానం.. ఒక ఫొటో ఎన్నో హృదయాలను కదిలించగలదు.. అలాంటిదే పై ఫొటో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. వైమానిక దళానికి చెందిన అధికారి దుష్యంత్ వత్స్ ఇటీవల అసోంలో హెలికాప్టర్ ప్రమాదంలో కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలను బుధవారం సైనిక వందనంతో నిర్వహించారు. సైన్యంలోనే పనిచేస్తున్న వత్స్ భార్య మేజర్ కుముద్ దోగ్రా పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ.. తన ఐదురోజుల పాపను ఎత్తుకొని సైనిక దుస్తుల్లో అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ దృశ్యం అక్కడున్న వారందరి హృదయాలను కదిలించింది. ఇప్పుడు సోషల్ మీడియాలోనూ హల్‌చల్ చేస్తున్న ఈ ఫొటోను చూసిన నెటిజన్లు సెల్యూట్ చేస్తున్నారు.

ఉత్తర కొరియాకు అమెరికా షాక్

- అత్యంత కఠినమైన ఆంక్షలు విధింపు
- నౌకలు, వాణిజ్యంపై నిషేధం
- ఆ దేశంతో వ్యాపారం చేసే వారితో సంబంధాలు కట్: అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, ఫిబ్రవరి 23: ఉత్తరకొరియాపై అమెరికా అత్యంత కఠినమైన ఆంక్షలు విధించింది. ఖండాంతర క్షిపణులు అభివృద్ధి చేయకుండా, అణ్వాయుధాలు సమకూర్చుకోకుండా ఉత్తర కొరియా షిప్పింగ్ కంపెనీలపై అమెరికా ఈ ఆంక్షలను ప్రకటించింది. ఈ ఆంక్షలతోనైనా ఉత్తరకొరియా మారుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటువంటి ఆంక్షలను అమెరికా మునుపెన్నడూ ఏ దేశంపై కూడా విధించలేదని ట్రంప్ మీడియాకు తెలిపారు. అంతకుముందు అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్టీవెన్ ముంచిన్ ఉత్తర కొరియాపై విధించిన ఆంక్షల వివరాలను వెల్లడించారు. ఉత్తర కొరియాకు చెందిన నౌకలు, షిప్పింగ్, వాణిజ్య కంపెనీలు, ప్రపంచ వ్యాప్తంగా ఆ దేశానికి సహాయపడుతున్న వ్యక్తులపై ఆంక్షలు విధిస్తున్నామని తెలిపారు. తమ ఆంక్షలు 27 సంస్థలు, 28 నౌకలు, ఒక వ్యక్తికి వ్యతిరేకంగా ఉన్నాయని వివరించారు. ఈ ఆంక్షలను అధిగమించి ఎవరైనా ఉత్తరకొరియాతో వాణిజ్య సంబంధాలు పెట్టుకొంటే ఆ దేశంతో సంబంధాలు తెంచుకుంటామని అమెరికా హెచ్చరించింది. మరోవైపు, ఉత్తరకొరియాపై విధించిన ఈ ఆంక్షలు ఫలించకపోతే రెండో దశ ఆంక్షలకు తెరతీస్తామని అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. రెండో దశ ఆంక్షలు మరింత కఠినంగా ఉంటాయన్నారు. భారత్, చైనాలపై ట్రంప్ మరోసారి నోరు పారేసుకున్నారు. ఆ రెండు దేశాల వల్లే భూతాప నివారణకు కుదిరిన పారిస్ ఒప్పందం నుంచి తాము వైదొలిగామని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, వివిధ దేశాలలోని ఉత్తరకొరియాకు చెందిన బ్యాంకులు హవాలా లావాదేవీలకు పాల్పడుతున్నాయని, ఉగ్రవాద సంస్థలకు నిధులు అందజేస్తున్నాయని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ ఆరోపించింది. దీంతో ఆ బ్యాంకుల శాఖలను మూసివేయాలని అన్ని దేశాలకు విజ్ఞప్తి చేసింది.

ఇది మోదీ జన్ ధన్ లూటీ పథకం

మరో వజ్రాల వ్యాపారి మోసంపై రాహుల్ విమర్శలు
ఓరియంటల్ బ్యాంక్‌కు రూ.390 కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన సభ్యాసేఠ్
ఖరీదైన చౌకీదార్ కండ్లెదుటే మోసాలు జరుగుతున్నాయని కపిల్‌సిబల్ విమర్శ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24:

మరో బ్యాంకు రుణం ఎగవేత కేసు బయటపడటంతో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్రమోదీపై తన విమర్శల దాడికి మరింత పదును పెట్టారు. వరుసగా బయటపడుతున్న భారీస్థాయి ఆర్థిక మోసాలను 'ప్రధాన మంత్రి జన్‌ధన్ లూట్ పథకం'గా అభివర్ణించారు. రూ.390 కోట్ల రుణాలను ఎగ్గొట్టిన వజ్రాల వ్యాపారి సభ్యా సేఠ్ దేశం నుంచి పారిపోతుంటే మోదీ సర్కార్ కండ్లప్పగించి చూస్తుండిపోయిందని విమర్శించారు. ఇంతకుముందు నీరవ్ మోదీ, విజయ్ మాల్యా కూడా ఇలా సర్కార్ కండ్లుగప్పి పారిపోయారని గుర్తుచేశారు. ఓరియంటల్ బ్యాంక్‌ను రూ.389.85 కోట్ల మేర మోసగించినందుకు ద్వారకా దాస్ సేఠ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రమోటర్ సభ్యా సేఠ్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. నీరవ్ మోదీ లాగే సభ్యా సేఠ్ కూడా నకిలీ పత్రాలు సృష్టించి మోసాలకు పాల్పడ్డాడు. దీనిపై రాహుల్ స్పందిస్తూ, 'మోదీ జీ జన్ ధన్ లూట్ యోజన కింద మరో కుంభకోణం వెలుగుచూసింది. దీని విలువ రూ.390 కోట్లు. నీరవ్ మోదీ లాగే మోసం చేశాడు. మాల్యా, నీరవ్ పారిపోయినట్టుగానే ప్రభుత్వం మరో దిక్కు చూస్తుండగా ఈ ప్రమోటర్ కూడా అదృశ్యమయ్యాడు' అని రాహుల్ ట్వీట్ చేశారు. ఆరు నెలల క్రితం ఓరియంటల్ బ్యాంక్ చేసిన ఫిర్యాదు మేరకు కంపెనీ డైరెక్టర్లు సభ్యా సేఠ్, రీటా సేఠ్, కృష్ణకుమార్ సింగ్, రవి సింగ్, మరో కంపెనీ ద్వారకా దాస్ సేఠ్ సెజ్ కార్పొరేషన్లపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదుచేసింది. సభ్యాసేఠ్‌తో పాటు ఇతర డైరెక్టర్లు కూడా దేశం విడిచిపోయినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కర్ణాటకలోని విజయపురలో ఓ టీ స్టాల్‌లో సీఎం సిద్దరామయ్య, కాంగ్రెస్ నేతలతో రాహుల్‌గాంధీ

60 రోజుల్లో బాధ్యులను గుర్తించాలి: కాంగ్రెస్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన రూ.11,400 కోట్ల కుంభకోణంపై ఆర్‌బీఐతో క్షుణ్ణంగా దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆర్థికమంత్రిత్వ శాఖ, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), మోసాలకు గురైన బ్యాంకుల యాజమాన్యాలలో అసలు దోషులెవరో 60 రోజుల్లోగా గుర్తించాలని కాంగ్రెస్ ప్రధానిని కోరింది. 'దేశం ఇప్పటికి రూ.21 వేల కోట్లను నష్టపోయింది. మన ప్రధాని ఎంతో ఖరీదైన చౌకీదార్ (కాపలాదారు) అయినప్పటికీ ఆయన కండ్లెదుటనే ఈ మోసాలు ఎందుకు జరుగుతున్నాయి' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కపిల్ సిబల్ ప్రశ్నించారు. 'మోదీజీ తన మౌనాన్ని వీడాలి. మోసాలకు పాల్పడి దేశం వదిలి పారిపోయిన వారికి వెనుకకు తీసుకొస్తామని ప్రభుత్వం చెప్తున్నది. అసలు వారిని దేశం వదిలి ఎలా వెళ్లనిస్తున్నారో వెల్లడించాలి' అని సిబల్ డిమాండ్ చేశారు.

అధికారంలోకి రాగానే మహిళా రిజర్వేషన్ల బిల్లు

టికోట (కర్ణాటక): కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి రాగానే మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ మంది మహిళలకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కర్ణాటక కాంగ్రెస్ నేతలకు రాహుల్ సూచించారు. మహిళా బిల్లును పార్లమెంట్‌లో బీజేపీ అడ్డుకుంటున్నదని రాహుల్ గాంధీ ఆరోపించారు. కర్ణాటకలోని టికోటలో స్త్రీ శక్తి సమావేశానికి హాజరైన మహిళల్ని ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు.

ఉగ్రదాడులతో దద్దరిల్లిన ఆఫ్ఘనిస్థాన్

- 23 మంది దుర్మరణం.. మృతుల్లో 20 మంది సైనికులు

కాబుల్, ఫిబ్రవరి 24: ఆత్మాహుతి, ఉగ్రదాడులతో ఆఫ్ఘనిస్థాన్ శనివారం దద్దరిల్లింది. ఉగ్రవాదులు జరిపిన వేర్వేరు దాడుల్లో 23 మంది మృతిచెందారు. వీరిలో 20 మంది సైనికులు ఉండగా, మరో ముగ్గురు పౌరులు ఉన్నారు. 'ఫరాహ్ ప్రాంతంలోని ఆర్మీ శిబిరంపై తాలిబన్ ఉగ్రవాదులు దాడిచేశారు. ఈ ఘటనలో 18 మంది సైనికులు మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. అదనపు బలగాలను ఆ ప్రాంతానికి పంపించాం' అని రక్షణశాఖ ప్రతినిధి దౌలత్ వజీర్ చెప్పారు. దాడి చేసింది తామేనని తాలిబన్ ప్రకటించింది. కాబుల్‌లోని దౌత్యకార్యాలయ సమీపంలో శనివారం ఉదయం జరిగిన ఆత్మాహుతి దాడిలో ముగ్గురు మృతిచెందగా, మరో ఐదుగురు గాయపడ్డారని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి నస్రత్ రహిమి తెలిపారు. మరో ఘటనలో దక్షిణ హెల్మాండ్ ప్రాంతంలో కారుతో వచ్చి ఆత్మాహుతి దాడికి పాల్పడగా ఇద్దరు సైనికులు మృతిచెందారని అధికారులు తెలిపారు.

షిల్లాంగ్ ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన మిలిటెంట్ హతం



షిల్లాంగ్, ఫిబ్రవరి 24: మేఘాలయా రాజధాని షిల్లాంగ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన ఓ మిలిటెంట్ హతమయ్యాడు. ఈస్ట్ గారో హిల్స్ జిల్లాలో భద్రతాబలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో మిలిటెంట్ సోహన్ డి శిరా మరణించాడు. మరో మూడు రోజుల్లో మేఘాలయ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న సమయంలో పేరుమోసిన మిలిటెంట్ ఎన్‌కౌంటర్ జరుగడం కలకలం రేపుతున్నది. గారో నేషనల్ లిబరేషన్ ఆర్మీ (జీఎన్ఎల్ఏ)కి చీఫ్‌గా తనకు తాను ప్రకటించుకున్న శిరాను పట్టుకునేందుకు భద్రతాదళాలు ఎంతోకాలంగా ప్రయత్నిస్తున్నాయి. శిరా తలపై రూ.10 లక్షల బహుమతిని ప్రభుత్వం ప్రకటించింది. వారం క్రితం బాంబులు పేల్చి ఎన్సీపీ అభ్యర్థి జోనథోన్ సంగ్మా సహా ముగ్గుర్ని హతమార్చిన ఘటనలో శిరాను ప్రధాన నిందితుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. పలు ప్రాంతాల్లో జల్లెడ పడుతుండగా అచక్‌పెక్ గ్రామంలో సోహన్ శిరా ఆచూకీ లభించింది. 'ఇరువర్గాల మధ్య కొనసాగిన ఎదురుకాల్పుల్లో శిరా హతమయ్యాడు. శవపరీక్ష తర్వాత మృతదేహాన్ని ఆయన బంధువులకు అప్పగిస్తాం' అని డిప్యూటీ కమిషనర్ రామ్ కుమార్ చెప్పారు.

చిన్నారులను చిదిమేసిన మృత్యువు

రోడ్డుమీదున్న విద్యార్థులపైకి దూసుకెళ్లిన బొలేరో వాహనం ■ 9 మంది మృతి, 24 మందికి గాయాలు, బీహార్‌లో దుర్ఘటన

పాట్నా, ఫిబ్రవరి 24: పుస్తకాల సంచి పట్టుకొని పాఠశాలకొచ్చిన విద్యార్థులు స్కూల్ ముగిసిన తర్వాత ఇంటికెళ్తుండగా తిరిగిరానిలోకాలకు వెళ్లిపోయారు. బొలేరో వాహనం రూపంలో వారిని మృత్యువు కబళించింది. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం బీహార్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో జరిగింది. అహియాపూర్‌లోని ఝూపహ వద్ద గల ధారంపూర్ ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల విద్యార్థులు మధ్యాహ్నం ఒక టిన్నరకు ఇంటికెళ్లేందుకు 77వ జాతీయరహదారి పక్కన నిలబడి ఉన్నారు. ఇంతలో అటువైపు నుంచి వేగంగా వచ్చిన బొలేరో వాహనం వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తొమ్మిదిమంది విద్యార్థులు అక్కడికక్కడే చనిపోయారు. 24 మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతులసంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని ముజఫర్‌నగర్ డీఎస్పీ గౌరవ్ పాండే తెలిపారు. క్షతగాత్రులను ముజఫర్‌నగర్‌లోని శ్రీకృష్ణ మెడికల్ కాలేజీ దవాఖానలో చేర్చినట్టు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత బొలేరో డ్రైవర్ పారిపోయినట్టు ఆయన చెప్పారు. జాతీయ రహదారిపై ఓ మహిళను ట్రక్కు ఢీకొన్నది. దీంతో కొందరు ఆ వాహనాన్ని వెంబడిస్తుండగా తన వద్దకు వారు వస్తున్నారని భావించి బొలేరో డ్రైవర్ వాహనాన్ని మరో వైపు తిప్పాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కనే నిలుచున్న చిన్నారులను ఢీకొన్నాడని ప్రత్యక్షసాక్షి మిథిలేశ్‌యాదవ్ తెలిపారు. మృతుల కుటుంబాలకు సీఎం నితీశ్‌కుమార్ రూ.4 లక్షల పరిహారం ప్రకటించారు.



విద్యార్థులపైకి దూసుకెళ్లిన బొలేరో వాహనం

పాఠశాల సిలబస్ సగానికి తగ్గింపు

- 2019 విద్యాసంవత్సరంనుంచి అమల్లోకి
- కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: పాఠశాల విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు వారి సిలబస్‌ను జాతీయ విద్యా పరిశోధన, శిక్షణా మండలి (ఎన్సీఈఆర్టీ) సగానికి తగ్గించనున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ శనివారం తెలిపారు. నూతన సిలబస్ 2019 విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి రానున్నదని చెప్పారు. ప్రస్తుతం పాఠశాల సిలబస్ బీఏ, బీకాం కంటే అధికంగా ఉందని, దీనిని సగానికి తగ్గించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. తద్వారా ఇతర కార్యకలాపాల్లోనూ పాల్గొనేందుకు విద్యార్థులకు సమయం దొరుకుతుందని, సంపూర్ణ వికాసం పొందేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. 'విద్యార్థుల్లో అభిజ్ఞాత్మక నైపుణ్యం అభివృద్ధి చెందుతున్న దశలో వారికి పూర్తి స్వేచ్ఛను ఇవ్వడం చాలా అవసరం. ఇందులోభాగంగా 2019 విద్యా సంవత్సరం నుంచి వారి సిలబస్‌ను సగానికి తగ్గించాలని ఎన్సీఈఆర్టీని కోరాను' అని జవదేకర్ రాజ్యసభ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. పాఠశాల విద్యలో సంస్కరణలపై మాట్లాడుతూ పరీక్షలు, డిటెన్షన్ విధానాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. 'పరీక్షలు లేకపోతే పోటీ, లక్ష్యం ఉండదు. మెరుగైన ఫలితాలు సాధించాలంటే పోటీ తప్పనిసరి. ఓ విద్యార్థి మార్చిలో ఫెయిల్ అయితే అతనికి మేలో మరో అవకాశం ఉంటుంది. ఒకవేళ రెండు పర్యాయాలు ఫెయిల్ అయితే ఆ విద్యార్థి డిటైన్ అవుతాడు' అని కేంద్ర మంత్రి వివరించారు.

మహిళా సాధికారతే లక్ష్యం: మోదీ

చెన్నై, ఫిబ్రవరి 24: 'ఓ మహిళ సాధికారత సాధిస్తే ఆ కుటుంబమంతా సాధికారత సాధిస్తుంది. ఓ విద్యార్థిని చదువుకుంటే ఆ కుటుంబమంతా విజ్ఞానులు అవుతారు. ఓ మహిళకు భద్రత ఉందంటే ఆ కుటుంబానికంతా భద్రత ఉన్నట్లే' అని ప్రధాని మోదీ తెలిపారు. మహిళా సాధికారత లక్ష్యంగా తాము ముందుకుసాగుతున్నామని చెప్పారు. తమిళనాడు మాజీ సీఎం దివంగత జయలలిత 70వ జయంతి సందర్భంగా శనివారం తమిళనాడు ప్రభుత్వం చేపట్టిన 'అమ్మ టూ వీలర్' పథకాన్ని మోదీ ప్రారంభించారు. లబ్ధిదారులకు ద్విచక్ర వాహనాలను అందజేశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు అండగా నిలువడానికి సబ్సిడీపై టూవీలర్ పథకాన్ని తమిళనాడు ప్రభుత్వం తీసుకొచ్చింది. పథకంలో భాగంగా 50శాతం సబ్సిడీ(రూ.25వేల వరకూ)ని ప్రభుత్వం భరిస్తుంది. ప్రధాని మోదీ ఆదివారం పుదుచ్చేరిలో పర్యటించనున్నారు.

డామన్ డయ్యూలో వెయ్యికోట్లతో అభివృద్ధి పనులు

డామన్: డామన్ డయ్యూలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. కేంద్రప్రభుత్వ ఉడాన్ పథకంలో భాగంగా అహ్మదాబాద్ నుంచి డయ్యూ తీర పట్టణానికి విమాన సేవలను ఆయన ఆవిష్కరించారు.



చెన్నైలో ఓ యువతికి స్కూటర్ తాళంచెవి అందిస్తున్న మోదీ, పక్కన సీఎం పళనిస్వామి

పేలిన కానుక.. పెండ్లింట విషాదం

వరుడు, అతడి నాయనమ్మ మృతి, వధువుకు తీవ్రగాయాలు

భువనేశ్వర్: పెండ్లి ముగిసింది.. ఎవరిపనుల్లో వారు బిజీగా ఉన్నారు. కానుకల్ని ఒక్కొక్కటిగా చూడటంలో వధూవరులు నిమగ్నమయ్యారు. అంతలో పెద్ద పెట్టున పేలుడు సంభవించింది. వధూవరులు అందుకున్న బహుమతుల్లో ఒకటి పేలిపోయింది. వరుడి నాయనమ్మ అక్కడికక్కడే మరణించగా.. తీవ్రంగా గాయపడిన పెళ్లికొడుకు దవాఖానాలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. గాయపడిన నవవధువు దవాఖానాలో చికిత్స పొందుతున్నది. ఈ విషాద ఘటన ఈనెల 21న ఒడిశాలోని బోలాంగిర్ జిల్లాలో జరిగింది. సాక్ష్యాలు సేకరించి కేసును విచారిస్తున్నట్లు పఠాన్‌గఢ్ సబ్–డివిజనల్ పోలీసు అధికారి సెసాదేవా బరిహా తెలిపారు. పేలుడుకు కారణమైన కానుకను ఇచ్చిన వ్యక్తిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు బరిహా చెప్పారు.



వధూవరులు

డార్విన్ సిద్ధాంతం తప్పంటే.. తప్పా!

విద్యార్థులకు ఐఐఎస్ఈఆర్ ప్రశ్న

పుణె: డార్విన్ సిద్ధాంతం శాస్త్రీయంగా నిజం కాదని కేంద్ర మానవ వనరుల సహాయమంత్రి సత్యపాల్ సింగ్ వాదిస్తున్నారని, ఇందులో ఏమి తప్పు ఉన్నదని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్'(ఐఐఎస్ఈఆర్) తన విద్యార్థులను ప్రశ్నించింది. ఈ మేరకు ఈ నెల 22న డిగ్రీ విద్యార్థులకు జరిగిన పరీక్షలో ఓ ప్రశ్నను సంధించింది. దీనిపై ఐఐఎస్ఈఆర్ పరిశోధన, అభివృద్ధి విభాగం డీన్ సంజీవ్ మాట్లాడుతూ డార్విన్ సిద్ధాంతంపై చర్చను, వివాదాన్ని పెంచాలన్న ఉద్దేశం తమకు లేదని, విద్యార్థుల ఆలోచన సామర్థ్యాన్ని పరీక్షించడానికే ఈ ప్రశ్నను ప్రశ్నపత్రంలో ప్రచురించామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒకేలా ఆలోచించరని, దీంతో పలు రకాల సమాధానాలు వస్తాయని చెప్పారు. ఇటీవల కేంద్ర హెచ్ఆర్‌డీ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ మాట్లాడుతూ 'వానరుల నుంచి మనిషి ఆవిర్భవించాడని డార్విన్ సిద్ధాంతం పేర్కొంటున్నది. ఇది తప్పు. అని పేర్కొనడంపై తీవ్ర వివాదం చెలరేగిన విషయం తెలిసిందే.

ముదిరాజ్ సంఘం భవనం నిర్మించండి



తెలంగాణ ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి హైదరాబాద్‌లో స్థలం, నిధులు కేటాయించాలని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌తో కలిసి శనివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండ ప్రకాశ్

పరిశోధనల అనుసంధానం @ టీ రిచ్

ఏడాదిలోనే గొప్ప పరిశోధనలు చేయడం సంతోషకరం
వార్షికోత్సవంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాబోయేకాలంలో పరిశోధనలు కీలక భూమిక పోషిస్తాయని, ఈ రంగంలో 'రిచ్' ఏర్పాటు ద్వారా తెలంగాణ తన ముద్రను చాటుకున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో శనివారం నిర్వహించిన రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) ప్రథమ వార్షికోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. పరిశోధనల అనుసంధాన వేదికగా టీ రిచ్ ఆవిర్భవించిందని మంత్రి చెప్పారు. సంప్రదాయ వ్యాపారవిధానాలకు తోడుగా పరిశోధనల అవకాశాలపై వివిధ రంగాలు దృష్టిసారించాయని పేర్కొన్నారు. పరిశోధనా రంగంలోని రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్, ఇండస్ట్రీ, స్టార్టప్స్‌ని ఒకే తాటిపైకి తీసుకొచ్చేందుకే టీ రిచ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తక్కువమందితో ఎక్కువ వ్యాపారం చేయడమే టీ రిచ్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. టీ రిచ్ నెలకొల్పిన ఏడాదిలోనే గొప్ప పరిశోధనలు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకుసాగాలని ఆకాంక్షించారు.



హెచ్‌ఐసీసీలో జరిగిన టీ రిచ్ ప్రథమ వార్షికోత్సవంలో తాము తయారుచేసిన ఏసీ హెల్మెట్‌ను ఐటీ, పరిశ్రమశాఖల మంత్రి కే తారకరామారావుకు అందజేస్తున్న కౌస్తుబ్ శ్రీకాంత్, ఆనంద్

ఐపాస్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు

రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేండ్లలో పలు కీలకమైన విధానాలు తీసుకువచ్చామని మంత్రి కేటీఆర్ తెలిపారు. టీఎస్ ఐపాస్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు దక్కిందని, అనేక సంస్థలు పెట్టుబడులు పెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. వ్యాపార, తయారీరంగాలకు ప్రోత్సాహమిస్తున్నామని చెప్పారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమల అభివృద్ధికి ఊతమిచ్చామని వివరించారు. ఫార్మా, మెడికల్, డివైస్ తయారీల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ఎందరో ఔత్సాహికులకు టీ హబ్ వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. రాష్ట్రానికే కాకుండా దేశానికి ఉపయోగపడేలా వ్యాపారులు ఎదుగాలని సూచించారు. దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణ ప్రఖ్యాతిగాంచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిచ్ డైరెక్టర్ అజిత్ రంగ్నేకర్, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతం తదితరులు పాల్గొన్నారు.

జీనోమ్ వ్యాలీలో పెట్టుబడులకు ఆసక్తి

బయోఏషియా సదస్సు విజయవంతం ▪ 52 దేశాల నుంచి 1757 మంది హాజరు ▪ 1250 బీటుబీ సమావేశాల నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగా:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన బయోఏషియా సదస్సు విజయవంతమైంది. 52 దేశాల నుంచి 1757 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. వీరు 1250 బిజినెస్ టు బిజినెస్ (బీటుబీ) సమావేశాలు నిర్వహించారు. వారి వ్యాపార విస్తరణ అవకాశాల గురించి పరస్పరం చర్చించారు. ఈసారి ప్రత్యేకించి స్టార్టప్‌లపైన చర్చించారు. తెలంగాణ ఇప్పటికే లైఫ్‌సైన్సెస్‌లో లీడర్‌గా ఉండటంతో ఇక్కడ పెట్టుబడుల అవకాశాలపై సదస్సుకు హాజరైన అంతర్జాతీయ ప్రతినిధులు సమాలోచనలు జరిపారు. ప్రపంచంలో ప్రతిష్ఠాత్మకమైన నోవార్టిస్, డెలాయిట్, సిలంగోర్ , ఐడీఏ ఐర్లాండ్, రెడ్డీల్యాబ్స్, శాంతాబయోటెక్, అరబిందో, మెర్క్, జీఈ హెల్త్‌కేర్ వంటి అనేకసంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఈ సదస్సులో ఐర్లాండ్ భాగస్వామ్య దేశంగా పాల్గొనగా గుజరాత్, అసోం భాగస్వామ్య రాష్ట్రాలుగా పాల్గొన్నాయి. బయోకాన్ సంస్థ జీనోమ్‌వ్యాలీలో మరొక యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. దీంతోపాటుగా మలేషియా దేశానికి చెందిన సిలంగోర్ రాష్ట్రంతో విజ్ఞానమార్పిడిపై మన రాష్ట్రం ఒప్పందం కుదుర్చుకున్నది. టాస్క్‌తో కలిసి పనిచేసేందుకు జీఈ సంసిద్ధత వ్యక్తంచేసింది. లైఫ్‌సైన్సెస్ పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు వెచ్చించనున్నట్టు రాష్ట్రమంత్రి కేటీఆర్ ప్రకటించడంతో పరిశ్రమవర్గాలు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నాయి. చివరిరోజు కార్యక్రమంలో అసోం రాష్ట్ర సైన్స్, టెక్నాలజీ శాఖ కార్యదర్శి వినోద్ శేషన్ మాట్లాడుతూ తమ రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని, టూరిజంపరంగా అద్భుతమైన రాష్ట్రమని అభివర్ణించారు. రాష్ట్రంలో పర్యటించి బయో టెక్నాలజీ పార్కులో పెట్టుబడులు పెట్టాలని ఆయన కోరారు. ఐటీ, బయోటెక్నాలజీ రంగంలో స్టార్టప్‌లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ఈ రెండు రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. స్టార్టప్ సెషన్‌లో ఆరు స్టార్టప్‌లను సభలో పరిచయం చేశారు. పంట పొలాల్లోని క్రిములను చంపడానికి తయారుచేసిన పరికరాన్ని ఈ సందర్భంగా చూపించారు. రైతులకు అది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.



లైఫ్‌సైన్సెస్‌లో భారత్ లీడర్: మంత్రి కేటీఆర్

బయోఏషియా సదస్సు దిగ్విజయంగా ముగియడంపై మంత్రి కే తారకరామారావు హర్షం వెలిబుచ్చారు. లైఫ్‌సైన్సెస్‌లో భారతదేశం లీడర్‌గా నిలువడానికి పలు సూచికలున్నాయని ఆయన ట్విట్టర్‌లో తెలిపారు. సహకార విధానంలో ఆర్ అండ్ డీ, తక్కువ వ్యయంతో ఆవిష్కరణలు, అందులో ముఖ్యమైనవని ఆయన పేర్కొన్నారు.



మిషన్ భగీరథకు ప్రశంసలు

- లక్నో సదస్సులో కొనియాడిన వక్తలు
- ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన ఈఎన్సీ సురేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన- అభివృద్ధి అనే అంశంపై ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన జాతీయ సదస్సులో మిషన్‌భగీరథపై పలువురు వక్తలు ప్రశంసలు కురిపించారు. మిషన్ భగీరథ పథకంతో మహిళల తాగునీటి కష్టాలకు శాశ్వత విముక్తి లభించనున్నదని నాబార్డు చైర్మన్ డాక్టర్ హర్షకుమార్ పేర్కొన్నారు. కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి శివప్రతాప్ శుక్లా ఈ సదస్సును ప్రారంభించి మాట్లాడారు. గుజరాత్ మాజీ సీఎస్ డాక్టర్ వరేశ్‌సిన్హా మాట్లాడుతూ.. తాగునీటి చుట్టూ ఉన్న ఎన్నో సామాజిక సమస్యలు మిషన్‌భగీరథతో పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రం తరపున ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి మిషన్ భగీరథపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు లక్ష్యం, స్వరూపంతోపాటు పనులు జరుగుతున్న తీరును వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం, అధికారుల పట్టుదలతో మిషన్‌భగీరథ పనులను రికార్డు సమయంలో పూర్తిచేయబోతున్నామన్నారు. 2030 నాటికి ప్రతీ ఒక్కరికి సురక్షిత తాగునీరు, పరిశుభ్రత పరిసరాలను అందించాలన్న ఐక్యరాజ్యసమితి లక్ష్యాలను.. 2018 నాటికే తెలంగాణ అందుకుంటుందన్నారు.

28న సాహిత్య అకాడమీ పుస్తకాల పరిచయ సభ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ ప్రచురించిన పుస్తకాల పరిచయ సభను ఈ నెల 28న రవీంద్రభారతి సమావేశమందిరంలో నిర్వహించనున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సాహిత్య అకాడమీ ముద్రించిన 13 పుస్తకాలను సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగే పరిచయ సభలో 13 మంది రచయితలు, పండితులు పరిచయం చేస్తారు. శాతవాహనుల నుంచి కాకతీయుల వరకు గల పుస్తకాన్ని డాక్టర్ అంజయ్య పరిచయం చేస్తారు. తెలంగాణ పద్యకవితా వైభవాన్ని గురిజాల రామశేషయ్య, మూడుతరాల తెలుగుకథను కేపీ అశోక్ కుమార్, తెలంగాణ సామెతలు పుస్తకాన్ని భుజంగరెడ్డి, తెలంగాణ నవలవికాసాన్ని ఆచార్య వెలుదండ నిత్యానందరావు, తెలంగాణ సినీగేయ వైభవాన్ని చంద్రబోస్ పరిచయం చేస్తారు. రాష్ట్రంలో శాతవాహనుల వారసత్వ పుస్తకం వివరాలను హరగోపాల్ తెలియజేస్తారు. తెలంగాణలో భావకవితావికాసం పుస్తకం విశేషాలను మల్లెగోడ గంగాప్రసాద్ పరిచయం చేస్తారు. గోండ్వానా లాండు ఎంత ప్రాచీనమైనదో తెలుగుకూడా అంతే ప్రాచీనమైనది అనే పుస్తకాన్ని నగిలి సుధారాణి, మాదిరాజు కోటేశ్వరరావు స్వీయచరిత్రను డాక్టర్ బాల శ్రీనివాసమూర్తి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వాన్ని డాక్టర్ పగడాల నాగేందర్, ఈగ బుచ్చిదాసు పుస్తకాన్ని భాస్కర్‌యోగి పరిచయం చేస్తారు.

నేడు బొన్సాయి ఉత్సవాలకు మంత్రి తలసాని

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహారాష్ట్రలోని పుణెలో జరుగుతున్న అంతర్జాతీయ బొన్సాయి మొక్కల ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆదివారం రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమాభివృద్ధి మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ హాజరుకానున్నారు. ఈ నెల 22 నుంచి జరుగుతున్న సదస్సులో దేశంలోని బొన్సాయి మొక్కల పెంపకందారులతోపాటు ఇటలీ, అమెరికా, తైవాన్, జపాన్, వియత్నాం తదితర దేశాలకు చెందిన నిపుణులు పాల్గొంటున్నారు.



జాంబియా టీఆర్‌ఎస్ ఎన్నారై కార్యవర్గసభ్యులతో ఎన్నారై టీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

ఆఫ్రికాఖండంలో టీఆర్‌ఎస్ తొలి ఎన్నారైశాఖ

- జాంబియా తాత్కాలిక కార్యవర్గం ఏర్పాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్ ఎన్నారైశాఖ ఖండాంతరాలు వ్యాపిస్తున్నది. ఇప్పటికే యూరప్, అమెరికా ఖండాల్లో టీఆర్‌ఎస్ ఎన్నారై శాఖలు ఉండగా తాజాగా ఆఫ్రికా ఖండంలో ఏర్పాటుచేశారు. జాంబియా దేశంలో తొలి టీఆర్‌ఎస్ ఎన్నారైశాఖను ఎన్నారై టీఆర్‌ఎస్ కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల ప్రారంభించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు ముందుకొచ్చిన జాంబియాలో స్థిరపడిన తెలంగాణ యువకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత సూచన మేరకు ప్రపంచంలోని అన్ని దేశాల్లో టీఆర్‌ఎస్ ఎన్నారై శాఖలను ఏర్పాటుచేస్తున్నామని ఆయన వెల్లడించారు. జాంబియాలో స్థిరపడిన తెలంగాణ ప్రజల అభ్యర్థన మేరకు టీఆర్‌ఎస్ జాంబియా శాఖను ప్రారంభించి, తాత్కాలిక కమిటీని ప్రకటించామని మహేశ్ బిగాల చెప్పారు. త్వరలోనే పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. జాంబియా టీఆర్‌ఎస్ శాఖ ఏర్పాటుకు కృషిచేసిన చాడ సృజనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్, మహేందర్, రాహుల్, అరవింద్, లక్ష్మీనాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆంటోని, శ్రీకాంత్, ప్రశాంత్‌రెడ్డి, రామకృష్ణ, లింగారెడ్డి, రామకృష్ణారెడ్డితో జాంబియా టీఆర్‌ఎస్ తాత్కాలిక కార్యవర్గాన్ని ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు.

పదో పీఆర్సీ హామీలు అమలుచేయండి

- సర్కార్‌కు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వినతి

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: పదో పీఆర్సీలోని హామీల మేరకు 70 ఏండ్ల వయస్సుకు చేరినవారికి అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ మంజూరుచేయాలని ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ విజ్ఞప్తి చేసింది. అన్ని జిల్లాకేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభించాలని, ప్రతిచోట పెన్షనర్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని జేఏసీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 1969, మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పదవీవిరమణ పొందిన ఉద్యోగులందరికీ తెలంగాణ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని, రాజీవ్ గృహకల్ప ఇండ్లను కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

పురుషోత్తంరెడ్డి బినామీలకు బెయిల్ తిరస్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిందితుడు హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి బినామీలు యాదవరెడ్డి, నిశాంత్‌రెడ్డిల బెయిల్ పిటిషన్‌ను శనివారం ఏసీబీ కోర్టు తిరస్కరించింది. కేసులో ప్రధాన నిందితుడు పురుషోత్తంరెడ్డిపై విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో యాదవరెడ్డి, నిశాంత్‌రెడ్డిలకు బెయిల్ మంజూరుచేస్తే సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉన్నదని, బెయిల్ ఇవ్వొద్దని ఏసీబీ అధికారులు కోర్టుకు విన్నవించారు. ఈ మేరకు వారి బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది.

ఉద్యమకారులను మరువం

అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి.. ఈశ్వరీబాయి వర్ధంతిసభలో మంత్రి చందూలాల్



శనివారం రవీంద్రభారతిలో ఈశ్వరీబాయి స్మారక అవార్డు గ్రహీతలు ఝాన్సీ గడ్డం, జూపాక సుభద్ర, సూరేపల్లి సుజాత, ఈ సుధారాణితో రాష్ట్ర మంత్రి చందూలాల్, ప్రభుత్వ సలహాదారు రమణాచారి, ఎమ్మెల్యే గీతారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ఉద్యమకారులను మరిచిపోలేమని, వారి పోరాటం, త్యాగాలు వెలకట్టలేనివని మంత్రి అజ్మీరా చందూలాల్ అన్నారు. తొలిదశ నుంచి మలిదశ వరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరిని గుర్తుంచుకుంటామని చెప్పారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో ఈశ్వరీబాయి ఎంతో సాహసంతో పోరాటం చేశారని తెలిపారు. రాష్ట్రసాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో జే ఈశ్వరీబాయి వర్ధంతి సభ నిర్వహించారు. ఈశ్వరీబాయి స్మారక అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి చందూలాల్ మాట్లాడుతూ గత పాలకుల హయాంలో బడుగు, బలహీనవర్గాలకు అన్యాయం జరిగిందని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం వెనుకబడినవర్గాల అభివృద్ధికి పాటుపడుతున్నదని, సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి మాట్లాడుతూ బలహీనవర్గాల అభివృద్ధికి ఈశ్వరీబాయి ఎనలేని కృషిచేశారని అన్నారు. ఈశ్వరీబాయి ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే గీతారెడ్డి మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం కూడా ఈశ్వరీబాయి పోరాటంచేశారని తెలిపారు. ఈశ్వరీబాయి వర్ధంతి సభను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ, ప్రభుత్వ అదనపు కార్యదర్శి (పీఆర్అండ్ ఆర్డీ) జూపాక సుభద్ర, శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ సూరేపల్లి సుజాత, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ప్రొఫెసర్ సుధారాణిలకు ఈశ్వరీబాయి అవార్డులను ప్రదానంచేశారు.

తొలిరోజు టీఆర్టీ ప్రశాంతం

52 కేంద్రాల్లో నిర్వహణ
ఉదయం పరీక్షకు 92.8 శాతం, మధ్యాహ్నం 85.43 శాతం హాజరు నమోదు: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువుల భర్తీ కోసం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) తొలిరోజు శనివారం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం జరిగిన లాంగ్వేజ్ పండిట్ తెలుగు పరీక్షలో 92.8 శాతం హాజరు నమోదైందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. మొత్తం 52 కేంద్రాల్లో 17,970 అభ్యర్థులకుగాను 17,333 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం జరిగిన స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)కు 16,827 మందికిగాను 15,473 మంది హాజరయ్యారని, 85.43 శాతం హాజరు నమోదైందని పేర్కొన్నారు. రెండు పరీక్షలను జోనల్ కో ఆర్డినేటర్లు, స్పెషల్ స్క్వాడ్‌లతోపాటు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించినట్టు చెప్పారు. ఆదివారం జరుగనున్న ఎస్జీటీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేశామని ఆమె పేర్కొన్నారు. ఉదయం జరిగే ఎస్జీటీ (తెలుగు మీడియం) పరీక్షకు 57,464 మంది, మధ్యాహ్నం జరిగే ఎస్జీటీ (ఇంగ్లిష్ మీడియం) పరీక్షకు 29,334 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు చెప్పారు.



శనివారం నాగోల్ సమీపంలోని శ్రేయాస్ ఇంజినీరింగ్ కాలేజీకి టీఆర్టీ పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు

ఇబ్బందుల్లేకుండా నిర్వహణ: ఘంటా చక్రపాణి

మొదటిరోజు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో టీఆర్టీ నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఎదురుకాలేదని, పరీక్షకు రికార్డుస్థాయిలో హాజరు నమోదైందని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి చెప్పారు. టీఎస్‌పీఎస్సీ సభ్యులు సీ విఠల్, సీహెచ్ విద్యాసాగర్‌రావు, కే రామ్మోహన్‌రెడ్డి, చింతా సాయిలు, మహ్మద్ మతీనుద్దీన్ ఖాద్రీతో కలిసి టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మొత్తం 48 సెషన్లు ఉండగా, ఆదివారం జరుగనున్న ఎస్జీటీ మినహా మిగతా పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. పరీక్షలు పూర్తయిన వెంటనే 'కీ' విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. సోషల్‌మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చక్రపాణి హెచ్చరించారు.

కొత్త ఉపాధ్యాయ విద్యాకోర్సులకు దరఖాస్తు చేసుకోండి

- రాష్ట్రానికి జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండు రకాల నూతన ఉపాధ్యాయ విద్యా కోర్సులకు దరఖాస్తులు కోరుతూ బెంగళూరులోని జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్సీటీఈ) రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌వుడ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం (డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్), నాలుగేండ్ల బీఈడ్ కోర్సుల కోసం ఎన్సీటీఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. బీఏ, బీఎడ్,/ బీఎస్సీ, బీఎడ్ కోర్సులకు ఈ అవకాశం కల్పిస్తున్నది. వీటిపై అభిప్రాయాలను కోరుతూ రాష్ట్రంలోని ఆరు సంప్రదాయక వర్సిటీలకు ఉన్నత విద్యామండలి లేఖ రాసింది.

త్వరలో అనుబంధ హాస్టళ్ల మార్గదర్శకాలు


- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ఇంటర్‌బోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు అనుబంధంగా నిర్మించనున్న హాస్టళ్లపై శనివారం ప్రభుత్వానికి ఇంటర్‌బోర్డు ప్రతిపాదనలు పంపింది. హాస్టళ్లలో గదులు, విద్యార్థుల సంఖ్య, స్ట్రక్చరల్ సౌండ్, శానిటేషన్, ఫైర్ సేఫ్టీ వంటి వివరాలతో కూడిన ప్రతిపాదనలను బోర్డు సెక్రటరీ పంపారు. హాస్టళ్ల ఏర్పాటులో ఎలాంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్న అంశంపై ప్రభుత్వం అధ్యయనం చేసి తుది మార్గదర్శకాలను త్వరలో జారీచేస్తుందని బోర్డు సెక్రటరీ ఏ అశోక్ తెలిపారు. నూతన మార్గదర్శకాలతో జీవో జారీ అవుతుందని, ఆ తర్వాత వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కృష్ణాబోర్డు వింత వైఖరి!

- టెలిమెట్రీకి, బోర్డు పరిధిలో ప్రాజెక్టుల అంశానికి లింకు
- టెలిమెట్రీ పనులు తాము పర్యవేక్షించినా ప్రాజెక్టు ఇంజినీర్లు సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణాబోర్డు తీరు మోకాలికి బోడిగుండుకు ముడిపెట్టినట్లున్నది. కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులపై టెలిమెట్రీ ఏర్పాటును ఇప్పటికే గందరగోళంగా మార్చిన బోర్డు అధికారులు, టెలిమెట్రీ కాంట్రాక్టు సంస్థకు బిల్లులు చెల్లించే సమయం వచ్చేసరికి ఆయా ప్రాజెక్టుల అసిస్టెంట్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను బాధ్యులుగా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పరిధిలో 18 చోట్ల టెలిమెట్రీ వ్యవస్థ ఏర్పాటుకు కృష్ణాబోర్డు టెండర్లు పిలిచి, మెకట్రానిక్స్ సంస్థకు పని అప్పగించింది. అయితే ఆ సంస్థ పనులు పక్కాగా పూర్తిచేయలేదు. ఆ మేరకు గ్యారంటీపై బోర్డు అధికారులకే నమ్మకం లేదు. పోతిరెడ్డిపాడు టెలిమెట్రీపై ఇప్పటికే పలు వివాదాలున్నాయి. అయినా కాంట్రాక్టు సంస్థకు పూర్తిస్థాయి బిల్లులు చెల్లించేందుకు బోర్డు సిద్ధమైం ది. ఇందుకు సంబంధిత ప్రాజెక్టు ఇంజినీర్ (ఏఈ/ఏఈఈ) పని పూర్తయినట్లుగా ధ్రువీకరణ పత్రాలు జారీచేయాలని కోరుతూ తెలంగాణ నీటిపారుదలశాఖకు లేఖ రాసింది. నిజానికి ఈ పని బోర్డు ఇంజినీర్లు చేయాలి. ఈ సంగతే పేర్కొంటూ బోర్డుకు ఈఎన్సీ మురళీధర్‌రావు బదులిచ్చారు. 'టెండర్లు పిలిచింది మీరే. పనులు పర్యవేక్షించింది మీరే. పని గడువును పెంచింది మీరే.. ప్రాజెక్టు ఇంజినీర్లకు సంబంధం లేకుండానే ఇదంతా చేసి ఇప్పుడు బిల్లుల చెల్లింపు దగ్గరికి రాగానే మాపై ఎందుకు బాధ్యత పెడుతున్నారు' అని లేఖలో ఈఎన్సీ ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం.. టెండర్లు పిలిచి, పర్యవేక్షించిన అధికారులే ఆ సక్రమంగా పని ముగిసిందని ధ్రువీకరించాలి. ఈ సంగతి టెండరు షెడ్యూలులోనే రాసి ఉన్నదని స్పష్టంచేశారు. అయినా బోర్డు పరిధిలోకి ప్రాజెక్టులు లేనందున ఈ పని తాము చేయలేమని బోర్డు వింత వాదనను తెరపైకి తెచ్చింది. ఈ మేరకు మరో లేఖ రాసింది. కాగా టెలిమెట్రీ బిల్లుల చెల్లింపునకు ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకురావడానికి సంబంధం లేదని తెలంగాణ ఇంజినీర్లు అంటున్నారు. టెలిమెట్రీ ఏర్పాటులో అవకతవకలు జరిగాయి. పోతిరెడ్డిపాడులో ట్యాంపరింగ్ కూడా జరిగింది. పరికరాలు ఆశించినట్లు పనిచేస్తున్నాయనేది తెలియదు. ఇక ముందు బాగానే పని చేస్తాయనాన్న గ్యారంటీ కూడా లేదు. అలాంటిది ఇవన్నీ సక్రమంగా నే ఉన్నట్లు తాము సర్టిఫై చేస్తే వాటి పనితీరుపై పూర్తి బాధ్యత తమదే అవుతుందని, ఆ బాధ్యత నుంచి తప్పించుకోవడానికే బోర్డు ఈ ఎత్తుగడ వేసిందని పలువురు ఇంజినీర్లు వ్యాఖ్యానిస్తున్నారు.



28న పీజీటీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ బాలురు, బాలికల పాఠశాలల్లో పీజీటీ (మ్యాథ్స్, సోషల్) పోస్టుల కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాతపరీక్ష ద్వారా ఎంపికచేసిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈ నెల 28న పరిశీలించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తెలిపారు. హైదరాబాద్ గగన్‌విహార్‌లోని గురుకుల విద్యాలయాల సంస్థ కార్యాలయంలో సర్టిఫికెట్లను పరిశీలించి, పోస్టింగ్ ఉత్తర్వులు అందజేస్తామని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

2న ఏఈవో సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వ్యవసాయ శాఖ ఏఈవో, సహకారశాఖ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను వచ్చే నెల 2న పరిశీలించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు www.tspsc.gov.in లో చూడాలని కోరింది.

ఏప్రిల్ 1న ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ ఏఈఈ పరీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఏఈఈ) పరీక్ష తేదీని సవరించినట్టు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. మార్చి 18వ తేదీన పరీక్ష నిర్వహించాల్సి ఉండగా.. అదేరోజు ఉగాది పండుగ నేపథ్యంలో సెలవు వస్తుంది. దీంతో ఏప్రిల్ ఒకటో తేదీన పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ చెప్పారు.

భూ పరిష్కారాలు-రెవెన్యూ కోర్టులపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ (టీజీటీఏ) ఆధ్వర్యంలో వెలువడుతున్న 'తెలంగాణ రెవెన్యూ' మాసపత్రిక, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రెవెన్యూ కోర్టులపై ఆదివారం ఉదయం 9:30 గంటలకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు మాసపత్రిక ఎడిటర్ వీ లచ్చిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ లా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

Life is Beautiful

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
ఆదివారం 25 ఫిబ్రవరి 2018
WWW. NTNEWS.COM





హీరోయిన్ అంటే

ఎక్స్‌పోజింగేనా?

కొందరు కథానాయికలు తమ పాత్రల ద్వారా సినిమాలను పునర్నిర్వచిస్తుంటారు. ఆది నుంచి విలక్షణ పంథాలో పయనిస్తూ ప్రతి పాత్రకు ప్రాణప్రతిష్ట చేస్తుంటారు. ప్రేక్షకుల్లో కొత్త ఇమేజ్‌ను సృష్టించుకుంటారు. అలాంటి కథానాయికల్లో నిత్యామీనన్ ఒకరు. గ్లామర్ పాత్రలు, కమర్షియల్ సినిమాలతోనే కథానాయికలు రాణించగలరనే సిద్ధాంతాన్ని తిరుగరాస్తూ దక్షిణాది భాషలన్నింటిలో ప్రతిభను చాటుకుంటున్నారామె. విమర్శలు, అపజయాలకు నెరవకుండా ప్రయోగాత్మక పాత్రలతో ప్రతి సినిమాలో తనను తాను కొత్త పంథాలో ఆవిష్కరించుకునేందుకు తపిస్తుంటారు. మనసులోని భావాల్ని నిర్మొహమాటంగా వ్యక్తీకరిస్తుంటారు. ఆ భిన్న ఆలోచన విధానమే ఆమెకు ప్రత్యేకతను సంపాదించి పెట్టింది. తన కెరీర్‌తో పాటు చిత్రపరిశ్రమలోని వివక్షను గురించి నిత్యామీనన్ 'జిందగీ'తో పంచుకున్న ముచ్చట్లివి..

షూటింగ్ లేనప్పుడు ఏం చేస్తుంటారు?
సినిమా ఒక్కటే జీవితం కాదు. ముఖ్యమైనవి ఇంకా ఎన్నో ఉన్నాయి. సినిమాలు చేయలేకపోయినా ఇతర వ్యాపకాలతో బిజీగా ఉంటాను. ఏ పనైనా మనస్ఫూర్తిగా ఇష్టపడి చేస్తుంటాను. అందుకే ఖాళీగా ఉన్నాననే భావన ఎప్పుడూ కలుగదు.

ప్రస్తుతం తెలుగులో రూపొందుతున్న సినిమాలపై మీ అభిప్రాయమేమిటి?
తెలుగు సినిమాల్లో చాలా మార్పులు రావాల్సిన అవసరముంది. మూసధోరణిలో సినిమాలు చేయడం కంటే ప్రేక్షకులందరి అభిరుచులకు తగినట్లుగా నవ్యమైన కథాంశాలతో మరిన్ని మంచి ప్రయత్నాలు జరుగాలి. ప్రయోగాత్మక కథాంశాల వైపు మొగ్గుచూపాలి. మలయాళంలో మంచి కథాబలమున్న సినిమాలు రూపొందుతున్నాయి. కథల విషయంలో హాలీవుడ్ సినిమాలతో పోటీ పడుతున్నారు. చిన్న సినిమాలతో మలయాళ దర్శకనిర్మాతలు ప్రతిభ చాటుతున్నారు. అలాంటి మంచి కథలతో తెలుగులో సినిమాల్ని తెరకెక్కించే ప్రయత్నాలు చేయాలి. జయాపజయాల గురించి ఆలోచించకుండా వైవిధ్యత కోసం తపించినప్పుడే మంచి సినిమాలు వస్తాయని అనుకుంటున్నా.

నెంబర్స్, బాక్సాఫీస్ లెక్కలను గురించి ఆలోచిస్తుంటారా?
నెంబర్‌గేమ్స్, కలెక్షన్స్ నాకు అర్థం కావు. వాటి గురించి ఆలోచించను. ఓ సినిమాలో నేనున్నాననే నమ్మకంతో ఎన్నో అంచనాలతో వెళుతుంటారు. వారిని నిరుత్సాహపరుచకూడదనే కోరుకుంటాను. అంతే తప్ప వసూళ్లు, జయాపజయాల గురించి పట్టించుకోను.

తెలుగు, తమిళంతో పాటు దక్షిణాది భాషలన్నింటిలో పనిచేశారు. అన్నిచోట్ల కథానాయికలకు ప్రాధాన్యమున్న పాత్రలు దక్కుతున్నాయని అనుకుంటున్నారా?
సాధారణంగా అన్ని భాషల్లో కథానాయికల్ని తెరపై ఎలా అందంగా చూపించగలమనేదానికే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. కేవలం గ్లామర్ కోణంలో చూపిస్తున్నారు. లుక్, ఎక్స్‌పోజింగ్ కోసమే వారిని ఉపయోగించుకుంటున్నారు. అంతే తప్ప ప్రతిభాపాటవాల్ని గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. అలాగని అన్ని భాషల్లో హీరోయిన్లను అలాగే చూపిస్తున్నారని చెప్పను. మలయాళంలో ప్రతిభకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తుంటారు. మంచి నటి అయితేనే అక్కడ నెగ్గుకు రాగలుగుతాం. లేదంటే ఒకటి రెండు సినిమాలతోనే తెరమరుగైపోతాం. అందానికంటే టాలెంట్‌కు మాత్రమే వారు విలువనిస్తుంటారు. ఈ విషయంలో మిగతా భాషల దర్శకనిర్మాతల దృక్పథంలో మార్పులు రావాల్సిన అవసరముంది.



మంచి నటిగా గుర్తింపును సొంతం చేసుకున్నారు. కమర్షియల్ విజయాల్ని అందుకోలేకపోయాననే అసంతృప్తి ఎప్పుడైనా కలిగిందా?
కమర్షియల్ హీరోయిన్‌గా గుర్తింపు పొందాలనో, స్టార్‌డమ్ కావాలని నేనెప్పుడూ కోరుకోలేదు. అదే నా ధ్యేయమైతే ఎప్పుడో అవన్నీ వచ్చుండేవి. 'అలా మొదలైంది' తర్వాత పెద్ద సినిమాల్లో చాలా అవకాశాలు వచ్చాయి. అవి అంగీకరిస్తే ఈ పాటికి తెలుగులోని అగ్రహీరోలందరితో సినిమాలు చేసి ఉండేదాన్ని. తొలి నాళ్ల నుంచి మనసుకు నచ్చిన కథలతోనే సినిమాలు చేస్తున్నా. కాబట్టి ఏ రోజు అసంతృపి ఎదురవ్వలేదు.

మీరు ముక్కుసూటిగా మాట్లాడుతుంటారని, నిర్మొహమాటంగా అభిప్రాయాల్ని చెబుతారని అంటుంటారు. దానివల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలున్నాయా?
ముక్కుసూటితనం వల్ల చాలాసార్లు సమస్యలు ఎదురయ్యాయి. లౌక్యంగా ఎలా మాట్లాడాలో ఇప్పుడిప్పుడే అలవాటు చేసుకుంటున్నాను. సాధారణంగా ఎవరైన దర్శకుడు కథ చెప్పినప్పుడు అది నచ్చకపోతే చాలా మంది డేట్స్ ఖాళీలేవనో, ఇతర కారణాలేవో చెబుతుంటారు. కానీ నేను మాత్రం కథ బాగాలేదని వారితో నిర్మొహమాటంగా నా అభిప్రాయం చెబుతుంటాను. అలా చెబితే వారు బాధపడుతారు కావచ్చు. కానీ అదే నాకు కరెక్ట్ అనిపిస్తుంటుంది.

సోషల్ మీడియాలో ఎక్కువగా కనిపించరు? ఎందుకని?
సోషల్‌మీడియాలో నేను లేను. నా పేరుతో కొన్ని ఖాతాలు ఉన్నాయి. వాటిని నేను చూడలేదు. ప్రతి విషయాన్ని సోషల్‌మీడియా ద్వారా స్పందించడం నాకు నచ్చదు.

విమర్శల్ని మీరు ఎలా స్వీకరిస్తుంటారు?
సినిమాలతో పోలిస్తే నాయకానాయికల వ్యక్తిగత జీవితాల్ని గురించి వార్తలు వింటున్నప్పుడు బాధ కలుగుతుంది. వాస్తవమేమిటో తెలుసుకొని వారిని అర్థం చేసుకొని రాస్తే బాగుంటుంది.

నటన, పాటలు పాడడంతో పాటు అవసరమైతే దర్శకులకు సినిమాల రూపకల్పనలో సలహాలు ఇస్తుంటారా?
స్నేహితుడి మాదిరిగా నాకు తోచిన సలహాలు, సూచనలు ఇస్తుంటాను. అలాగని ఫలానా పనిచేయాలని ఎప్పుడూ ఎవరినీ బలవంతపెట్టాను. నేను చెప్పినవి అమలు చేయడం, చేయకపోవడమన్నది వారిష్టం. ఎక్కడైనా తప్పు జరిగినట్టు కనిపిస్తే అది వారికి తెలియజేస్తుంటాను.

ఫిట్‌నెస్, గ్లామర్‌కు మీరిచ్చే ప్రాధాన్యత?
గ్లామర్, సైజ్‌జీరోలకు నటనకు ఎలాంటి సంబంధం ఉండదని నా నమ్మకం. కథ, నేను చేసే పాత్రలకు అవసరం అనుకుంటే మాత్రం బరువు తగ్గడంపై దృష్టిసారిస్తాను. అవసరం లేదంటే మాత్రం అంగీకరించను.

ప్రస్తుతం తెలుగు, బాలీవుడ్‌తో పాటు ఇతర భాషల్లో మహిళా ప్రధాన చిత్రాలు మంచి వసూళ్లను సాధిస్తున్నాయి. దీనిపై మీరేమంటారు?
మహిళల్ని మూసధోరణిలో చూపించాలనే ఆలోచనల్లో మార్పులు వస్తున్నాయి. శక్తివంతమైన పాత్రల్లో దర్శకనిర్మాతలు వారిని ఆవిష్కరిస్తున్నారు. భాషాభేదాలతో సంబంధం లేకుండా మహిళా ప్రధాన ఇతివృత్తాలతో తెరకెక్కిన సినిమాలు విజయాల్ని నమోదు చేయడం ఆనందంగా ఉంది. అయితే ఇలాంటి సినిమాలు సంఖ్య పెరుగాల్సిన అవసరం ఉన్నది. రచయితలు వారి కోసం మరిన్ని గొప్ప కథల్ని రాయాలి.

అలా మొదలైంది నుంచి అ! వరకు మీ సినీ ప్రయాణాన్ని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తుంది?
నా ప్రయాణం ఇంకా పూర్తవ్వలేదు. జీవితంలో సాధించాల్సింది చాలా ఉంది. ఇప్పుడిప్పుడే కెరీర్‌ను ప్రారంభిస్తున్న అనుభూతి కలుగుతున్నది. 50 యేండ్లు దాటినా జీవితానికి పరిపూర్ణత వస్తుంది. అప్పుడే ఆ ప్రశ్నకు సరైన సమాధానం చెప్పగలనేమోనని అనుకుంటున్నాను.

మీలో ఓ కవయిత్రి ఉందని, కవితలు రాస్తుంటారని తెలిసింది? సాహిత్యపఠనం చేస్తుంటారా?
చదువుకునే రోజుల్లో రాసిన కవితలు చాలా ఉన్నాయి. అవన్నీ ఇప్పటికీ భద్రంగా దాచిపెట్టాను. ఆ తర్వాత సినిమాల్లో పడి రాసే అలవాటు పోయింది. కానీ పుస్తకాలు మాత్రం చదువుతుంటాను, రచయితల్లో ఒక్కొక్కరి అభిప్రాయాలు ఒక్కోలా ఉంటాయి. వారి ఆలోచనల్ని మనమూ అనుసరించాలంటే కుదరదు. అందుకే ప్రత్యేకంగా రైటర్స్ ఎవరిని ఫాలో అవ్వను.

నటనకే పరిమితమవుతారా? భవిష్యత్తులో ఇతర విభాగాల్లో ప్రతిభను నిరూపించుకునే ఆలోచన ఉందా?
దర్శకురాలినవ్వాలనుంది. కానీ అది ఎప్పుడనేది తెలియదు. మానవ సంబంధాల నేపథ్యంలో సహజత్వంతో కూడిన కథాంశాలంటే నాకు చాలా ఇష్టం. అలాంటి కథతోనే నా సినిమా ఉంటుంది.

నరేష్ నెల్కి
సీఎం ప్రవీణ్‌కుమార్

నలుపు తగ్గాలంటే..

స్లీవ్‌లెస్ ధరించి పార్టీల్లో కనిపించాలని కోరిక ఉంటుంది. ఆ సమయంలో అండర్ ఆర్మ్స్ నల్లగా ఉంటే ఏం లాభం? ఇంట్లో దొరికే బేకింగ్ సోడా, ఇతర వస్తువులతో ఆ నల్లదనాన్ని ఎలా పోగొట్టుకోవాలో చూడండి..

- బేకింగ్ సోడాలో నీళ్లు పోసి మెత్తటి పేస్ట్‌లా తయారు చేయాలి. ఇది అండర్ ఆర్మ్స్‌లో రాసి పావుగంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. వారానికి మూడు నాలుగుసార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- మూడు నాలుగు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెలో ఒక టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా కలుపండి. దాన్ని నల్లని ప్రాంతంలో రాసి ఆరనివ్వాలి. రెండు వారాలకు ఒకసారి ఈ మిశ్రమాన్ని రాసుకోవచ్చు.
- బేకింగ్ సోడాలో గ్లిజరిన్, రోజ్‌వాటర్ కలిపి లోషన్ మాదిరిగా తయారుచేయాలి. ఈ మిశ్రమాన్ని నల్లగా ఉండే ప్రాంతంలో పూసి కాసేపు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేస్తే బెటర్.
- నల్లదనం మటుమాయం కావాలంటే.. బేకింగ్ సోడాలో పచ్చి పాలు పోసి కలుపాలి. దీన్ని అండర్ ఆర్మ్స్‌కు పట్టించాలి. 15నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. రెండు వారాలకు ఒకసారి ఇలా చేయాల్సి ఉంటుంది.
- కీరదోసని గుజ్జులా చేసుకోవాలి. దీంట్లో బేకింగ్ సోడా వేసి కలుపాలి. నల్లని ప్రాంతంలో పట్టించి 20 నిమిషాల తర్వాత వేడి నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం కొత్త నిగారింపు సంతరించుకుంటుంది.



కోపానికి మూల్యం తప్పదు!



కొంతమంది చీటికి మాటికి కోపగించుకుంటుంటారు. మరికొంతమంది అరుస్తుంటారు. ఇలాంటి వారు జీవితానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందనంటున్నారు డాక్టర్లు.

అప్పుడప్పుడు కోపం రావడం వేరు. కొంతమందికి ఎదుటివారు ఏం చేసినా, ఎలా చేసినా ఆగ్రహించుకుంటారు. కోపంతో ఊగిపోయి.. వారి పైన అరుస్తుంటారు. అలాంటి వారు కోపాన్ని పక్కన పెట్టకపోతే గుండెపోటు తప్పదని తాజా అధ్యయనంలో తేలింది. ఎప్పుడో ఒకసారి కోపగించుకుంటే పర్లేదు కానీ చిన్న చిన్న విషయాలకు కోపంతో ఊగిపోయేవారు మాత్రం జాగ్రత్తగా ఉండాలని యూరోపియన్ హార్ట్ జర్నల్ ప్రచురించన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. కోపానికి, గుండెపోటుకి సంబంధం ఉందని అధ్యయనకారులు అంటున్నారు. వ్యక్తి తీవ్రమైన ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన రెండు గంటల్లోపు గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి గుండె సమస్యలు లేకపోయినా.. హృద్రోగ సమస్యలు కచ్చితంగా వారిని అటాక్ చేయొచ్చునట. కాబట్టి కోపం తగ్గించుకొని నవ్వుతూ బతుకండని చెబుతున్నారు నిపుణులు.

ఫిష్ టెయిల్ ట్రెండ్!

ఫ్యాషన్ జమానాలో రోజుకో ట్రెండ్ వస్తుంది. డ్రెస్ ట్రెండ్.. హెయిర్ ట్రెండ్.. ఇలా చాలా ఉన్నాయి. ఒక్కోటి ఒక్కో ప్రాధాన్యతను.. ప్రత్యేకతను కలిగి ఉంటుంది. తాజాగా వచ్చిన ట్రెండ్ ఫిష్ టెయిల్ ట్రెండ్!

అందానికి ప్రామాణికంగా తీసుకునేవాటిలో మొదటిది ముఖం. 'ఆమె ముఖం చంద్రబింబంలా ప్రతిబింబిస్తున్నది'.. 'ఆమె కన్నులు కలువల్లా ఉన్నాయి' వంటి వర్ణనలు ముఖారవిందాన్ని చూసే పుట్టుకొచ్చాయి. నిజంగానే కళ్లు అమ్మాయిల ముఖానికి అదనపు అందాన్ని తీసుకొస్తాయి. పాతరోజుల్లో అయితే కళ్లు.. కనుబొమ్మలను డిజైనింగ్ చేయించుకునే ధోరణులు ఉండేవి కావు. కానీ ఇప్పటి యువత కనుబొమ్మలను అందం పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో కనుబొమ్మలను వివిధ ఆకారాల్లో చెక్కడం ట్రెండ్‌గా మారింది. అలాంటి ట్రెండ్‌లో ప్రస్తుతం అమ్మాయిలకే క్రేజీగా మారింది 'ఫిష్ టెయిల్ ట్రెండ్'! చేప తోకల్లాంటి కనుబొమ్మలను రూపొందించుకోవడమే ఈ ట్రెండ్ ఉద్దేశం. ఫిష్ టెయిల్స్ కనుబొమ్మలు కలిగిన యువతులను చూస్తే అచ్చం చేపల తోకలను చూసిన అనుభూతి కలుగుతుందని ఫ్యాషన్ డిజైనర్లు అంటున్నారు. ఫిష్ టెయిల్ ట్రెండ్ ఈ రకంగా యువతను ఉర్రూతలూగిస్తుండడంతో అంతా దాని వెంటే పరుగులు తీస్తున్నారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఎక్కువ ప్రాచుర్యం పొందిన ట్రెండ్స్‌లో ఇది ముందు వరుసలో ఉండడం విశేషం.



నమస్తే తెలంగాణ
సింగిడి
[హైదరాబాద్]
ఆదివారం 25 ఫిబ్రవరి 2018

ప్రత్యేక పాఠశాల

ప్లే స్కూల్స్ చూసే ఉంటారు. మ్యూజిక్ స్కూల్స్ గురించి వినే ఉంటారు. కానీ ఇది ఓ స్పెషల్ స్కూల్. అవును.. ఇది చాలా ప్రత్యేకమైన పాఠశాల. ఎందుకో చదివితే తెలుస్తుంది.



ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకి 22 కిలోమీటర్ల దూరంలో ఓ వ్యవసాయ క్షేత్రం ఉంది. అశిత, అనీష్ నాథ్‌లు దాని యజమానులు. వీళ్లిద్దరూ మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు వదిలి వ్యవసాయం వైపు కదిలారు. వ్యవసాయం చేస్తున్నారు. ఆదాయం బాగుంది. కానీ ఊర్లో పేదరికం వల్ల చిన్నారులు పాఠశాలకు దూరమవుతున్నారని తెలుసుకున్నారు. వ్యవసాయం చేసుకుంటూ నిరుపేద పిల్లలకు చదువులు కూడా చెప్పాలని నిర్ణయించుకున్నారు. రైతులు తమ పిల్లల్ని పాఠశాలలకు పంపకపోవడం వల్ల ఎంత నష్టపోతున్నారో చెప్పి ఉచితంగా చదువు చెప్తామని పిల్లల్ని కూడా వ్యవసాయ క్షేత్రానికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. 2016లో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్‌కు గ్రామంలో ఉన్న వాళ్లు స్పందించారు. వ్యవసాయ క్షేత్రంలో పిల్లలకు చదువు చెప్తూనే వ్యవసాయం చేస్తున్నారు. చదువు అంటే కేవలం చదువే కాదు.. వ్యవసాయం ఎలా చేయాలి? రైతులు ఎంత కష్టపడుతున్నారు? వంటి అంశాలను కూడా నేర్పుతున్నారు. 30 మంది విద్యార్థులు ప్రతిరోజు ఈ ప్రత్యేక పాఠశాలకు హాజరవుతున్నారు. ఈ పాఠశాల పేరు ద గుడ్ హార్వెస్ట్ స్కూల్. అశిత, అనీష్‌లతో ఇంకో నలుగురు టీచర్లు స్వచ్ఛందంగా పిల్లలకు నేర్పుతున్నారు.



**ఫ్యాషన్ ప్రపంచంలో మేటి.. డిజైనింగ్‌లో ఘనాపాటి..
బొటిక్ నిర్వహణకైనా.. ట్రెండ్‌ను సృష్టించడానికైనా..
ఒకటి ఉండాల్సిందే. ఆ రంగు పడాల్సిందే. అదే మనం మెచ్చిన ఇండిగో!
సహజ రంగులతో.. ఆకట్టుకునే డిజైన్లతో ఇండిగో వస్త్ర ప్రపంచానికే వన్నె తెస్తున్నది!
షూటింగ్.. షర్టింగ్.. డ్రెస్ మెటీరియల్.. చీరల్లో ఇండిగో ఎవర్‌గ్రీన్!
సహజ వర్ణాల సింగిడి రంగుల్లాంటి ఇండిగో గురించి తెలుసుకుందాం!**

ఇండియా ఇండిగో!

ఫ్యాషన్ డిజైనర్లు.. మాస్టర్ వీవర్లకు మేలైన వర్ణ వనరు ఇండిగో. ఆరోగ్యాన్ని కాపాడే ఈ ఇండిగో (సహజ రంగులు) అద్దడం అంత సులువైనది కాదు. అందుకే ఇండిగోకు మెటీరియల్.. మానవ వనరుల కొరత ఉన్నది. డిమాండ్ లెక్క లేనంతగా ఉన్నది. ఒక్క శాతం కూడా రసాయనాలు వినియోగించకుండా చేపట్టే పనికి అసాధారణమైన డిమాండ్ ఉన్నట్లు ఫ్యాషన్ నిపుణులు చెప్తున్నారు.







ఇక్కడ పుట్టి..

ఇండిగోఫెరా టింక్టోరియా (ఇండిగో) ఉష్ణమండలాల్లో పెరిగే పూలచెట్టు. 750 ఉప జాతులు కలిగిన అత్యంత అరుదైన మొక్క. దాని ఆకులే సహజ నీలిరంగుకు ఆధారం. ఒక్క భారత ఉపఖండంలో మాత్రమే పెరిగే అరుదైన జాతి. కానీ దీని ద్వారా వచ్చే రంగుకు ఇండిగో(నీలి) అని గ్రీకులు పేరు పెట్టారు. అరబ్ వ్యాపారుల ద్వారా యూరోప్ దేశాలకు చేరింది. ఆ తర్వాత విశ్వవ్యాపితమైంది. నేడు ఇండియాలో పుట్టిన ఇండిగోకు ఊహించనంత డిమాండ్ నెలకొన్నది. 1895లో ఇండియా నుంచి ఇంగ్లాండ్‌కు 40 వేల టన్నుల ఇండిగోను ఎగుమతి చేసినట్లు ఆధారాలు ఉన్నాయి. అది 1914కు 1100 టన్నులకు పడిపోయింది. వీవింగ్, డైయింగ్, ప్రింటింగ్ వంటి రంగాల్లో దీన్ని వినియోగించారు. గతేడాది నవంబరులో కోల్‌కత్తాలో ఇండియన్ కౌన్సెల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ ఆధ్వర్యంలో ఇండిగో సూత్రపై నిర్వహించిన మనోహరమైన సింపోజియంకు ప్రపంచ దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. దీన్ని బట్టి ఇండిగోకు విశ్వవ్యాపిత ప్రచారం ఉన్నదని అర్థమవుతుంది. మలేషియా, నైజీరియా, ఆఫ్రికా, జపాన్, థాయ్‌లాండ్, జోర్డాన్, సల్వాడార్, గ్రేట్ బ్రిటన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లోనూ ఈ సంప్రదాయపు రంగులద్ది సొగసైన వస్త్రాలను రూపొందిస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ప్రాంతాల్లోనూ ఈ రంగులద్దకానికి భారీ డిమాండ్ ఉంది. అందుకే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అందమైన పర్యావరణహిత వస్త్రోత్పత్తి చేస్తున్నారు. కళాంకారి వంటి డిజైన్లలోనూ ఇండిగోది ప్రధాన భూమిక. పాండిచ్చేరి, ఢిల్లీ, పాట్నా, త్రివేండ్రం, బెంగళూరు, జోధ్‌పూర్, కుచ్ ప్రాంతాల్లో మరింతగా ప్రాశస్త్యంగా మారింది. నగర శివార్లలో ఘట్‌కేసర్, రాజేంద్రనగర్, జియాగూడ ప్రాంతాల్లో ఇండిగో రంగులద్దే కేంద్రాలు నడుస్తున్నాయి. ఓ ప్రముఖ డిజైనర్‌కు చెందిన డిజైన్ స్టూడియోలో ప్రతి ఏటా 10 వేల మీటర్ల చేనేత వస్త్రాలకు ఇండిగోను అద్దుతున్నారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లోని రూరల్ పార్కులోని కేంద్రం ఎందరికో శిక్షణా కేంద్రంగా మారింది.

ఎలా చేస్తారు?



ఇండిగో ఫెరా ఆకును మురగబెట్టి ప్రాసెస్ చేస్తారు. ఆ తర్వాత కేక్‌గా మారుస్తారు. కేక్‌ను వినియోగించడమంటే మాటలు కాదు. కుండలో సొడు మట్టి పోస్తారు. దాంట్లో నీళ్లు పోసి ఉత్తరేణి గింజలను కిలో ఉడుకబెడతారు. దాంట్లో కేక్ వేసి వారం పాటు యార్న్‌ను నానబెడుతారు. యార్న్/ఫ్యాబ్రిక్‌కు ఏడు సార్లు కలర్ అద్దితేనే ఇండిగో ఆవిష్కృతమైంది. రసాయనాల వినియోగమైతే ఒక్కసారి రంగు అద్దితే చాలు. సహజ ఎరువుల వినియోగం కూడా కనిపిస్తున్నది. సహజసిద్ధమైన రంగు లద్దడానికి నెల సమయం కావాలి. కుండలను భూమిలో పాతుతారు. దాంట్లోనే యార్న్ నానబెడతారు. దాని ద్వారానే ఆరోగ్యప్రదమైన వస్త్ర ఉత్పత్తి సాధ్యమవుతున్నది. దానిమ్మ పొట్టుతో ఎల్లో, మెంజిస్టా, రతన్‌జ్యోతి చెట్టుపూలతో గ్రే, బంతిపూలతో ఎల్లో, ఆరెంజ్ వంటి రంగులద్దుతున్నారు. ప్రధానంగా ఇండిగో తర్వాత ఆరెంజ్, యెల్లో, బ్రౌన్, గ్రే వంటి సహజ రంగులకు డిమాండ్ నెలకొన్నది. కిలో యార్న్‌కు ఇండిగో అద్దితే రూ.150 నుంచి 200, ఇతర రంగులైతే రూ.100 వరకు తీసుకుంటున్నారు. ఇండిగో కేక్ కిలో రూ.1700-2400 వరకు ధర పలుకుతున్నది.

ఇండిగోకు డిమాండ్

'నేను 30 ఏండ్లుగా ఈ పనిలో ఉన్నా. నానాటికీ ఇండిగోకు డిమాండ్ పెరుగుతున్నది. నాణ్యమైన, ఎలాంటి రసాయనాల్లేకుండా ఇండిగో అద్దుతామనే వారికి పనికి కొదువ లేదు. ఐతే క్లిష్టమైన ఈ పని చేసేందుకు ముందుకు రావడం లేదు' అని ఎన్ఐఆర్డీ ఆర్టీపీలో సహజ రంగుల కేంద్రాన్ని నిర్వహిస్తోన్న ఎండీ సలీం అభిప్రాయం. ఎన్నో నగరాల్లో సహజ రంగులపై సదస్సులు జరిగాయి. చాలా చోట్ల ప్రజెంటేషన్ ఇచ్చాను. ఇండిగోకు ఉన్నంత డిమాండ్ మరే ఇతర రంగుకు లేదు. మార్కెటింగ్ సమస్య కూడా లేదు. ఫ్యాషన్ డిజైనర్లంతా కోరుకునేదిదే! ఒకనాడు ఇక్కడ తయారయ్యే కేక్‌ను దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. 18 శాతం జీఎస్టీ వల్ల ధరలూ పెరిగాయి. ఎవరైనా సహజ రంగులద్దే ప్రక్రియను నేర్చుకుంటామంటే శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని సలీం చెప్పారు.

శిరందాస్ ప్రవీణ్‌కుమార్
సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి

ప్రియ కాపీ.. బన్నీ హ్యాపీ!



ప్రియా వారియర్.. ఒక్క పేరు గత వారం పదిరోజుల నుంచి సోషల్‌మీడియాను తనవైపు మళ్లించుకున్నది. కుర్రకారు హృదయాలను కొల్లగొట్టి రికార్డులను బద్దలుకొట్టింది. మరి ప్రియా వారియర్ కన్ను సీన్ కాపీనంట! కన్ను కొట్టి గన్ను గురిపెట్టిన ప్రియకు ఇప్పుడు కాపీ సీన్ అంటూ కొత్త సమస్య వచ్చిపడింది.

ఏ చానెల్ చూసినా, ఏ పత్రిక చదివినా, ఏ సైట్ తెరిచినా, ఏం చూసినా, ఏం చేసినా కళ్లు మాత్రం కన్నుకొట్టిన అమ్మాయి మీదే ఉన్నాయి. కన్నుకొట్టి హృదయాలను కొల్లగొట్టిన అమ్మాయి ప్రియా వారియర్ మీద ఇప్పుడు ఇంకో వార్త చక్కర్లు కొడుతున్నది. ఒరు ఆదార్ లవ్ టీజర్ విడుదలైనప్పుడు రాత్రికి రాత్రే స్టార్‌గా మారిన ప్రియకు ఇప్పుడో సమస్య వచ్చిపడింది. కిడు అనే మలయాళ సినిమా ట్రైలర్‌లో కూడా అచ్చం ఇలాంటి సీన్ ఉండడం వల్ల ప్రియా వారియర్ ఆ సీన్ కాపీ కొట్టిందని కామెంట్లు పెడుతున్నారు. ఈ విషయంపై కిడు చిత్ర నిర్మాత తన ఫేస్‌బుక్ పేజీలో రెండు వీడియోలను పోస్ట్ చేశాడు. తన సినిమా షూటింగ్ ఎడిటింగ్ సమయంలో ఒరు ఆదార్ లవ్ సినిమాకంటే ముందే పూర్తయిందని, ప్రియా నటించిన సినిమా టీజర్ ముందు విడుదల కావడం వల్ల మా సినిమాలో సీన్ కాపీ అంటున్నారని చెప్పాడు. దయచేసి నిజాలు గమనించాలని పోస్ట్ చేశాడు. మరి ఆ సినిమాలో సీన్ వీళ్లు వాడుకున్నారా? వీళ్ల సినిమాలోని సీన్ వాళ్లు వాడుకున్నారా? అంశంలో ఎవరూ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. కాపీ సీన్ మాత్రం సోషల్‌మీడియా హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉండగా ప్రియా వారియర్ గన్‌తో కాలుస్తున్నట్టు అల్లు అర్జున్ తన కొడుకు అయాన్‌ను కూడా ముద్దు పెట్టి కాల్చాడు. బన్నీ షూట్ చేయగానే అయాన్ 'ఆ' అంటూ బెడ్‌మీద పడిపోయాడు. సరదాగా షూట్ చేసిన ఈ వీడియో కూడా సోషల్ నెట్‌వర్క్ సైట్‌లో చక్కర్లు కొడుతున్నది.



నాకిష్టమైన పాటలు..


జగమే మాయ	- దేవదాసు
ఒసేయ్ రాములమ్మ	- ఒసేయ్ రాములమ్మ
నీ ప్రశ్నలకు	- కొత్త బంగారులోకం
పోవే పో	- త్రీ
నీ చూపులే	- ఎందుకంటే ప్రేమంటే
ప్రేమించే ప్రేమవా	- నువ్వు నేను ప్రేమ
మన్మథుడా నీ కల	- మన్మథ
గుస గుస	- జెంటిల్ మెన్
ఉన్నట్టుండి గుండె	- నిన్ను కోరి
ఏమండోయ్	- ఎంసీఏ

గుండ్ల ఈశ్వర్ గౌడ్, సైదాపురం, యాదాద్రి భువనగిరి

క్లాసిక్ మూవీ

మనసు నాటకం

కొన్ని మనం వదిలేయాలనుకుంటాం. కొత్తగా జీవించాలని ఆశపడుతాం. కానీ అవి మనని వదులవు. అంతలోనే కొత్తవి అల్లుకుంటూపోతాయి. ఏం చేయాలో తోచదు. అప్పుడు మనల్ని మనమే వదిలేయాలని నిర్ణయించుకుంటాం!! తమ సమస్యని కాలం కూడా పరిష్కరించలేదని భావించిన మనిషి ఏం చేస్తాడు???!!



మగాళ్లంతా వాలీబాల్ ఆడుతున్నారు. నవ్వుతూ తుళ్లుతూ.. వగరుస్తూ.. ఇంతలో ఒక నాలుగేళ్ల పాప పరిగెత్తుకుంటూ వస్తుంది. అమాయకంగా అందంగా ఉందా పాప. 'పప్పా.. పప్పా ఆరాష్..' అని వచ్చీరాని మాటలతో పిలుస్తూ ఓ వైపు చెయ్యి చూపిస్తుంటుంది. వాళ్లంతా ఆటలో ఉంటారు. ఆ అమ్మాయి మొహన్ని గమనించే స్థితిలో లేరు. ' మీ పప్పాని మేం బానే చూసుకుంటాంలే' అని తలమీద మీద సరదాగా ఒక్కటిస్తాడు ఓ మిత్రుడు. ఇంతలో మరో పెద్దమ్మాయి డాడీ.. డాడీ.. అని పరిగెత్తుకుంటూ వస్తుంది. వీళ్ల మొహంలో కొంచెం టెన్షన్.. పప్పా ఆరాష్.. పప్పా ఆరాష్ అని తాను కూడా చెయ్యి చూపిస్తుందో వైపు.. అప్పుడు వాళ్లకు విషయం అర్థమయ్యి పరిగెత్తుతారు. వాళ్ల వెంటే కెమెరా కూడా.. అంతా ఉత్కంఠ.. ఏం జరిగింది??

ఒకింత నిగూఢత్వం కలిగి ఉన్న మానసిక నాటకం ఇది. ఇది వరకు కాలేజీ మిత్రులైన కొందరు కుటుంబాలతో కలిసి పిక్నిక్‌కు వస్తారు మూడు జంటలు వాళ్ల పిల్లలు. వాళ్లతో పాటు పెళ్లి కాని ఇంకో జంట. తాము మూడు రోజులుందామనుకుంటే ఒకరోజుకే దొరుకుతుంది వాళ్లకు గెస్ట్‌హౌజ్. ఆ గెస్ట్‌హౌజ్ ఓనర్ మూడు రోజులకి సర్దడం వీలుకాదు. ఇళ్లు దొరుకడం కష్టం. ఈ ప్రోగ్రాం అంతా ప్లాన్ చేసింది సఫీదా. ఆమె మూడురోజులకు ఖాళీ లేదని తెలిసినా.. ఉందని నమ్మించి అందరినీ తీసుకొచ్చింది. వచ్చాక మరొకటి వెతుక్కోవచ్చులే అని అనుకున్నది. ఎందుకంటే అసలే దొరుకలేదంటే ఇక్కడిదాకా రారు కదా.. అందుకే సఫీదా మెల్లిగా ఓనర్ దగ్గరికెళ్లి ' మేం అయితే ఎక్కడో క్యాంప్ వేసుకొని ఉండేవాళ్లం. కానీ మాతో ఒక కొత్త పెళ్లిజంట ఉన్నది. వాళ్లకిది ఒక రకంగా హనీమూన్' ఏదన్నా చేయొచ్చు కదా అంటుంది. ఆ ఓనర్ మరో గెస్ట్‌హౌజ్ కోసం ఆరా తీస్తే అది కూడా ఖాళీ లేదని తెలుస్తుంది. కొద్దిసేపాలోచించి ' ఒక విల్లా ఉన్నది కానీ పాడుబడింది. దానికి తోడు తలుపులు కిటికీలు సరిగ్గా లేవు. రాత్రి చలికి తట్టుకోవడం కష్టం. మీకేమో పిల్లలు కూడా ఉన్నారు మరి' అని అంటుంది. సరే ముందోసారి చూస్తాం దాని పరిస్థితి అని వెళ్తారు. సముద్రపు ఒడ్డునే ఆ విల్లా.. కొన్ని కిటికీ అద్దాలు పగిలి ఉన్నాయి. కిందంతా దుమ్ము పేరుకొని ఉంటుంది. కొందరికి నచ్చుతుంది. కొందరికి నచ్చదు. కొందరు ఉందామనీ, మరికొందరు వద్దనీ అంటారు. ఓటింగ్ పద్ధతిన ఉండడానికే నిర్ణయిస్తారు. అందరూ తలో చేయి వేసుకొని కాబోయే జంటను ఆట పట్టిస్తూ ఇల్లు సరిచేస్తారు. ఆ జంట ఒకరినొకరు తెలుసుకొనే ప్రయత్నంలో.. దగ్గరయ్యే పనిలో ఉంటారు. అందరూ ఆడుతూ పాడుతూ పనులు చేసుకుంటూ వంటలు సిద్ధం చేస్తారు. భోజనాలయ్యాక సరదాగా మూగ సంజ్ఞల ఆట ఆడుకుంటారు. అటు మీద మగాళ్లంతా బయట కూర్చొని హుక్కా పీలుస్తుంటారు. మరి అమ్మాయి బావున్నట్టేనా, మీకు నచ్చినట్టేనా, మన అహ్మద్‌కు జోడీ కుదిరినట్టేనా అని అందరినీ అడుగుతుంది సఫీదా చొరవగా... ఆనందంగా.. అందరూ ఆ అమ్మాయి నచ్చిందని చెబుతారు. సఫీదాయే ఆ అమ్మాయికి జర్మన్ మిత్రుడు అహ్మద్‌కి జోడీ కుదుర్చాలని అనుకున్నది. అందుకే ఆ అమ్మాయిని ఇక్కడిదాకా తీసుకొచ్చింది. ఆ అమ్మాయి తన కూతురికి ట్యూషన్ టీచర్. ఆ అమ్మాయి పేరే ఎల్లీ. తెల్లగా, గుండ్రంగా, చందమామలా మొహం, మల్లెపువ్వులా నవ్వు.



అస్గర్ ఫర్హాది రచించి దర్శకత్వం వహించిన ఈ జర్మన్/పర్షియన్ సినిమా ఎన్నో అంతర్జాతీయ సినిమా పండుగుల్లో అవార్డులు గెలుచుకున్నది. సఫీదాగా గోల్షిఫ్టె ఫరహానీ అద్భుతమైన నటనను కనబరిచింది.

ఉదయాన్నే మగవాళ్లంతా వాలీబాల్ ఆడుతుంటారు. ఆడవాళ్లు పనులకు ఉపక్రమిస్తుంటారు. 'నేను తెహ్రాన్ వెళ్లిపోతాను. ఒక్క రోజుకనే వచ్చాను. మూడు రోజులంటే నావల్ల కాదు అంటుంది' ఎల్లీ. కాదు ఉండాల్సిందే అంటుంది సఫీదా. పంపించకపోతే నడుస్తూ అయినా వెళ్లిపోతానంటుంది ఎల్లీ. మిగితావాళ్లు కూడా ఉండొచ్చుగా అని బతిమాలుతారు. సఫీదా మార్కెట్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఎక్కడ ఎల్లీ వెళ్లిపోతుందో అని ఆమె బ్యాగు దాచేస్తుంది. ఇంత మంది బలవంతపెడుతున్నారు కదా అని ఎల్లీ ఆలోచనలో పడుతుంది. ఇంటి ముందు మెట్ల మీద కూర్చుకుంటుంది. ఓ పిల్లాడు ఒడ్డున నీళ్లలో ఆడుతుంటాడు. మిగతా ఇద్దరు పిల్లలు గాలిపటం ఎగరేసే పనిలో ఉంటారు.

ఇదిగో ఇప్పుడే నేను మొదట్లో చెప్పిన ఉత్కంఠభరితమైన సన్నివేశం వచ్చేది. ఇప్పుడు మొదలై సినిమా సాంతం సాగే ఆ ఉత్కంఠ ఏమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే!

మనల్ని మన జీవితాన్నీ మన జీవితనాటకాన్నీ మనమే నిర్దేశించుకుంటున్నామనీ మనం అనుకుంటాం. కానీ మనల్ని నిర్దేశించేది మనం కాదు. మనం కాదూ అన్న విషయం మనకర్థం కాదు. కానీ చూసేవాళ్లకి అర్థమవుతుంటుంది. ఫిలాసఫీ అర్థం కాలేదా.. అదర్థం కావడానికే ఈ సినిమా!!

చక్రధర్‌రావు భైరంపల్లి, సెల్: 9848519435

సుడోకు

డైలీ సుడోకు 137 సమాధానం

9	2	6	7	8	3	5	4	1
7	4	3	2	1	5	9	8	6
8	1	5	6	9	4	3	2	7
5	9	1	3	4	6	2	7	8
2	6	7	8	5	9	4	1	3
3	8	4	1	7	2	6	9	5
1	3	2	9	6	8	7	5	4
6	5	8	4	2	7	1	3	9
4	7	9	5	3	1	8	6	2

డైలీ సుడోకు - 138

	1							5
8		3	2	7				
	5			8		2		
9	4				7	8		
3			1		9			7
		5	4				2	9
		7		6			9	
				1	2	3		4
4							6	

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



'102 నాటవుట్' సినిమా కోసం ర్యాప్ సాంగ్ పాడాను. రాత్రి 2.30 గంటలకు పాట పాడించారు.

అమితాబ్ బచ్చన్
@SrBachchan



అమితాబ్ బచ్చన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
33,169,866

కామన్‌మ్యాన్ వాయిస్

మార్కెట్ కమిటీలలో రిజర్వేషన్లు ఇస్తే ఎవ్వరు అడగలే. 60 యేండ్లలో లేనిది కొత్తగా ఎందుకిచ్చారని రైతు సమన్వయ సమితికి వచ్చే సరికి ఆగం ఆగం అయితుండ్రు. మెసెంజర్‌ల యాంటీ రిజర్వేషన్ రాజకీయాలు. వాట్సప్‌లో కుల రాజకీయాలు చేసేటోళ్లు.. ఫేస్‌బుక్‌ల మాత్రం బావురుమంటుండ్రు.
–SandeepReddy Kothapally

అక్షరాస్యతలో ఘనంగా ఉన్న రాష్ట్రంలో ఆకలిని చంపేశారు. అతిహీనం కేరళ. మానవత్వం చనిపోయింది.
–Krishna Mohan Thumburu

మరి టీచర్ కాల్పులు జరిపితే ఏం చేస్తారు? కొవ్వు పెంచుకోవడమే కొవ్వు సమస్యకు పరిష్కారం అన్నట్టు. ఆయుధాలు పెంచుకోవడమే ఆయుధాల సమస్యకు పరిష్కారం అనుకొంటున్నారు. కాలమే సమాధానం చెబుతుంది.
–Murali Buddha

వైరల్ వీడియో



మీకో నిజం చెప్పాలి. విజయ్ దేవరకొండకు అమ్మాయిలంటే జెలసీ అంట! ఎందుకో తెలియాలంటే ఈ ట్రెండింగ్ వీడియో చూడండి.

Vijay Devarkonda Latest Beautiful Ad | KLM Fashion Mall | Telugu Hero's Updates | NewsMax
Total views : 109,082+
Published on Feb 22, 2018



హైదరాబాద్ శివరాంపల్లిలోని పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ -273 వద్ద లోడ్‌తో వెళ్తున్న పెట్రో ట్యాంకర్ శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ట్యాంకర్‌లో 15 వేల లీటర్ల పెట్రోల్, 5 వేల లీటర్ల డీజిల్ ఉండగా, సగానికి పైగా నేలపాలయింది. డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో తప్పించుకున్నారు. డీజిల్, పెట్రోల్ రోడ్డుపై వరదలా పారడంతో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. సుమారు ఆరు గంటలపాటు శ్రమించి ట్యాంకర్‌ను తొలగించారు.

- రాజేంద్రనగర్

ఎలక్ట్రిక్ బస్సులకు త్వరలో టెండర్లు

రెండు విడుతలుగా 100 బస్సులు.. అద్దె బస్సులుగా తీసుకురానున్న సిటీ ఆర్టీసీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఎలక్ట్రిక్ బస్సులను వీలైనంత త్వరగా హైదరాబాద్ రోడ్లపైకి తీసుకురావాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ మేరకు అతి త్వరలో టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తిప్పేందుకు 100 బస్సులను రెండు విడుతలుగా తీసుకురానున్నారు. మొదటగా 48 బస్సులు, రెండో విడుతలో మరో 52 బస్సులను తేనున్నారు. అయితే వీటిని ఆర్టీసీ కొనుగోలు చేయకుండా హైర్ పద్ధతిన ఆర్టీసీ నడుపనున్నది. దీనికోసం ఇప్పటికే విజయవంతమైన నాలుగు కంపెనీల బస్సులను పరిగణనలోకి తీసుకోగా, అవే నాలుగు కంపెనీలైన టాటా, అశోక్‌లీలాండ్, గోల్డ్‌స్టోన్, హ్యుందాయ్ కంపెనీల బస్సులతో టెండర్లో పాల్గొనేందుకు బిడ్డర్లు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. టెండర్లకు కొన్ని నిబంధనలను ఇప్పటికే ఖరారు చేసినట్టు సమాచారం. ఒక్కో బిడ్డరు(హైర్ పద్ధతిన బస్సులు నడిపేందుకు సిద్ధపడ్డ కాంట్రాక్టర్) కనీసం 25 బస్సులకు తగ్గకుండా నడపాలి. 25 బస్సులు లేదా అంతకుమించి బస్సులు నడిపిస్తామనే హామీ పత్రం ఇవ్వడంతోపాటు టెండరు ఖరారైన 90 రోజుల్లోగా బస్సులను పూర్తిస్థాయిలో సమకూర్చాల్సి ఉంటుంది. ఇప్పటికే దీనిపై అనేకసార్లు సమావేశమైన అధికారులు, గత 15వ తేదీన జరిగిన సమావేశంలో పూర్తిస్థాయి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఎలక్ట్రిక్ వాహన పాలసీ తీసుకువస్తున్న క్రమంలో ఆర్టీసీ కూడా బ్యాటరీతో నడిచే బస్సులను కొనుగోలు చేస్తున్నది. ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాయితీలుంటాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంలోపాటు, రాష్ట్ర ప్రభుత్వం కూడా పన్ను రాయితీ ఇస్తామని చెప్పడంతో వీటిని తీసుకురావాలని నిర్ణయించారు. రూ.2 కోట్ల విలువైన బస్సును 50 శాతం రాయితీతో అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే బెంగళూరులో ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్న నేపథ్యంలో ఇక్కడ కూడా సక్సెస్ అవుతాయనే ఉద్దేశంతో వీటిని తీసుకువస్తున్నారు. కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఇప్పటికే ఆర్టీసీ సీఎన్జీ వాహనాలను నగరంలో తిప్పుతున్నది. డీజిల్ బస్సులతో పోలిస్తే ఈ వాహనాలు కాలుష్యం విషయంలో మెరుగైన ఫలితాలిస్తుండటంతో ఎలక్ట్రిక్ బస్సులు మరింత ప్రయోజనకరంగా ఉంటాయని అధికారులు నిర్ణయించారు. ఒక్కసారి పూర్తిగా చార్జి చేస్తే 200 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని ఆర్టీసీ అధికారులు వివరించారు. కొత్తగా ప్రవేశపెట్టే ఎలక్ట్రిక్ వాహనాలు మెట్రోకు అనుసంధానించడంతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి నడిపించనున్నట్టు అధికారులు పేర్కొన్నారు.



మూసీ అభివృద్ధి, సుందరీకరణకు

అంతర్జాతీయ డిజైన్ పోటీలు

వందేండ్ల గండిపేట చెరువు అభివృద్ధికి చర్యలు
మూసీ శుద్ధికి జాయింట్ యాక్షన్ కమిటీ
సమీక్షలో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్ నగరం మధ్య నుంచి ప్రవహించే చారిత్రాత్మక మూసీ నది అభివృద్ధి.. సుందరీకరణపై అంతర్జాతీయస్థాయి డిజైన్ పోటీలను నిర్వహిస్తామని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. అదేవిధంగా గండిపేట చెరువును నిర్మించి 2020 నాటికి వందేండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో హెచ్ఎండీఏ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని వెల్లడించారు. సాగునీటిశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలకు తోడుగా.. హెచ్ఎండీఏ, టూరిజంశాఖలు సంయుక్తంగా గండిపేట చెరువు సుందరీకరణ పనులను చేపడుతాయన్నారు. శనివారం హైదరాబాద్ మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో మూసీ అభివృద్ధి, సుందరీకరణ పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. మూసీ చుట్టూ ఏర్పాటుచేయనున్న ఎక్స్‌ప్రెస్‌హైవేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంపై చర్చించారు. మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫీజిబిలిటీ నివేదిక తయారైందని, సాగునీటిశాఖ చేపట్టిన హైడ్రాలిక్ సర్వే త్వరలో పూర్తవుతుందని చెప్పారు. మూసీ అభివృద్ధిలో భాగంగా పర్యావరణ అనుమతులకోసం దరఖాస్తు చేసినట్టు చెప్పారు. నీటిశుద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై వాటర్ వర్క్స్, పీసీబీ, టీఎస్ఐఐసీ అధికారులతో ఒక జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో ఈ అంశంపైన ప్రాథమిక నివేదిక అందజేయాలని కోరారు. మూసీ సుందరీకరణ కోసం ఇప్పటికే ప్రభుత్వం ప్రాథమికంగా పలు ప్రణాళికలను రూపొందించిందని, దీంతోపాటు త్వరలోనే ఒక డిజైన్ కాంపిటీషన్ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. స్థానికంగా ఉన్న నగరపౌరుల నుంచి నదుల సుందరీకరణలో పాలుపంచుకున్న పలు ప్రపంచ స్థాయి సంస్థల సూచనలు తీసుకునేందుకు ఈ డిజైన్ కాంపిటీషన్ ఉపయోగపడుతుందని చెప్పారు. మూసీ నదిలో నిరంతరం మంచినీరు ప్రవహించేలా చేసేందుకు గల అవకాశాలపై జలమండలి, సాగునీటిశాఖ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో నగర మేయర్ బొంతు రామ్మోహన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రేమ్‌సింగ్ రాథోడ్, పర్యాటకశాఖ కార్యదర్శి బీ వెంకటేశం, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మూసీ అభివృద్ధి, సుందరీకరణ పనులపై సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మేయర్ బొంతు రామ్మోహన్, పర్యాటకశాఖ కార్యదర్శి బీ వెంకటేశం, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు

నేర్చుకున్న అంశాలను అమలు చేయాలి



శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పత్రాలు అందజేస్తున్న వ్యవసాయశాఖ కమిషనర్ జగన్‌మోహన్, వీసీ ప్రవీణ్‌రావు

- రైతులకు మెరుగైన సేవలందించాలి
- అగ్రానమిస్ట్ శిక్షణ ముగింపులో వ్యవసాయశాఖ కమిషనర్ జగన్‌మోహన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అగ్రానమిస్ట్ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలుపరచి రైతులకు మెరుగైనసేవలు అందించాలని మండల వ్యవసాయాధికారులకు వ్యవసాయశాఖ కమిషనర్ జగన్‌మోహన్ సూచించారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో నిర్వహించిన ఆరురోజుల అగ్రానమిస్ట్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మారిస్తే రైతులు ప్రయోజనం పొందుతారన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, పురుగుమందుల వాడకం చేపట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు. సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు అగ్రానమిస్ట్ శిక్షణా కార్యక్రమాన్ని వర్సిటీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిందన్నారు. ఇప్పటివరకు 9 బ్యాచ్‌ల్లో 426 మందికి శిక్షణ అందించామన్నారు. శిక్షణ పొందిన మండల వ్యవసాయాధికారులకు సీఎంతో ముఖాముఖి నిర్వహించే ఆలోచన చేస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖకు మంచి పేరు తీసుకురావడానికి అధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. వీసీ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ దుక్కి దున్నడం నుంచి పంటకోత వరకు రైతులకు అవసరమైన అన్ని సేవలను అందించాలన్న లక్ష్యంతోనే ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు డిజిటల్ విప్లవాన్ని వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సంచాలకులు డీ రాజిరెడ్డి, మధుబాబు, కోర్సు కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాస్ట్ అకౌంటెంట్స్‌తోనే అభివృద్ధి సాధ్యం

వ్యాపారరంగంలో వారే కీలకం: ఐసీఏఐ అధ్యక్షుడు సంజయ్ గుప్తా



అకౌంటెంట్స్ కోర్సు విద్యార్థుల సదస్సును ప్రారంభిస్తున్న సంజయ్ గుప్తా

ఖైరతాబాద్: వ్యాపార, వాణిజ్యరంగాల్లో అభివృద్ధిచెందడం కాస్ట్ అకౌంటెంట్స్ ద్వారానే సాధ్యమవుతుందని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఇండియా (ఐసీఏఐ) అధ్యక్షుడు, సీఎంఏ సంజయ్‌గుప్తా పేర్కొన్నారు. శనివారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ కోర్సు విద్యార్థుల రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును సంజయ్‌గుప్తాతోపాటు ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఇండియా (ఎస్ఐఆర్సీ) సభ్యుడు జితేందర్‌రావు, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ ఆర్ చంద్రశేఖర్, ఐసీఏఐ సెంట్రల్ కమిటీ సభ్యుడు పీవీఎస్ జగన్‌మోహన్‌రావు, జీఎస్టీ కోర్సు కోఆర్డినేటర్ మల్లికార్జున్‌గుప్తా ప్రారంభించారు. వచ్చే నెల 16, 17 తేదీల్లో న్యూఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరుగనున్న 58వ జాతీయ కాస్ట్ కన్వెన్షన్-2018 బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజయ్ గుప్తా మాట్లాడుతూ ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ఉదంతానికి ప్రస్తుత బ్యాంకింగ్ వ్యవస్థే కారణమన్నారు. పీవీఎస్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ దేశంలో ఏ కంపెనీకైనా ఆడిట్ ప్రక్రియ తప్పనిసరి అని, అయితే నిష్ణాతులైన కాస్ట్ అకౌంటెంట్స్‌ను కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తే వారు లాభాలబాటలో నడిపిస్తారన్నారు. రైతు సమన్వయ కమిటీలు వేస్తామని సీఎం ప్రకటించారని, 2,600 మందితో కమిటీ ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. ఆయా కమిటీలకు సలహాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

విద్యార్థుల వద్దకే కార్పొరేట్ సంస్థలు

చదువుకొంటూనే నైపుణ్య శిక్షణ
చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగావకాశాలు
టాస్క్, హైసియా ఒప్పందంతో విద్యార్థులకు లబ్ధి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా నిర్దేశించుకొన్న తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్ (టాస్క్) సంస్థ మరిన్ని వినూత్న విధానాలను అవలంబిస్తున్నది. కార్పొరేట్ ఉద్యోగాల సాధనకు అవసరమైన శిక్షణను అందిస్తూనే.. ఆవిష్కర్తలుగా వారిని తీర్చిదిద్దుతున్నది. ఇందుకోసం పరిశ్రమలను విద్యార్థులకు చేరువచేస్తున్నది. రాష్ట్రంలో స్థాపిస్తున్న కంపెనీల్లో మన విద్యార్థులే ఉద్యోగాలు పొందాలనే లక్ష్యంతో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తీర్చిదిద్దిన టాస్క్ సంస్థ యువతకు మెరుగైన భవిష్యత్‌ను అందించేందుకు గల అన్ని అవకాశాలను అధ్యయనం చేస్తున్నది. ఇప్పటికే విద్యార్థులకు కార్పొరేట్ కొలువులు సంపాదించుకునేందుకు తగిన శిక్షణను అందించి పలు అంతర్జాతీయ సంస్థలకు నైపుణ్యవంతులైన మానవ వనరులను అందించిన టాస్క్.. మరో ముందడుగువేసింది. పరిశ్రమల భాగస్వామ్యంతో కార్పొరేట్ సంస్థల కీలక ఉద్యోగులను విద్యార్థుల కాలేజీల వద్దకు తీసుకొస్తున్నది. ప్రధానంగా ఐటీరంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. హైదరాబాద్ కేంద్రంగా విస్తరించిన ఐటీ పరిశ్రమకు సంబంధించిన హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్ (హైసియా) తో టాస్క్ జత కట్టింది. ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు తమ విద్యను అభ్యసిస్తూనే ఇటు నైపుణ్యాలు పెంపొందించుకోవడంతో పాటు తమ సృజనకు పదును పెట్టే అవకాశం కల్పించడం ఈ ఒప్పందం సారాంశం. ఈ ఒప్పందంలో భాగంగా హైసియా ప్రతినిధులే నేరుగా కాలేజీలకు వచ్చి నూతన అవకాశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 200 మంది శిక్షణ పొందగా, 100 మంది షార్ట్‌లిస్ట్ అయ్యారు. వారంలో సదరు కంపెనీలు నియామక పత్రాలు అందించనున్నట్లు టాస్క్ సీఈవో సుజీవ్‌నాయర్ 'నమస్తే తెలంగాణ'తో తెలిపారు. పరిశోధనరంగం వైపు ఆసక్తిచూపే సంస్థలు సైతం వారికి మంచి అవకాశాలు కల్పిస్తాయన్నారు.

పెరిగిన వక్ఫ్‌బోర్డు ఆదాయం

- గత ఏడాదికంటే రూ.3.67 కోట్లు అధికం
- 104 అంశాలు ఎజెండాగా సాగిన బోర్డు సమావేశం
- వచ్చే నెల 10న జరుగనున్న సమావేశంలో మరిన్ని కీలక నిర్ణయాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర వక్ఫ్ బోర్డు(టీఎస్‌డబ్ల్యూక్యూటీ)కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3.67 కోట్లకుపైగా ఆదాయం పెరిగింది. 2016-17లో బోర్డుకు రూ.6,32,53,266 ఆదాయం రాగా, 2017-18 (11నెలలకు)లో రూ.10 కోట్లకు చేరింది. ఈ విషయాన్ని వక్ఫ్‌బోర్డు చైర్మన్, ఎమ్మెల్సీ మహ్మద్ సలీం శనివారం జరిగిన బోర్డు సమావేశంలో వివరించారు. మొత్తం 104 అంశాలు ఎజెండాగా ఈ సమావేశం జరిగింది. వచ్చే నెల 10వ తేదీన మళ్లీ బోర్డు సమావేశం జరుగనున్నది. ఇందులో పలు కీలకమైన అంశాలపై బోర్డు పాలకవర్గం నిర్ణయం తీసుకోనున్నది. శనివారం సమావేశంలో ఐదు మసీదుల నిర్మాణం, ఆరు దర్గాలకు ముతవల్లీ (పర్యవేక్షకులు)లను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మసీదులు, దర్గాలు, ముస్లిం శ్మశానవాటికల పర్యవేక్షణకు 24 మేనేజింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ముస్లిం వివాహాలకు సంబంధించి మ్యారేజ్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చే విషయమై ప్రత్యేక వెబ్‌సైట్‌ను బోర్డు ప్రారంభించబోతున్నది. దీనికి సంబంధించి బోర్డు సమావేశంలో డెమో ద్వారా పాలకవర్గం సభ్యులకు వివరించారు. అమెరికా, బ్రిటన్, సౌదీ ఇలా ఏ దేశం నుంచైనా మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సౌకర్యాన్ని వక్ఫ్‌బోర్డు ప్రవేశపెట్టబోతున్నది. మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరమైనప్పుడు సదరు వ్యక్తి ఆన్‌లైన్‌లో తాము ఉంటున్న దేశంలో చూసుకోవడానికి, కాపీని పొందడానికి బోర్డు సౌకర్యం కల్పించబోతున్నది. ఈ విషయంలో మార్చి 10న జరుగనున్న బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని సభ్యులు నిర్ణయించారు. వక్ఫ్‌భూములు, ఆస్తులు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్ని కబ్జాకు గురయ్యాయి? మిగిలిన భూముల పరిస్థితి ఎలాఉన్నది? అనే విషయంలో రెండోవక్ఫ్ సర్వే కమిషన్ నివేదిక, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్లు జిల్లాలవారీగా సర్వే చేయించి ఆ నివేదిక ఆధారంగా ఆస్తుల విషయమై వచ్చే సమావేశంలో తుది ప్రకటన చేయాలని నిర్ణయించారు.

గొడవలు జరుగొద్దనే పోలీస్ పికెట్: చైర్మన్ సలీం

బోర్డు కార్యాలయంలోని అకౌంట్స్ సెక్షన్ నుంచి ఎటువంటి ఫైళ్లు మాయం కాలేదని చైర్మన్ మహ్మద్ సలీం స్పష్టం చేశారు. బోర్డు సమావేశం అనంతరం పాలకవర్గ సభ్యులు, బోర్డు సీఈవో అబ్దుల్ మన్నాన్‌తో కలిసి చైర్మన్ మీడియాతో మాట్లాడారు. కొన్ని రోజుల కిందట అకౌంట్ సెక్షన్‌లో దొంగతనం కోసం ప్రయత్నం జరిగిన మాట వాస్తవమేనని, దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. సెక్షన్‌లోని ఫైళ్లు, రూ.2 లక్షల నగదు అలాగే ఉన్నదని వెల్లడించారు. బోర్డు సీఈవో అబ్దుల్ మన్నాన్ సంతకాన్ని కొందరు ఫోర్జరీ చేసి కార్యకలాపాలు సాగించిన వ్యవహారంపై కూడా పోలీస్ దర్యాప్తు జరుగుతున్నదన్నారు. బోర్డులో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించే విషయంలో బోర్డు ఆర్థిక పరిస్థితి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మదీనా బిల్డింగ్ వద్ద గల వక్ఫ్ కమర్షియల్ కాంప్లెక్స్ అద్దె విషయంలో పాలకవర్గం గత సమావేశంలో తీర్మానం చేసి చైర్మన్, సీఈవోకు పూర్తి అధికారాలిచ్చిందన్నారు. ఆ మేరకు అక్కడ ఉంటున్న వ్యాపారుల అద్దెలను సవరిస్తామని, మార్కెట్ అద్దె విలువలో 30 శాతం రాయితీ కూడా ఇస్తామని ప్రకటించారు. ప్రతిసారి బోర్డు పాలకవర్గ సమావేశం సమయంలో కొందరు బయటి వ్యక్తులు వచ్చి ప్రదర్శనలు, గొడవలు చేస్తుండటం వల్లే ఇక నుంచి బోర్డు సమావేశం సందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్‌కు గతంలో విజ్ఞప్తి చేశామని, ఆ మేరకు సమావేశం జరుగుతున్న చోట పోలీస్ పికెట్ కూడా ఉంటుందని పేర్కొన్నారు.

స్టార్ హోటళ్లకు అడిగిన వెంటనే బార్ లైసెన్స్

కేంద్ర పర్యాటకశాఖ సర్టిఫికెట్ ఉంటే చాలు
గుడి, బడి, దవాఖాన నిబంధనలు వర్తించవు
ఇలాంటివి దేశంలో 1,015.. హైదరాబాద్‌లో 35
పర్యాటకరంగం అభివృద్ధిలో భాగంగా లైసెన్సులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా మాదిరిగా మెట్రో నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో స్టార్‌హోటళ్లు కూడా అధికంగా వెలుస్తున్నాయి. దేశవిదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు హైదరాబాద్‌లోని స్టార్‌హోటళ్లు కూడా బార్ లైసెన్స్‌లు పొందుతున్నాయి. నిజానికి దేశవ్యాప్తంగా అమలులో ఉన్న ఎక్సైజ్‌చట్టం ప్రకారం స్టార్‌హోటళ్లకు అడిగిందే తడువుగా ఆయా రాష్ట్రాలు బార్‌లైసెన్సులు మంజూరుచేస్తాయి. నిర్దేశిత సమయంలో కాకుండా అడిగిన వెంటనే లైసెన్స్ మంజూరుచేయాలని ఈ చట్టం పేర్కొంది. గుడి, బడి, దవాఖాన నిబంధనలు కూడా వీటికి వర్తించవు. కేంద్ర పర్యాటకశాఖ సర్టిఫికెట్ జారీచేసిన స్టార్‌హోటళ్లకు మాత్రమే రాష్ట్రాలు ఇలాంటి లైసెన్సులు మంజూరుచేస్తాయి. ఇప్పటివరకు దేశవ్యాపంగా 1,015 స్టార్ హోటళ్లలో బార్లు నడుస్తుండగా, హైదరాబాద్‌లో 35 ఉన్నాయి. హైదరాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పరిధిలో 16, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పరిధిలో 19 వరకు స్టార్‌హోటల్స్ ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా పరిధిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు 11 ఉండగా ఫోర్‌స్టార్ రెండు, త్రీస్టార్ హోటళ్లు ఆరు వరకు ఉన్నాయి. హైదరాబాద్ పరిధిలో ఫైవ్‌స్టార్ ఏడు ఉండగా, ఫోర్‌స్టార్ నాలుగు, త్రీస్టార్ హోటళ్లు ఐదు ఉన్నాయి. పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో స్టార్‌హోటళ్లకు బార్‌లైసెన్స్‌లను అడిగిందే తడువుగా మంజూరుచేస్తున్నారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై వంటి మెట్రో నగరాల్లో అడిగిన వెంటనే బార్ల లైసెన్స్ మంజూరుచేస్తున్నారు. తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాల్లో స్టార్‌హోటళ్లకే కాకుండా, మామూలు బార్‌లైసెన్స్‌లు కూడా ఎప్పుడుపడితే అప్పుడు జారీచేస్తారు. పైగా ఇక్కడ మద్యంషాపు (వైన్‌షాపులు)లను ప్రభుత్వమే నిర్వహిస్తుంది. ఇరురాష్ట్రాల్లో బార్లను మాత్రం ప్రైవేట్ వ్యాపారులు నిర్వహిస్తారు.

నడుమునొప్పికి జీన్ థెరపీ వచ్చేసింది!

- అరిగిపోయిన డిస్కును మళ్లీ నార్మల్ చేయొచ్చు!
- వెన్నుపాములోని డిస్కు సమస్యలకిక ఆపరేషన్ అవసరం లేని రోజులు రానున్నాయి!
- హైదరాబాదీ డాక్టర్ పరిశోధనతో సరికొత్త చికిత్స



వెన్నుపూసలోని డిస్క్ అరిగిందా.. నో ప్రాబ్లమ్. అరిగిన డిస్కును ఎప్పటిలా చేయగలిగే కొత్త చికిత్స రానున్నది. నడుమునొప్పయినా, మెడనొప్పయినా, వెన్నునొప్పయినా... ఇక మందులూ, ఫిజియోథెరపీ అంటూ నానా యాతనలు అవసరంలేదు. ఆపరేషన్ చేయించుకోవాల్సిన అగత్యం అసలే లేదు. ఇవేవీ అవసరంలేని కొత్త చికిత్స నేడోరేపో వాస్తవరూపం దాల్చనున్నది. మన తెలుగు డాక్టర్ చేసిన పరిశోధన ఫలితాలు రానున్న నాలుగైదేండ్లలో జన్యుచికిత్సగా అందుబాటులోకి రానున్నాయి.

వెన్నుపూసకు సంబంధించిన సమస్యల్లో ఎక్కువమందిని బాధించేవి డిస్కు సంబంధమైనవే. వయసు పెరుగుతున్నకొద్దీ ఎక్కువ మందిలో కనిపించే సమస్య డిస్కు అరుగుదల (డిస్క్ డీజనరేషన్). దాంతో నడుమునొప్పి, మెడనొప్పి లాంటి సమస్యలతో చాలామంది సతమతం అవుతుంటారు. సమస్య తొలి దశలో ఉంటే నొప్పికి మందులు, ఫిజియోథెరపీ చికిత్సలు చేస్తుంటారు. ఎన్నిమందులు ఇచ్చినా అరిగిపోయిన డిస్కును బాగుచేయడం మాత్రం సాధ్యం కాదు. మందులూ, ఫిజియోథెరపీ ఉపశమనం కలిగిస్తాయే గానీ డిస్కు అరుగుదలను రివర్స్ చేయలేవు. మహాఅయితే అరుగుదల వేగం తగ్గించి కొంత ఆలస్యం అయ్యేట్టు చేయొచ్చు. డిస్కు పూర్తిగా అరిగిపోయి సమస్య జటిలం అయినప్పుడు అరిగిన డిస్కును తీసేసి ఆపరేషన్ ద్వారా కొత్త డిస్కును అమరుస్తున్నారు.

ఏమిటీ డిస్కులు?

వెన్నుపాములో ఉండే ఎముకల మధ్య మృదువైన నిర్మాణాలనే డిస్కులు అంటారు. ఇవి ఎముకలు ఒకదానికొకటి రాసుకోకుండా షాక్ అబ్‌సార్బర్‌గా పనిచేస్తాయి. ఎముకలకు దన్నుగా ఉంటాయి. ఇవి అరిగిపోయినప్పుడు రెండు ఎముకలు ఒరుసుకుపోయి, నొప్పి మొదలవుతుంది. మెడ దగ్గరలో ఉండే డిస్కులు అరిగితే వెన్నునొప్పి, నడుము దగ్గర్లోవి అరిగితే నడుమునొప్పి బాధిస్తాయి. వయసు పెరుగుతున్నకొద్దీ ఇలా డిస్కులు అరిగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

అరిగిన డిస్కు మళ్లీ నార్మల్ అయితే?

డిస్కు అరుగుదలను ఆపేసి మళ్లీ ఎప్పటిలా సాధారణ స్థితికి తీసుకురావచ్చా అనే కోణంలో డాక్టర్ సుబ్బయ్య పరిశోధన సాగింది. ఈ డిస్కు అరుగుదలకు 26 జన్యువులు కారణమవుతున్నాయని ఇదివరకే గుర్తించారు. ఈ జన్యువులు అవసరమైన దానికన్నా ఎక్కువగా పనిచేయడం వల్లనే ఇలా డిస్కులు అరిగిపోతున్నాయని తెలుసుకున్నారు. కాబట్టి ఈ జన్యువులు పనిచేయకుండా ఆపివేయగలిగితే అరుగుదలను కూడా నియంత్రించవచ్చని నిరూపించారు.

ఇదీ అధ్యయనం

ఈ పరిశోధనలో భాగంగా ముందుగా డిస్కు అరుగుదలకు కారణమవుతున్న 26 జన్యువుల్లో కీలకమైన కాస్పేస్ 3 (caspase III), మెటాలోప్రొటియేజ్ 5 (metaloprotease V) అనే రెండు జన్యువులను అధ్యయనం కోసం ఎంచుకున్నారు. వీటిని బ్లాక్ చేయడం కోసం ఎస్ఐ ఆర్ఎన్ఏ (si RNA) అనే టెక్నాలజీని ఉపయోగించారు. ఈ టెక్నాలజీ ద్వారా ఏ జన్యువు పని బ్లాక్ చేయదలచుకుంటే దానికి అనుగుణమైన ఎస్ఐ ఆర్ఎన్ఏను తయారు చేయవచ్చు. ఎస్ఐ ఆర్ఎన్ఏ అంటే స్మాల్ ఇంటర్‌ఫెరింగ్ ఆర్ఎన్ఏ. దీన్ని 2006లో కనుగొన్నారు. ఈ ఎస్ఐ ఆర్ఎన్ఏ టెక్నాలజీ ద్వారా ఎంచుకున్న రెండు జన్యువులను బ్లాక్ చేయగల ఎస్ఐ ఆర్ఎన్ఏను రూపొందించారు. వీటిని జన్యు చికిత్స (జీన్ థెరపీ) ద్వారా డిస్క్‌లోకి పంపించారు. ఈ అధ్యయనాన్ని ముందుగా ఇన్‌విట్రో పద్ధతిలో ప్రయోగశాలలో కణాల్లోకి పంపించి చేశారు. ఇన్‌విట్రోలో అది సత్ఫలితాలనిచ్చింది. ఆ తరువాత కుందేలులో కూడా నడుము భాగంలోని డిస్కులో కృత్రిమ అరుగుదలను సృష్టించి, దానికి జీన్ థెరపీ ద్వారా ఎస్ఐ ఆర్ఎన్ఏను ఇచ్చారు. ఫలితాలు అద్భుతంగా వచ్చాయి! ఎంఆర్ఐ స్కాన్ చేస్తే 90 శాతం కన్నా ఎక్కువ డిస్కు సాధారణ స్థితికి వచ్చింది.

సాధారణంగా ఎస్ఐ ఆర్ఎన్ఏ మూడునాలుగు రోజులు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత డీగ్రేడ్ అయిపోతుంది. కానీ దాని ప్రభావం మాత్రం అలాగే ఉంటుంది. కుందేలులో ఒకసారి నార్మల్ అయిన డిస్కును ఆరువారాల తరువాత చూసినా అరిగిపోకుండా అలాగే ఉంది. కాబట్టి తరువాత మళ్లీ డిస్కు అరిగిపోయే అవకాశం లేదు. కాని ఎందుకైనా మంచిదని ఎస్‌హెచ్ ఆర్ఎన్ఏ అనే టెక్నాలజీని కూడా పరీక్షిస్తున్నాం. ఇది మార్పు చెందే జన్యువుల్ని శాశ్వతంగా బ్లాక్ చేస్తుంది.

నాలుగేళ్లలో అందుబాటులోకి...

ఇప్పుడు ఈ అధ్యయనాన్ని పెద్ద జంతువుల్లో కూడా చేయాలి. అంటే కుక్కలు, పందులు, కోతుల్లో చేయాల్సి ఉంది. ఆ తరువాత క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా మనుషుల్లో పైలట్ అధ్యయనం చేయాలి. కొద్దిమంది పేషెంట్లకు జన్యుచికిత్స ఇచ్చి డిస్కు రివర్స్ అవుతుందేమో గమనించాల్సి ఉంటుంది. ఈ అధ్యయనానికి దాదాపు మూడేండ్ల కాలం పట్టింది. 2015లో మొదలైన ఈ అధ్యయనం 2017 జూన్‌కల్లా పూర్తయిందని చెప్పారు పరిశోధన సారథి డాక్టర్ జీపీవీ సుబ్బయ్య. ఈ అధ్యయనాన్ని పెద్ద జంతువుల్లో (అంటే కుక్క, పంది, కోతి వంటివి) ఆ తరువాత హ్యూమన్ ట్రయల్స్ కోసం ప్రభుత్వం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఆ తరువాత మిగతా అధ్యయనాలు కూడా పూర్తయితే డిస్క్ అరుగుదలకు జన్యు థెరపీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. ఇందుకు సుమారుగా నాలుగైదేండ్లు పట్టొచ్చంటున్నారు డాక్టర్ సుబ్బయ్య.



జన్యువుతో చేసే ఈ చికిత్స ఇక శాశ్వతంగా మెడ, వెన్ను, నడుము నొప్పులను దూరం చేయనుందంటున్నారు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ జీపీవీ సుబ్బయ్య. డిస్కు సమస్యకు శాశ్వతమైన చికిత్సను ఇటీవలే ఆయన కనుగొన్నారు. ఇందుకుగాను అసోసియేషన్ ఆఫ్ స్పైన్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఎస్ఐ) ప్రతి ఏటా అందించే బెస్ట్ రీసెర్చ్ వర్క్ అవార్డును కూడా అందుకున్నారు. పూర్తిగా తన సొంత డబ్బుతో, సన్‌షైన్ హాస్పిటల్స్ ల్యాబ్ సౌజన్యంతో ఈ పరిశోధన పూర్తిచేశానని అన్నారాయన. ఈ పరిశోధన ఫలితాలు ప్రముఖ అంతర్జాతీయ పత్రిక నేచర్‌లో కూడా ప్రచురితం కానున్నాయని చెప్పారు. ప్రభుత్వాలు సహాయం చేస్తే తాను మరిన్ని పరిశోధనలు చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్తున్నారాయన.

- రచన ముడుంబై

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
ఆదివారం 25 ఫిబ్రవరి 2018

ప్రణయం నుంచి పరిణయం వైపు..

ప్రేమ పరిపూర్ణమైనప్పుడు అది పెళ్లి అనే గమ్యం వైపు పయనిస్తుంది. ప్రణయం పరిణయంతోనే సాఫల్యమవుతుంది. ఈ సత్యాన్ని తెలుసుకున్నారేమో..మన కథానాయికలు కొందరు తమ ప్రేమబంధాన్ని పెళ్లిపీటలెక్కించేందుకు తాపత్రయపడుతున్నారు. మనసు మెచ్చిన చెలికాడితో ఏడడుగులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. వీరిలో కొందరు తమ ప్రేమ వ్యవహారం గురించి బాహాటంగా స్పందిస్తుంటే మరికొందరేమో గోప్యత పాటిస్తూ వివాహానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో కొందరు నాయికల పెళ్లి వార్తలు ఇటు ప్రేక్షకులతో పాటు అటు పరిశ్రమ వర్గాల్లో కూడా హాట్‌టాపిక్‌గా మారాయి..



అమీజాక్సన్
ఇలియానా

రణవీర్‌సింగ్ -దీపికాపదుకునే

ప్రస్తుతం బాలీవుడ్‌లో వీరిద్దరిని సీనియర్ ప్రేమజంటగా అభివర్ణించవొచ్చు. 'రామ్‌లీలా' (2013) చిత్రంలో తొలిసారిగా ఈ జంట వెండితెరపై మెరిసింది. అప్పుడు చిగురించిన ప్రేమ నిరాటంకంగా కొనసాగుతున్నది. వ్యక్తిగత జీవితంలో అనేక సందర్భాల్లో ఈ ప్రేమజంట మీడియా కెమెరాలకు చిక్కారు. కొంత కాలం క్రితం ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయనే వార్తలొచ్చాయి. అయితే వారి సన్నిహితులు వాటిని ఖండించారు. రణవీర్‌సింగ్‌తో తన సాన్నిహిత్యం గురించి ఎప్పుడూ పెదవి విప్పని దీపికాపదుకునే ఇటీవల ఓ మాస పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ప్రేమ గురించి వెల్లడించింది. రణవీర్ పక్కనుంటే ప్రపంచాన్నే మరచిపోతానని, అతనొక అద్భుతమంటూ కొనియాడింది. దీంతో వీరి అనుబంధం తాలూకు సుదీర్ఘ సస్పెన్స్‌కు తెరదించినట్లైంది. ఇదిలావుండగా జనవరిలో మాల్దీవులలో దీపికాపదుకునే తన జన్మదినోత్సవాన్ని జరుపుకుంది.

ఈ వేడుకకు రణవీర్ కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారని ముంబై మీడియాలో వార్తలొచ్చాయి. అక్కడే ఇరు కుటుంబాల మధ్య పెళ్లి ప్రస్తావవ వచ్చిందని, ఈ ఏడాదిలో పెళికి ఈ జంట గ్రీన్‌సిగ్నలిచ్చిందని చెబుతున్నారు.

ఇలియానా-ఆండ్రూనిబోన్

మీడియాలో పుకార్లకు ఆస్కారం లేకుండా తన ప్రేమ వ్యవహారం గురించి ఇటీవలే అన్యాపదేశంగా స్పష్టతనిచ్చింది గోవా భామ ఇలియానా. ఆస్ట్రేలియన్ ఫొటోగ్రాఫర్ ఆండ్రూ నిబోన్‌తో ఈ అమ్మడు గత మూడేళ్లుగా ప్రేమలో వుంది. ముంబై రెస్టారెంట్లలో ఖాళీ సమయాన్ని ఆస్వాదిస్తూ ఈ జంట ఎన్నో సందర్భాల్లో మీడియా కంటబడ్డారు. ఆండ్రూ నిబోన్‌తో తాను కలిసి ఉన్న ఫొటోల్ని ఇలియానా సోషల్‌మీడియాలో తరచుగా పోస్ట్ చేస్తూ ఉంటుంది. అయితే తన ప్రేమ వ్యవహారం గురించి ఇలియానా ఎప్పుడూ బాహాటంగా స్పందించలేదు. సోషల్‌మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ ఫొటోల ద్వారా వీరిద్దరి ఎఫైర్ అందరికి తెలిసిపోయింది. గత ఏడాది డిసెంబర్‌లో తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఇలియానా పోస్ట్ చేసిన ఫొటో ఒకటి ఆమె పెళ్లి గురించి అనుమానాల్ని రేకెత్తించింది. 'ఏ ఫ్యామిలీ ఫొటో బై హబ్బీ' (భర్త తీసిన ఫొటో ఇది)' అనే క్యాప్షన్‌తో పెట్టిన క్రిస్‌మస్ ట్రీ ఫొటో చూసి అభిమానులు ఆశ్చర్యపోయారు. ఇలియానా రహస్యంగా పెళ్లి చేసుకుంది కాబట్టే ఆ విధంగా క్యాప్షన్ పెట్టిందని చర్చించుకున్నారు. అయితే తన పెళ్లి గురించి ఇలియానా ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పెళ్లి గురించి అడగ్గా..'క్రిస్‌మస్ రోజు ఇన్‌స్టాగ్రామ్‌లో నేను పెట్టిన ఫొటో క్యాప్షన్‌ను మీరు ఎలా అయినా అన్వయించుకోవచ్చు' అంటూ సమాధానాన్ని దాటవేసింది. దీంతో ఆమె పెళ్లి గురించిన సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది.

శృతిహాసన్-మైఖేల్ కోర్సెల్

కమల్‌హాసన్ ముద్దుల తనయ శృతిహాసన్ ప్రేమ వ్యవహారం గత కొంతకాలంగా దక్షిణాది చిత్రసీమలో హాట్‌టాపిక్‌గా మారింది. లండన్‌కు చెందిన పాపులర్ థియేటర్ ఆర్టిస్టు మైఖేల్ కోర్సెల్‌తో ఈ భామ ప్రేమాయణాన్ని సాగిస్తున్నది. ముంబయి విమానాశ్రమంలో తొలిసారిగా ఈ జంట మీడియా వారికి కనబడ్డారు. ఆ తర్వాత అనేక సందర్భాల్లో వీరిద్దరూ కలిసి కనిపించారు. ఇటీవల చెన్నైలో జరిగిన ఓ వివాహ వేడుకకు ప్రియుడు మైఖేల్ కోర్సెల్‌ను వెంటతీసుకొచ్చింది శృతిహాసన్. తమిళ సంప్రదాయ దుస్తుల్లో మైఖేల్ కోర్సల్ అందరి దృష్టిని ఆకట్టుకున్నాడు. ఈ వేడుకకు కమల్‌హాసన్ కూడా హాజరయ్యారు. ఈ ముగ్గురూ కలిసి మాట్లాడుకుంటున్న ఫొటోలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేశాయి. తన ప్రేమ వ్యవహారం, పెళ్లి గురించి శృతిహాసన్ తన తండ్రితో చర్చించిందని..ఆయన అంగీకారంతోనే వివాహ వేడుకకు మైఖేల్‌ను తీసుకొచ్చిందని చెన్నై సినీ వర్గాల్లో గుసగుసలు వినిపించాయి. ఈ ప్రేమ జంట పెళ్లికి ఇరు కుటుంబ సభ్యులు సుముఖంగా ఉన్నారని, ఈ ఏడాదిలోనే వివాహ ముహూర్తం నిశ్చయిస్తారని అంటున్నారు.

అమీజాక్సన్-జార్జి

శ్వేతసుందరి అమీజాక్సన్ ప్రేమాయణం, పెళ్లికి సంబంధించిన వార్తలు బాలీవుడ్ సర్కిల్స్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఇంగ్లాండ్‌కు చెందిన ప్రముఖ స్థిరాస్థి వ్యాపారి జార్జితో ఈ సుందరి గత కొంతకాలంగా లవ్ ఎఫైర్‌ను కొనసాగిస్తున్నది. ఈ విషయాన్ని ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వెల్లడించింది సుందరి. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రియుడితో కలిసి ఉన్న కొన్ని ఫొటోల్ని కూడా పోస్ట్ చేసింది. 'అమీజాక్సన్ గత కొన్నేళ్లుగా జార్జితో ప్రేమలో ఉంది. వారిద్దరు గత ఏడాదే పెళ్లి చేసుకోవాలనుకున్నారు. వరుస సినిమాలతో బిజీగా వుండటం వల్ల పెళ్లి ప్రయత్నాలు వాయిదా పడ్డాయి' అని ఆమె సన్నిహితులు వెల్లడించారు.

ఈ సంవత్సరాంతంలో ఈ ప్రేమజంట పెళ్లిపీటలెక్కడం ఖాయమని చెబుతున్నారు.


దీపికాపదుకునే

సోనమ్‌కపూర్-ఆనంద్ అహుజా

బాలీవుడ్‌లో చక్కటి ప్రతిభ కలిగిన నాయికల్లో సోనమ్‌కపూర్ ఒకరు. వినూత్న కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త ఆనంద్ ఆహూజాతో ఆమె కొంతకాలంగా ప్రేమలో ఉంది. విదేశాల్లోని బీచ్‌లో ఈ జంట షికార్లు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారాయి. ఇటీవలే ఈ జంట నిశ్చితార్థం జరుపుకున్నారనే వార్తలొచ్చాయి. వీటిపై సోనమ్‌కపూర్ స్పందిస్తూ 'నా చేతికి ఉన్న ఉంగరాన్ని చూసి మీరు నిశ్చితార్థం గురించిన ప్రశ్న అడుగుతున్నారు. ఈ విషయం గురించి మాట్లాడటం నాకు ఇష్టం లేదు. వివాహం గురించి మాత్రం అందరికి తెలియజేస్తాను' అని చెప్పింది. జూన్‌లో ఆమె పెళ్లికి సిద్ధమవుతున్నదని సమాచారం.

నయనతార-విఘ్నేష్‌శివన్

ప్రస్తుతం నయనతార తమిళ దర్శకుడు విఘ్నేష్‌శివన్‌తో ప్రేమలో వుంది. నయనతార నటించిన 'నానుమ్ రౌడీ థాన్' చిత్రానికి విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించాడు. ఆ సినిమా చిత్రీకరణ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ప్రస్తుతం ఈ జంట చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారు. విఘ్నేష్‌శివన్‌తో తీసుకున్న చాలా ఫొటోల్ని నయనతార తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఇటీవల ప్రేమికుల రోజును ఈ జంట విదేశాల్లో జరుపుకున్నారు. ఈ సందర్భంగా తీసుకున్న ఓ దృశ్యాన్ని విఘ్నేష్‌శివన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్‌మీడియాలో అందరిని ఆకర్షిస్తున్నాయి. అయితే నయనతార తన లవ్‌ఎఫైర్ గురించి బయట ఎప్పుడూ మాట్లాడలేదు. ఈ జంట వచ్చే ఏడాది పెళ్లిపీటలెక్కబోతున్నారని చెన్నై సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి.


నయనతార


నాని, శ్రీరామ్ ఆదిత్య

పాటలతో మొదలైంది

నాగార్జున, నానిల కలయికలో ఓ మల్టీస్టార్ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం శనివారం హైదరాబాద్‌లో పాటల రికార్డింగ్‌తో మొదలైంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'నాగార్జున, నానిల సరికొత్త కలయికలో ఓ ఆసక్తికరమైన కథతో చాలా భారీగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మా సంస్థలో వచ్చిన మల్టీస్టారర్ చిత్రాల తరహాలోనే ఈ సినిమా కూడా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముంది. మణిశర్మ సంగీత సారథ్యంలో పాటల రికార్డింగ్ ప్రారంభించాం. మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి స్క్రిప్ట్ అడ్వైజర్: సత్యానంద్, ఛాయాగ్రహణం: శ్యామ్‌దత్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, మాటలు: వెంకట్ డి.పట్టి, శ్రీరాం ఆర్. ఇరగం, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: టి.శ్రీరామ్ ఆదిత్య.


విజయ్ దేవరకొండ, శివానీసింగ్

ఏ మంత్రం వేసావే..!

'**అ**ర్జున్‌రెడ్డి' చిత్రంతో సంచలన విజయాన్ని సొంతం చేసుకున్నారు విజయ్ దేవరకొండ. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ఏ మంత్రం వేసావే'. గోలీసోడా ఫిలిమ్స్ పతాకంపై శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. శివానీ సింగ్ కథానాయికగా పరిచయవుతున్నారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత మల్కాపురం శివకుమార్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ 'గేమ్ నేపథ్యంలో సాగే విభిన్నమైన ప్రేమకథా చిత్రమిది. విజయ్ దేవరకొండ పాత్ర చిత్రణ భిన్నంగా వుంటుంది. నేటి యువతరానికి ప్రతినిధిగా ఆయన పాత్రచిత్రణ సాగుతుంది. ప్రేమికుల మనోభావాలకు దర్పణంలా వుంటూ ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా అందరిని మెప్పిస్తుంది. పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి చిత్రాల తరహాలోనే ఈ సినిమా కూడా విజయ్ దేవరకొండ కెరీర్‌లో మర్చిపోలేని సినిమాగా నిలిచిపోతుందనే నమ్మకముంది. విదేశాల్లో చిత్రీకరించిన సన్నివేశాలు చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయి. యువతరంతో పాటు అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి చిత్రాన్ని మార్చి 9న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. శివన్నారాయణ, రాజబాబు, నీలాక్షిసింగ్, ఆశిష్‌రాజ్, ప్రభావతి, దీపక్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అబ్బత్ సమత్, ఛాయాగ్రహణం: శివారెడ్డి.

'వాడేనా' గీతాలు


'వాడేనా' గీతావిష్కరణ దృశ్యం

శివ తాండేల్, నేహాదేశ్ పాండే జంటగా నటిస్తున్న 'వాడేనా' చిత్ర గీతాలు ఇటీవల హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. సాయి సునీల్ నిమ్మల దర్శకుడు. మణిలాల్ మచ్చి అండ్ సన్స్ నిర్మిస్తున్నారు. కిరణ్ వెన్న సంగీతం అందించిన ఈ చిత్ర ఆడియోను దర్శకుడు ఎన్.శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ 'ట్రైలర్, సాంగ్స్, నేపథ్య సంగీతం బాగున్నాయి. టైటిల్ కొత్తగా వుంటే సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతుంది. ఆసక్తిని రేకెత్తించే విధంగా టైటిల్ వుందని భావిస్తున్నాను' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'దర్శకుడు ఎన్.శంకర్‌ను చూసి స్ఫూర్తిపొందాను. రాజ్‌కందుకూరి నిర్మించిన 'పెళ్లి చూపులు' సినిమా చూసి ఎంతో నేర్చుకున్నాను. ఇందులో నాలుగు పాటలు రాసి కొరియోగ్రఫీ చేశాను' అన్నారు.

బంద్‌కు సంపూర్ణ మద్దతు!


ఆర్.కె.గౌడ్, సాయివెంకట్

దక్షిణాది నిర్మాతలకు, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు మధ్య బెంగళూరులో జరిగిన చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్‌కు నిర్మాతలు పిలుపునిచ్చారు. దీనికి తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'గత పదేళ్లుగా డిజిటల్ వ్యవస్థపై మేము పోరాటం చేస్తున్నాం. తాజాగా దక్షిణాది పరిశ్రమ అంతా కలిసి పోరాటం చేయాలని నిర్ణయించుకోవడం శుభపరిణామం. అత్యధిక డిజిటల్ రేట్ల వల్ల ఎన్నో చిత్రాలు విడుదలకు నోచుకోవడం లేదు. క్యూబ్, యుఎఫ్‌ఓ, పీఎక్స్‌డీ సంస్థలతో ఒప్పందం రద్దు చేసుకుంటే తక్కువ రేట్లకే డిజిటల్ సర్వీస్ ప్రొవైడ్ చేస్తామంటూ అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. పరిశ్రమ బంద్‌కు మా పూర్తి మద్దతునిస్తున్నాం' అన్నారు. బంద్‌కు సహకరించాలని టీఎఫ్‌సీసీ సెక్రటరీ సాయివెంకట్ కోరారు.

నమస్తే హైదరాబాద్


సంపత్‌కుమారస్వామి, నిర్మల, ప్రదీప్‌చంద్ర,మనోహర్

మనోహర్ చిమ్మని దర్శకత్వంలో తెరకెక్కనున్న పక్కా తెలంగాణ సినిమా 'నమస్తే హైదరాబాద్'. పి.సి. క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్నది. ప్రదీప్‌చంద్ర సంగీత దర్శకుడు. నూతన నటీనటులు, సీనియర్ సహనటులు నటించనున్న ఈ చిత్రం త్వరలో సెట్స్‌పైకి రానుంది. కాగా ఈ చిత్రంతో నూతన గాయనీ కాయకులను పరిచయం చేయాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమారస్వామి చిలగాని, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నిర్మల సంయుక్తంగా నూతన గాయకుల ఆడిషన్‌ను ప్రారంభించారు. మనోహర్ చిమ్మని మాట్లాడుతూ 'తెలంగాణ ఆవిర్భావం తరువాత తెలంగాణ దర్శకుడిగా నేను రూపొందిస్తున్న పూర్తిస్థాయి తెలంగాణ చిత్రమిది. అంతర్లీనంగా మంచి సందేశం వుంటుంది. హైదరాబాద్ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది' అన్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

- ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లుపూర్తి
- ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి అశోక్ వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష హాల్లోకి అనుమతించేది లేదని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్ తెలిపారు. ప్రశ్నాపత్రం బుక్‌లెట్‌ను సీసీ కెమెరాల ఆధ్వర్యంలో విడుదలచేస్తామని, ప్రతిరోజూ ఉదయం 8.45 గంటలకు విద్యార్థుల చేతికిస్తామని చెప్పారు. ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు శనివారం బోర్డు కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 9,63,546 మంది విద్యార్థులు హాజరవుతారని.. 1,294 పరీక్ష కేంద్రాలను, 50 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 200 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామని తెలిపారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు ఎవరికీ మొబైల్‌ఫోన్లు తెచ్చుకొనేందుకు అనుమతించడం లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మొబైల్‌ఫోన్లు పనిచేస్తున్నా.. ఆ ఫోన్ల నుంచి మాట్లాడుతున్నవారి ఫోన్లను బ్లాక్‌చేయడం కోసం జీపీఆర్‌ఎస్ విధానాన్ని అమలు పరుస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్నట్టు నిర్ధారణ అయితే, వారిపై సెక్షన్ 25 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేయడం కోసం ఇంటర్‌బోర్డు కార్యాలయంలో 24 గంటలు పనిచేసేవిధంగా కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేశామని, 040-24655027 నంబర్‌కు ఫోన్‌చేయాల్సి ఉంటుందని సూచించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను ఈ నెల 26 నుంచి https://admi.tsbie. cgg.gov.in https://tsbie. cgg.gov.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. రకరకాల కారణాలతో విద్యార్థుల హాల్‌టిక్కెట్లను నిలిపివేసిన యాజమాన్యాలను గుర్తించి వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేవునిగుట్ట శిల్పసంపద అద్భుతం

జర్మన్ ఆర్కియాలజిస్ట్ కొరీనా వెసల్స్ ప్రశంస ● 6-7 శతాబ్దానికి చెందినవిగా నిర్ధారణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ / ములుగు రూరల్: దేవునిగుట్ట పురాతన కట్టడాలపై అంతర్జాతీయ పరిశోధనల పరంపర మొదలైంది. ఈ కట్టడాన్ని ప్రపంచ శిల్ప చరిత్రలోనే విశిష్టమైన నిర్మాణంగా, శిల్పకళా చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోతుందని తాజాగా జర్మనీకి చెందిన ప్రఖ్యాత పురావస్తు పరిశోధకురాలు, చరిత్రకారిణి కొరీనా వెసల్స్ అభివర్ణించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం కొత్తూరు సమీపంలోని గుట్టపై గల పురాతన ఆలయ కట్టడాలను ఆమెతోపాటు మరికొందరు పురావస్తు పరిశోధకులు శనివారం సందర్శించారు. దక్షిణాసియా ప్రాచీన చిత్ర, శిల్పరీతులపై పరిశోధన చేసిన ఆమె తెలంగాణలో తాజాగా వెలుగులోకి వచ్చిన దేవునిగుట్ట ప్రాచీన ఆలయం గురించి తెలుసుకుని ఇక్కడకొచ్చారు. వివిధ శిలలను కలిపి ఒకే శిల్పంగా చెక్కి నిలిపిన అంగ్‌కోర్‌వాట్ దేవాలయం కంటే ముందే తెలంగాణలో అటువంటి నిర్మాణాలు జరిగినట్టు దేవునిగుట్ట ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ ఆలయాన్ని ఇప్పటికే పలువురు చరిత్ర పరిశోధకులు పరిశీలించారు. కొరీనా గతంలోనూ భారత్‌ను సందర్శించారు. దేవునిగుట్టలోని శిల్పాలు, శైలిని పరిశీలించిన అనంతరం అది క్రీ.శ. 6, 7 శతాబ్దాలకు చెందిన కట్టడంగా ఆమె నిర్ధారించారు. ఇలాంటి ఆలయాన్ని తాను ఎక్కడా చూడలేదని పేర్కొన్నారు. గుడిచుట్టూ, బయటిగోడల మీద మూడు అడ్డ వరుసల్లో ఆరారు ఫ్రేమ్‌లలో శిల్పాలున్నాయన్నారు. శిల్పాల మీద లేత ఎరుపు రంగు సున్నం పూసి తీర్చిదిద్దిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, వీటిలో శైవ, వైష్ణవ శిల్పాల కలబోత కనిపిస్తున్నదని తెలిపారు. ఆలయం వెనుకభాగంలో అర్ధనారీశ్వరశిల్పం ఉన్నదని, దీనిలో శివపార్వతుల అర్ధభాగాలు, చేతుల కింద గణపతి, స్కంధుల శిల్పాలున్నాయని చెప్పారు. ఈ ఆలయాన్ని త్వరగా పునరుద్ధరించాల్సిన అవసరముందని పురావస్తు అధికారులకు సూచించారు. వెసల్స్, ఆమె వెంట వచ్చిన అధికారులు గుడిపై డాక్యుమెంటరీ తయారీకి డ్రోన్‌కెమెరా, ఇతర కెమెరాల్లో చిత్రాలను బంధించారు. దేవుని గుట్ట వివరాలను ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు అరవింద్ ఆర్య ఫేస్‌బుక్‌లో పోస్టు చేయగా దానిని చూసిన కొరీనా వెసల్స్ ఆలయ సందర్శనకు వచ్చారు. ఆమె వెంట ఆర్కిటెక్చర్ ప్రొఫెసర్ గంగాదేవి, రాష్ట్ర పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, చరిత్ర పరిశోధకుడు అరవింద్ ఆర్య, మణిపాల్ యూనివర్సిటీకి చెందిన కైలాష్ ఉన్నారు. పరిశోధక బృందం మరో రెండురోజులపాటు ఈ ఆలయ నిర్మాణాన్ని పరిశీలిస్తుంది.



జయశంకర్ భూపాలపల్లి జిలా కొత్తూరులోని గుట్టపై ఉన్న ఆలయ వివరాలను పురావస్తు పరిశోధకురాలు కొరీనా వెసల్స్‌కు తెలియజేస్తున్న పురావస్తు శాఖ అధికారి అరవింద్ ఆర్య

రచయిత మునిపల్లె రాజు కన్నుమూత

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత..
- తెలుగులో మ్యాజికల్ రియలిజం ధోరణితో ప్రసిద్ధి



మునిపల్లె రాజు (ఫైలు)

కాప్రా: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మునిపల్లె రాజు (92) శనివారం హైదరాబాద్ సైనిక్‌పురిలోని స్వగృహంలో మృతిచెందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తెలుగుకథను సుసంపన్నం చేసిన రాజు పూర్తి పేరు మునిపల్లె బక్కరాజు. 1925లో గుంటూరు జిల్లాలో జన్మించిన రాజు కళలు, సాహిత్య విభాగంలో 2006లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. జ్యేష్ఠ లిటరసీ అవార్డు, శాస్త్రి మెమోరియల్ అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, గోపీచంద్ అవార్డు, ఆంధ్ర సారస్వత సమితి అవార్డులను అందుకున్నారు. 'అస్తిత్వనదం ఆవలితీరాన' లఘుకథల సంకలనానికిగాను 2006లో సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. మునిపల్లెరాజు నవల 'పూజారి' ఆధారంగా బీఎన్‌రెడ్డి 'పూజాఫలం' చిత్రం తీశారు. భారత రక్షణశాఖలో 1943 నుంచి 1983 వరకు ఆయన సర్వేయరుగా ఉద్యోగం చేశారు. ఉద్యోగరీత్యా దేశమంతటా తిరుగడం, సునిశిత పరిశీలన కారణంగా ఆయన అద్భుతమైన సాహిత్యాన్ని సృజించి తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. తెలుగులో మ్యాజికల్ రియలిజం ధోరణితో ప్రసిద్ధిపొందారు. దివోస్వప్నాలతో ముఖాముఖీ, పుష్పాలూ-ప్రేమికులూ-పశువులు, మునిపల్లె రాజు కథలు అనేవి ఆయన ఇతర కథాసంకలనాలు. అలసిపోయినవాడి అరణ్యకాలు, వేరొక ఆకాశం-వేరెన్నో నక్షత్రాలు అనే కవితా సంపుటులను కూడా ఆయన వెలువరించారు. రచయితలు, కవుల మీద ఆయన రాసిన వ్యాసాలు.. జర్నలిజంలో సృజనరాగాలు, సాహితీ మంత్రనగరిలో సుస్వరాలు అనే పేరిట పుస్తకాలుగా వచ్చాయి. రాజు అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

అద్భుతాలకు అరుదైన గౌరవం

- తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు హడ్కో డిజైన్ అవార్డు
- ఏప్రిల్ చివరివారంలో ఢిల్లీలో ప్రదానం
- టీఎస్‌కాప్ మొబైల్ యాప్‌కు ఎన్సీఆర్బీ ఉత్తమ ఐటీ ప్రాజెక్టు పురస్కారం
- ఈ నెల 28న చెన్నైలో అందజేత
- ఇండోర్‌లో టెక్నాలజీ సభ అవార్డు అందుకున్న ఈ-గవర్నెన్స్ జాయింట్ సెక్రటరీ







హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వివిధ విభాగాల్లో అత్యుత్తమ సాంకేతికత వినియోగం, మెరుగైన పనితీరు కనబరుస్తున్న తెలంగాణ సర్కారును ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు వరిస్తూనే ఉన్నాయి. శనివారం హౌసింగ్ కార్పొరేషన్ హడ్కో డిజైన్ అవార్డు-2017కు ఎంపిక కాగా, తెలంగాణ పోలీస్‌శాఖ కేంద్రహోంశాఖ నుంచి అవార్డు దక్కించుకున్నది. తెలంగాణ మీసేవ టెక్నాలజీ సభ అవార్డును సొంతం చేసుకున్నది.తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ప్రతిష్ఠాత్మకమైన హడ్కో డిజైన్ అవార్డు-2017కు ఎంపికైంది. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో మెరుగైన పనితీరును కనబర్చినందుకు కార్పొరేషన్‌ను ఈ అవార్డు కోసం ఎంపికచేసినట్టు శనివారం హడ్కో ప్రకటించింది. ప్రభుత్వ ఖర్చుతో పట్టణ, గ్రామీణ పేదల కోసం సృజనాత్మకత, విపత్తులను ఎదుర్కొనేలా పటిష్ఠమైన డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి ఇస్తున్నందుకు అరుదైన పురస్కారాన్ని దక్కించుకున్నది. వచ్చే ఏప్రిల్ చివరివారంలో హడ్కో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమంలో తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అవార్డును అందజేయనున్నట్టు హడ్కో తెలిపింది. సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట, ఖమ్మం, సూర్యాపేటలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లను హడ్కో బృందం ఇటీవల పరిశీలించింది. నిర్మాణాల్లో మెరుగైన పనితీరు కనబర్చారని గుర్తించి అవార్డుకు ఎంపిక చేసింది. హడ్కో అవార్డు ప్రకటించడంపై గృహ నిర్మాణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి.. అధికారులకు అభినందనలు తెలిపారు.

పోలీస్‌శాఖకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం

సాంకేతికత వినియోగంలో దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉన్న తెలంగాణ పోలీస్‌శాఖకు మరో ప్రతిష్ఠాత్మకమైన అవార్డు దక్కింది. రాష్ట్ర పోలీసులు తీసుకొచ్చిన టీఎస్‌కాప్ (రియల్ టైం పోలీసింగ్) ఐటీ ప్రాజెక్టుకు ఎన్సీఆర్బీ (నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో) ఉత్తమ ఐటీ ప్రాజెక్టు 'ఎంపవరింగ్ పోలీస్ విత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' అవార్డు దక్కింది. పోలీస్‌శాఖలో ఐటీ సేవల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 2015 నుంచి కేంద్రహోంశాఖ ఆధ్వర్యంలో ఎన్సీఆర్బీ ఈ అవార్డులను అందజేస్తుంది. ఐటీ వినియోగానికి సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుంచి నామినేషన్లు వెళ్లాయి. ఎన్సీఆర్బీ, ఎన్టీఆర్వో (నేషనల్ టెక్నికల్ రిసెర్చ్ ఆర్గనైజేషన్)లోని ఉన్నతాధికారుల కమిటీ పలుదఫాల్లో వడబోత తర్వాత టీఎస్‌కాప్ (రియల్ టైం పోలీసింగ్) ఐటీ ప్రాజెక్టుకు శనివారం ఈ అవార్డును కేటాయించింది. దీన్ని ఈ నెల 28న తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించనున్న ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. టీఎస్‌కాప్‌కు జాతీయస్థాయిలో గుర్తింపురావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఈ అవార్డుతో తమ బాధ్యత మరింత పెరిగిందని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి చెప్పారు.

తెలంగాణ మీసేవకు టెక్నాలజీ సభ అవార్డు ప్రదానం

తెలంగాణ మీసేవ టెక్నాలజీ సభ అవార్డును సొంతం చేసుకున్నది. ప్రత్యేకమైన టెక్నాలజీని ఆచరణలో పెడుతూ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చే సంస్థలకు ఎక్స్‌ప్రెస్ కంప్యూటర్స్ టీం సంస్థ ఈ అవార్డును అందజేస్తుంది. బిగ్ డేటా, అనలిటిక్స్ క్యాటగిరీలో తెలంగాణ మీసేవ ఎంపికైంది. శనివారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ గవర్నెన్స్ జాయింట్ సెక్రటరీ పెండ్యాల శ్రీనివాస్ ఈ అవార్డును అందుకున్నారు.

హడ్కో అవార్డే నిదర్శనం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్లకు హడ్కో డిజైన్ అవార్డు రావడంతో మా కృషికి సరైన గుర్తింపు లభించింది. నిరుపేదలు కూడా ఆత్మగౌరవంతో బతుకాలనే సదుద్దేశంతో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకానికి రూపకల్పన చేశారు. దీనికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తున్నదనడానికి హడ్కో అవార్డే నిదర్శనం. ప్రజలనుంచి కూడా ఈ పథకానికి అనూహ్య స్పందన వస్తున్నది. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు వెళుతున్నది.

– ఇంద్రకరణ్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ మంత్రి

24 గంటల విద్యుత్‌కు 50 రోజులు

జడ్చర్ల రూరల్: టీఆర్‌ఎస్ పాలన బాగున్నదని, రాష్ట్రంలో అభివృద్ధి బాగా జరుగుతున్నదని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చైర్మన్ చిత్తరంజన్‌దాస్ కొనియాడారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డబ్బు, కులంతోనే కాంగ్రెస్ పార్టీని శాసించాలనుకుంటే కుదరదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఇటీవల జరిగిన మూడు రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కోరినట్టు చెప్పారు. బడుగు, బలహీన వర్గాల వారు ఎప్పటికీ కండువాలు మోస్తూ.. డబ్బులు తీసుకుంటారనుకుంటే పొరపాటన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీల్లో గెలిచే అభ్యర్థులను ఎంపిక చేసి ఎన్నికలకు ఏడాది ముందే ప్రకటించాలన్నారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తే బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రధాన మంత్రి మోదీ వచ్చాక బీసీలకు తీరని అన్యాయం జరుగుతున్నదన్నారు.

రాజన్నను దర్శించుకున్న తేజ్‌దీప్‌కౌర్

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారిని శనివారం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) డీజీ తేజ్‌దీప్‌కౌర్ మీనన్ దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాజన్నకు ప్రీతికరమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఈవో దూస రాజేశ్వర్ ఆమెకు ప్రసాదాన్ని అందజేశారు.

తెలంగాణ అభివృద్ధికి తొలి గడప కాళేశ్వరం


సీఎం కేసీఆర్ మేధస్సుకు, మంత్రి హరీశ్‌రావు పనితీరుకు నిదర్శనమే ఈ ప్రాజెక్టు

మండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ • రెండోరోజు ప్రాజెక్టులను పరిశీలించిన ఎమ్మెల్సీలు

పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ/కాళేశ్వరం: తెలంగాణ అభివృద్ధికి తొలి కడప (గడప)గా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిలిచిపోతుందని శాసన మండలి చైర్మన్ కే స్వామిగౌడ్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనలో భాగంగా టీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు చెందిన ఎమ్మెల్సీల బృందం రెండోరోజైన శనివారం జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో పర్యటించింది. బృందం సభ్యులు భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలోని శ్రీముక్తేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నారం బ్యారేజీకి చేరుకున్నారు. ఆ తరువాత పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం వద్ద నిర్మిస్తున్న సుందిళ్ల బ్యారేజీని, మంథని మండలం కాసిపేట వద్ద నిర్మిస్తున్న అన్నారం పంప్‌హౌస్‌ను సందర్శించారు. అక్కడి నుంచి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలో చేపట్టిన 6వ ప్యాకేజీ పనుల అండర్ టన్నెల్, సర్జ్‌పూల్‌ను పరిశీలించారు. పెద్దపల్లి జిల్లా సుందిళ్ల బ్యారేజీ వద్ద మండలి చైర్మన్ స్వామిగౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. తొమ్మిది నెలల కాలంలోనే ఇంత భారీ నిర్మాణాలను చూస్తుంటే ఆశ్చర్యమేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ మేధస్సుకు, మంత్రి హరీశ్‌రావు పనితీరుకు నిదర్శనమే ఈ 'కాళేశ్వరం' ప్రాజెక్టు అని అభివర్ణించారు. పనులు పూర్తయిన తరువాత 'కాళేశ్వరం ప్రాజెక్ట్ చరిత్ర'పై పుస్తకాన్ని ప్రచురిస్తామని, నిర్మాణ సమయంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరి పేర్లు సువర్ణ అక్షరాలతో లిఖిస్తామని స్వామిగౌడ్ తెలిపారు.

ఎవరూ చేయలేనిది సీఎం కేసీఆర్ చేస్తున్నారు: మహమూద్ అలీ

సమైక్య రాష్ట్రంలో ఎవరూ చేయలేని పనిని సీఎం కేసీఆర్ చేసి చూపిస్తున్నారని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చాలని ఉద్యమ సమయంలోనే నిర్ణయానికి వచ్చారని, స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ ఆ దిశగా పయనిస్తున్నారని తెలిపారు.



పెద్దపల్లి జిల్లా నంది మేడారం అండర్ టన్నెల్‌లో సర్జ్‌పూల్‌ను పరిశీలిస్తున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు

కాంగ్రెస్‌లో ఎప్పుడూ కుర్చీల కొట్లాటే

రైతులు, జనం బాధలు పట్టేది కాదు

- తుమ్మిళ్లపై ఏపీ ప్రభుత్వ కేసులు టీటీడీపీకి సమ్మతమేనా?
- నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల పర్యటనలో మంత్రి హరీశ్‌రావు



గద్వాల జిల్లా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం అప్రోచ్ కెనాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మంత్రులు జూపల్లి, లక్ష్మారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, మర్రి జనార్దన్‌రెడ్డి



శనివారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర వద్ద పాలమూరు లిఫ్ట్ ప్యాకేజీ పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడల్లా కుర్చీల కొట్లాట తప్ప మరోటి ఉండేది కాదని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గతంలో ముఖ్యమంత్రులను ఎక్కిస్తూ... దించుతూ కాలం గడిపిన కాంగ్రెస్ పార్టీకి రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. శనివారం ఆయన ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వీపనగండ్ల, పాన్‌గల్, రాజోళి మండలాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఎంజీకేఎల్‌ఐ పరిధిలో పెద్దమందడి బ్రాంచి కెనాల్ పనులను, రాజోలి మండలంలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పనులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిలతో కలిసి మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. అంతకుముందు పాన్‌గల్‌లో ఆధునిక మార్కెట్ గోడౌన్ ప్రారంభించి రైతులనుద్దేశించి హరీశ్‌రావు ప్రసంగించారు. కాంగ్రెస్ హయాంలో విజయభాస్కర్‌రెడ్డి సీఎంగా వచ్చి చెన్నారెడ్డిని దించితే... మళ్లీ నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వచ్చాడు. వైఎస్సార్ తర్వాత రోశయ్య వస్తే... మళ్లీ కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ప్రత్యక్షమయ్యాడంటూ కాంగ్రెస్ సంస్కృతిని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తానంటే.. దామోదర్‌రెడ్డి వద్దంటారని, రేవంత్‌రెడ్డి రాకను.. డీకే అరుణ వద్దనడంవంటి పరిణామాలను ప్రజలు గమనించాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందని చెప్పారు. ప్రజల కోసం టీఆర్‌ఎస్ ప్రభుత్వం గత మూడున్న రేండ్లుగా రాత్రింబవళ్లు పని చేస్తున్నదన్నారు. వివిధ సంక్షేమ కార్యక్రమాలతోపాటు వ్యవసాయరంగంలో నూతన విప్లవం తీసుకువస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కందులను కేవలం 50 వేల టన్నులు కొనుగోలు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం రెండున్నర లక్షల టన్నులను కొనుగోలు చేసిందన్నారు. కర్ణాటక, కర్నూల్ ప్రాంతాల నుంచి తెలంగాణలో కందుల విక్రయాలకు వస్తే, ఇక్కడి రైతులు ఏ మాత్రం సహకరించవద్దని మంత్రి కోరారు. ఉమ్మడి పాలమూరుకు కృష్ణానదిలో నికర జలాలను కేటాయించాలని సీఎం కేసీఆర్ దృఢనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. ఇందుకు కృష్ణానది నీటివాటాపై బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ అభిప్రాయం వెలువడిన తర్వాత రాష్ట్ర వాటా పెరుగుతుందని, ఇందులో తప్పనిసరి పాలమూరుకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు చెప్పారు. వరద జలాలపై ఆధారపడ్డ ఎంజీకేఎల్‌ఐ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు నికర జలాలు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరులో 20 లక్షల ఎకరాలకు సాగునీటిపారుదల ఉండాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను ఈ మూడేండ్లలో రన్నింగ్ ప్రాజెక్టులుగా చేసి 6.50 లక్షల ఎకరాలకు సాగునీరందించినట్టు వివరించారు. 2018లోనే మొత్తం 10 లక్షల ఎకరాలకు సాగునీరందించి తీరుతామన్నారు.

'తుమ్మిళ్ల'పై కేసులు.. టీటీడీపీకి సమ్మతమేనా..?

తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంపై ఏపీ ప్రభుత్వం ఢిల్లీలో కేసులు వేస్తుండటాన్ని తెలంగాణ టీడీపీ నాయకులు సమ్మతిస్తున్నారా..?' అంటూ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. 60 ఏండ్లపాటు సమైక్య పాలనలో తీవ్రంగా నష్టపోయిన నడిగడ్డ రైతుకోసం టీఆర్‌ఎస్ ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతలను చేపట్టగా, ఏపీలోని టీడీపీ ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నదన్నారు. దీనిపై టీటీడీపీ నాయకులు ఆలోచించాలని, ప్రధానంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని టీడీపీ నాయకులు ఆ పార్టీకి వెంటనే రాజీనామా చేయాలన్నారు. శనివారం సాయంత్రం రాజోళి మండలం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం క్యాంపు కార్యాలయంలో మంత్రి హరీశ్‌రావు అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం తుమ్మిళ్ల ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, వచ్చే వానకాలంలోనే నడిగడ్డకు సాగునీరందించాల్సి ఉన్నదన్నారు. ఇప్పటికే సగం వరకు పనులు పూర్తి కావాల్సి ఉందని, పనులు వేగంగా జరుగడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ బండారు బాస్కర్, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, గువ్వల బాలరాజు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వచ్చే నెలాఖరుకు గోదావరి జలాలు

సాంకేతిక విద్యకు పెద్దపీట.. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



వరంగల్ రూరల్ జిల్లా సింగరాజుపల్లి వద్ద ఫిల్టర్‌బెడ్, పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం కడియం

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ప్రతి ఇంటికి శుద్ధజలాలను అందించాలనే సంకల్పంతో రూ.42 వేల కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా మార్చి 31 నాటికి వరంగల్ ఉమ్మడి జిల్లాలోని అన్ని ఆవాస ప్రాంతాలకు గోదావరి జలాలను అందిస్తామని, అక్కడి నుంచి ఓహెచ్‌ఎస్‌ఆర్ ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తామని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. శనివారం వరంగల్ రూరల్ జిల్లాలోని సింగరాజుపల్లి వద్ద ఫిల్టర్‌బెడ్, పంపుహౌస్ పనులను పరిశీలించి ట్రయల్ రన్‌ను పర్యవేక్షించారు. అనంతరం పరకాలలో పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో రూ.6.90 లక్షలతో నిర్మించిన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటిని అందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ చేపట్టిన మిషన్ భగీరథ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుని దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు ఈ పథకంపై సమీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. స్వరాష్ట్రంలో సాంకేతిక విద్యకు పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 46 మాత్రమే పాలిటెక్నిక్ కళాశాలలు ఉంటే స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వాటిని 57కు పెంచుకున్నామన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఇంచార్జి కలెక్టర్ హరిత, మిషన్ భగీరథ అధికారులు, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



కేయూలో ఆందోళన విరమించాలని విద్యార్థులను కోరుతున్న పోలీసులు

కేయూలో విద్యార్థుల అరెస్టు

- పోలీసుల భారీ బందోబస్తు

నయీంనగర్(వరంగల్): విద్యార్థి సంఘాలపై దాడులకు నిరసనగా కాకతీయ యూనివర్సిటీలో శనివారం తలపెట్టిన బంద్‌ను పోలీసులు అడ్డుకున్నారు. పీహెచ్‌డీ ప్రవేశాలపై చేస్తున్న ఆందోళనలో భాగంగా తమపై ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉసిగొల్పి దాడి చేయించాడని నిరసిస్తూ ఇంజినీరింగ్ కళాశాల ఎదుట విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. అప్రమత్తమైన పోలీసులు హుటాహుటిన క్యాంపస్‌కు చేరుకొని గొడవలకు చోటు ఇవ్వకుండా అందోళన చేస్తున్న 11 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి కేయూ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీసీ, రిజిస్ట్రార్‌లతో సెంట్రల్ డీసీపీ, ఏసీపీ సమావేశమై క్యాంపస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు తెలుసుకొని ఎలాంటి ఆందోళనలు చేయకుండా పోలీసులను మోహరించినట్టు సీపీ పేర్కొన్నారు.

విద్యార్థినికి నీలిచిత్రం చూపించిన ఉపాధ్యాయుడు

- ఆందోళనకు దిగిన విద్యార్థి సంఘాలు, గ్రామస్థులు

చేర్యాల, నమస్తే తెలంగాణ: విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన ఓ ఉపాధ్యాయుడు నీచానికి ఒడిగట్టాడు. విద్యార్థినికి నీలిచిత్రం చూపించి ఉపాధ్యాయవృత్తికి కళంకం తెచ్చాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని నాగపురి ప్రభుత్వ పాఠశాలకు చలపతిరెడ్డి (55) అదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినికి తన సెల్‌ఫోన్‌లోని నీలిచిత్రాన్ని చూపించాడు. ఆ విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎంకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. విద్యార్థిని గ్రామస్థులకు విషయం చెప్పడంతో శనివారం గ్రామస్థులు, స్థానిక విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంఈవో జీ రాములు అక్కడికి చేరుకున్న గ్రామస్థులతో సమావేశమై సంఘటన వివరాలను తెలుసుకున్నారు. 14 రోజుల క్రితం ఉపాధ్యాయుడు చలపతిరెడ్డి విద్యార్థినికి నీలిచిత్రం చూపించార ని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టి కెళ్లి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. సంఘటనపై ఎస్సై లక్ష్మణ్‌రావు ఆరా తీశారు.



బోనం, బుట్ట ఎత్తుకుని ఆలయానికి బయలుదేరిన మంత్రి జగదీశ్‌రెడ్డి దంపతులు

అంగరంగ వైభవంగా కంఠమహేశ్వరుడి బోనాలు

కుడకుడరోడ్డు: గౌడ కులస్థుల ఆరాధ్యదైవమైన కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు సూర్యాపేట జిల్లా కేంద్రంలో అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఈ వేడుకలకు విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖల మంత్రి జగదీశ్‌రెడ్డి సతీసమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సతీమణి మహిళలతో కలిసి బోనమెత్తగా మంత్రి జగదీశ్‌రెడ్డి గంప ఎత్తుకొని భక్తులతోపాటు ర్యాలీలో పాల్గొన్నారు. కాగా శనివారం ఉదయం సూర్యాపేట బీజేపీ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు అన్నెపర్తి రాణి పలువురితో కలిసి హైదరాబాద్‌లోని మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



స్తంభానికి బాలుడు

బడికి వెళ్లడంలేదని కొడుకును దండించిన తండ్రి

ములకలపల్లి: బడికి వెళ్లడంలేదని ఓ తండ్రి తన కుమారుడిని స్తంభానికి కట్టేసి శిక్షించిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల పరిధిలోని కమలాపురంలో శనివారం చోటుచేసుకున్నది. కమలాపురం గ్రామానికి చెందిన గొల్ల తిరుమల కుమారుడు(13) స్థానిక ప్రభుత్వపాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. కాగా వారం రోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదు. దీంతో ఆగ్రహించిన తండ్రి కొడుకుని వెతికి పట్టుకొచ్చి స్కూల్ ఎదుట ఉన్న ఓ స్తంభానికి కట్టేశాడు. తాను చదువుకోలేదని, కూలీనాలీ చేసి తన కొడుకును ప్రయోజకుడిని చేయాలని భావించి కష్టపడి చదివిస్తుంటే కుమారుడు చదువకుండా వారం రోజులుగా తప్పించుకు తిరుగుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో చేసేది లేకనే కొడుకును దండించడం జరిగిందని వాపోయాడు.



మిషన్ కాకతీయ నాలుగో విడుతలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట, డబ్బా, వర్షకొండ, ఎర్దండి, తిమ్మాపూర్‌లోని పెద్ద చెరువు, చింతల చెరువు, ఊర చెరువు, పాత చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతో శనివారం కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు భూమి పూజ చేసి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోరుట్ల నియోజకవర్గంలో 250 చెరువులు ఉండగా మూడున్నరేండ్లలో 140 చెరువులను మిషన్ కాకతీయ కింద అభివృద్ధి చేశామన్నారు.

- ఇబ్రహీంపట్నం

సంకల్పమే విజేతగా నిలబెడుతుంది

- మహిళాభ్యుదయంతోనే సామాజికాభివృద్ధి
- పీఎంకేవై శిక్షణా కేంద్రంలో గురజాడ అరుణ



రామడుగు మండలం గోపాలరావుపేట పీఎంకేవై శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న గురజాడ అరుణ


రామడుగు: సంకల్పమే సమాజంలో విజేతగా నిలబెడుతుందని గురజాడ ఫౌండేషన్ అధ్యక్షురాలు గురజాడ అరుణ పేర్కొన్నారు. గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం 125 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటలోని పీఎంకేవై శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే గురజాడ ఆశయానికి పరిపూర్ణత లభించినట్లని.. ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. అణగారిన సమాజాన్ని అభ్యుదయంవైపు నడిపిస్తూ మహిళలకు సమానహక్కులు కల్పించాలని పోరాడిన మహోన్నత వ్యక్తికి మనుమరాలిని అయినందుకు గర్విస్తున్నానని పేర్కొన్నారు. వరకట్న దురాచారాన్ని రూపుమాపుతూ కన్యాశుల్కం తెచ్చిన సంఘసంస్కర్త గురజాడ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గురజాడ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు సంటి అనిల్‌కుమార్, పీఎంకేవై నిర్వాహకుడు కాచిడి గోపాల్‌రెడ్డి, జమ్మికుంట కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఇంచార్జి మనోహరాచారి పాల్గొన్నారు.



11 రోజుల సీబీఐ కస్టడీకి కొఠారీలు

లక్నో, ఫిబ్రవరి 24: రొటోమాక్ పెన్నుల యజమాని విక్రమ్ కొఠారీ, ఆయన కుమారుడు రాహుల్ కొఠారీలను శనివారం ఇక్కడి సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం.. 11 రోజుల సీబీఐ కస్టడికి అప్పగించింది. రూ.3,695 కోట్ల రుణ ఎగవేత కేసులో విక్రమ్, రాహుల్ కొఠారీలు ప్రధాన నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో తండ్రీ, కొడుకులు ఏడు జాతీయ బ్యాంకులను మోసం చేశారన్న అభియోగాలను ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఈ కేసు విచారణకు కొఠారీలు సహకరించడం లేదని సీబీఐ ఆరోపిస్తున్నది.

మీ నిర్లక్ష్యం వల్లే..



పీఎన్‌బీ కుంభకోణంలో రెగ్యులేటర్లు, ఆడిటర్లపై జైట్లీ ధ్వజం

- బ్యాంక్ మేనేజ్‌మెంట్ తీరుపైనా మండిపాటు
- ఇలాంటి మోసాలతో వ్యాపార అనుకూల పరిస్థితులకు దెబ్బేనని వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.11,400 కోట్ల కుంభకోణం నేపథ్యంలో రెగ్యులేటర్లు, ఆడిటర్ల తీరుపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బ్యాంక్ మేనేజ్‌మెంట్లకూ చురకలు అంటించారు. శనివారం ఇక్కడ ఎకనామిక్ టైమ్స్ గ్లోబల్ బిజినెస్ సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. బ్యాంకింగ్ రంగంపై సంబంధిత నియంత్రణ వ్యవస్థలకు పర్యవేక్షణ లోపించిందని ఆక్షేపించారు. ఆడిటర్ల పనితీరు బాగా లేదని, బ్యాంకర్ల నిర్వహణలోనూ లొసుగులున్నాయని మండిపడ్డారు. అటు బ్యాంకింగ్, ఇటు వ్యాపార రంగాల్లో నీతి, నిజాయితీలు నానాటికీ క్షీణిస్తున్నాయని జైట్లీ ఈ సందర్భంగా ఘాటైన విమర్శలు చేశారు. ఈ క్రమంలోనే ఆడిటర్లనుద్దేశించి మాట్లాడుతూ.. 'చేస్తే చక్కగా పని చేయాలి, లేదంటే వేరే ఉద్యోగాలు చూసుకోవడం మంచిది' అని హితవు పలికారు. వివిధ స్థాయిల్లో బహుళ ఆడిటింగ్ వ్యవస్థలున్నా.. ఫలితం శూన్యమేనంటూ అసంతృప్తిని వెలిబుచ్చారు. తగువిధంగా పరిశీలించడం లేదన్న ఆయన క్షేత్రస్థాయిల్లోనే ఇలాంటి కుంభకోణాలను గుర్తించే బాధ్యత ఆడిటర్లపైనే ఉందన్నారు. ఇక ఆర్బీఐ వంటి రెగ్యులేటర్ల పాత్ర చాలా ముఖ్యమైనదన్న ఆయన.. ఆర్థిక వ్యవస్థ గమనాన్ని సరైన దిశలో పెట్టే బాధ్యత వీటిపైనే ఉందన్నారు. మోసాలు ఇతరత్రా ఆర్థిక నేరాలు ఏమైనా జరుగుతున్నాయా? అన్నదాన్ని మూడో కంటితో పసిగట్టగలగాలన్నారు. 'ఇలాంటి మోసాలకు మన దేశంలో నియంత్రణ వ్యవస్థలు బాధ్యత వహించవు. రాజకీయ నాయకులే జవాబుదారీగా ఉండాల్సి వస్తున్నది. ఇది దురదృష్టకరం' అన్నారు. మొత్తానికి బ్యాంక్ మోసాలు.. దేశంలో సులభతర వ్యాపార నిర్వహణ పరిస్థితులకు పెద్ద అవరోధంగా మారుతున్నాయన్నారు. గడిచిన ఏడేండ్లలో ఒక్క పీఎన్‌బీ ఉద్యోగి కూడా ఈ మోసాన్ని అడ్డుకోకపోవడమే చింతించాల్సి వస్తున్నదని జైట్లీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుంభకోణం సూత్రధారి నీరవ్ మోదీనిగానీ, పీఎన్‌బీ సిబ్బంది పేర్లనుగానీ ప్రస్తావించకుండా 'ఇంత పెద్ద మోసం జరుగుతున్నా.. ఒక్కరూ దాన్ని ఆపలేకపోయారు. ముఖ్యంగా బ్యాంక్ ఉన్నతస్థాయి ఉద్యోగులకూ అసలేం జరుగుతున్నదన్న దానిపై అవగాహన లేకుండా పోయింది. ఇది విచారకరం' అంటూ ఒకింత ఆందోళన కనబరిచారు. 2011-2017 మధ్య ముంబైలోని పీఎన్‌బీ బ్రాడీ హౌజ్ శాఖ నుంచి మోసపూరితంగా జారీ అయిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ లేదా అండర్‌స్టాండింగ్ (ఎల్‌వోయూ), ఫారిన్ లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)లతో నీరవ్ మోదీ సంస్థలు ఈ కుంభకోణానికి పాల్పడిన విషయం తెలిసిందే. దేశీయ బ్యాంకులకు చెందిన విదేశీ శాఖల నుంచి ఈ ఎల్‌వోయూ, ఎల్‌వోసీల ఆధారంగా వేల కోట్ల రుణాలను తీసుకున్నారు. ఈ కేసును ప్రస్తుతం కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ, ఈడీ, తీవ్ర మోసాల దర్యాప్తు విభాగం (ఎస్‌ఎఫ్‌ఐవో) విచారణ చేస్తున్నాయి.

ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించబోం

ప్రభుత్వ రంగ బ్యాంకుల్ని ప్రైవేటీకరించబోమని జైట్లీ స్పష్టం చేశారు. బ్యాంకుల ప్రైవేటీకరణపై వస్తున్న వార్తల్ని ఆయన ఖండించారు. పీఎన్‌బీ మోసం అనంతర పరిణామాల మధ్య ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణ అంశం మళ్లీ తెరపైకి వస్తుండగా, దీన్ని జైట్లీ కొట్టిపారేశారు. 'బ్యాంకుల ప్రైవేటీకరణ అనేది రాజకీయ ఏకాభిప్రాయంపై ఆధారపడి ఉన్నది. బ్యాంకింగ్ నియంత్రణ చట్టం సవరణలతోనూ సంబంధం ఉన్నది. ముఖ్యంగా రాజకీయంగా ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణకు అంతగా మద్దతు లేదు' అని జైట్లీ చెప్పారు. ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించాలని ఫిక్కీ అధ్యక్షుడు రాశేష్ షా శుక్రవారం విజ్ఞప్తి చేయడంతో జైట్లీ ఈ జవాబిచ్చారు.

కఠిన చట్టాలను తెస్తాం

బ్యాంకులను ముంచుతున్న మోసగాళ్లను శిక్షించేందుకు అవసరమైతే చట్టాలను మరింత కఠినతరం చేస్తామని జైట్లీ స్పష్టం చేశారు. బ్యాంకింగ్ రంగాన్ని.. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉనికిని మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) ప్రశ్నార్థకం చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత చట్టాలను సవరిస్తామన్న సంకేతాలనిచ్చారు. రుణాలు తీసుకుని ఎగవేస్తున్నవారిపై, అక్రమార్కులకు సహకరిస్తున్నవారిపై తీవ్రమైన చర్యలుండేలా నిబంధనల్ని తెస్తామన్నారు. బ్యాంక్ ఉద్యోగులపై శాఖాపరమైన శిక్షలు వేస్తామన్నారు.

పీఎన్‌బీ కేసులో జోరు పెంచిన ఈడీ

రూ.523 కోట్ల ఆస్తులు జప్తు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు శనివారం కూడా కొనసాగాయి. తాజాగా ఆయనకు సంబంధించిన రూ.523.72 కోట్ల విలువైన 21 ఆస్తులను స్వాధీనం చేసుకున్నది. వీటిలో పెంట్‌హౌజ్, ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయి. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఈడీ ఈ ఆస్తులను అటాచ్ చేసింది. వీటిలో ముంబైలోని వోర్లీ వద్ద ఉన్న సముద్ర మహల్ అపార్ట్‌మెంట్‌లో నీరవ్ మోదీకి ఉన్న రూ.81.16 కోట్ల విలువైన పెంట్ హౌజ్, రూ.15.45 కోట్ల ధర కలిగిన మరో ఫ్లాట్ తదితర 21 చరాస్తులు ఉన్నాయి. ఆరు రెసిడెన్షియల్ ప్రాపర్టీలు, పది కార్యాలయాలు, పుణెలో ఉన్న రెండు ఫ్లాట్లు, ఒక సోలార్ ప్లాంట్, అలీబాగ్‌లో ఉన్న ఫామ్‌హౌజ్, అహ్మద్‌నగర్ జిల్లాలో ఉన్న 135 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ వర్గాలు వెల్లడించాయి. గతంలో వజ్రాలు, రత్నాలు, ఆభరణాలు, షేర్లు, బ్యాంకు డిపాజిట్లు, లగ్జరీ కార్లును జప్తు చేసిన ఈడీ.. తాజాగా చర ఆస్తులపై దృష్టి సారించింది. ఇప్పటి వరకు ఈ కేసులో ఈడీ జప్తు చేసిన ఆస్తుల విలువ రూ.6,399 కోట్లకు చేరింది.

పీఎన్‌బీ ఎండీని ప్రశ్నించిన సీబీఐ

పీఎన్‌బీలో జరిగిన భారీ కుంభకోణంలో పెద్ద తలకాయలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దృష్టి సారించింది. ఇప్పటికే పలువురు సీనియర్ అధికారులను ప్రశ్నించిన సీబీఐ తాజాగా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సునీల్ మెహతా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీ బ్రహ్మాజీ రావులను ఎనిమిది గంటలపాటు ప్రశ్నించింది. ఈ భారీ స్కాంపై సీబీఐ తొలి ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసిన తర్వాత తొలిసారిగా మెహతా, రావులను ప్రశ్నించారు.

నగదు విత్‌డ్రాపై పరిమితులు విధించలేదు: పీఎన్‌బీ

కాగా, నగదు విత్‌డ్రాపై పరిమితులు విధించినట్లు వచ్చిన వార్తలన్నీ వట్టి పుకార్లేనని పీఎన్‌బీ ఒక ప్రకటనలో వెల్లడించింది. కొద్ది రోజుల క్రితం రూ.11,400 కోట్ల కుంభకోణం వెలుగులోకి రావడంతో నగదు లావాదేవీలపై పీఎన్‌బీ పరిమితులు విధించిందని, రూ.3 వేల కంటే అధికంగా విత్‌డ్రా చేసుకోనివ్వడం లేదని పుకార్లు రావడంతో ఈ వివరణ ఇచ్చింది.

నీరవ్, చోక్సీ పాస్‌పోర్టులు రద్దు

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన భారీ కుంభకోణంలో నిందితులుగా ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, గీతాంజలి జెమ్స్ ఫౌండర్ మెహుల్ చోక్సీల పాస్‌పోర్ట్‌లను రద్దు చేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిత్వ వర్గాలు వెల్లడించాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సూచన మేరకు ఈ నెల 16న వీరిద్దరి పాస్‌పోర్ట్‌ను నాలుగువారాల పాటు సస్పెండ్ చేసిన విదేశాంగ మంత్రిత్వ శాఖ.. వారంలోగా స్పందించకుంటే పూర్తి స్థాయిలో రద్దు చేస్తామని గతంలోనే ప్రకటించింది. అయినప్పటికీ వీరిద్దరి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో శనివారం వీరిద్దరి పాస్‌పోర్ట్‌లను రద్దు చేసినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.

'సీబీఎస్‌కు స్విఫ్ట్ లింకు చేయండి'

అన్ని బ్యాంకులు తమ కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (సీబీఎస్)తో సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలీకమ్యూనికేషన్స్ (స్విఫ్ట్)ను అనుసంధానం చేసుకోవాలని భారతీయ బ్యాంకుల సంఘం (ఐబీఏ) తెలిపింది. ఇందుకు ఏప్రిల్ 30ని గడువుగా ఆర్బీఐ నిర్ణయించిందని వెల్లడించింది. అయినప్పటికీ వీలైనంత త్వరగా లింకు చేసుకోవాలని బ్యాంకులకు ఐబీఏ సూచించింది. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో ఈ అనుసంధానం త్వరగా జరుగాలని ఐబీఏ కోరుతున్నది.

చిల్లిగవ్వ లేదు.. వేరే ఉద్యోగం చూసుకోండి!

సిబ్బందికి రాసిన లేఖలో గీతాంజలి జువెల్లర్స్ అధినేత మెహుల్ చోక్సీ స్పష్టీకరణ

పీఎన్‌బీలో జరిగిన భారీ కుంభకోణం తర్వాత తొలిసారిగా గీతాంజలి ప్రమోటర్ మెహుల్ చోక్సీ తన ఉద్యోగులకు లేఖ రాసారు. నియంత్రణ మండళ్లు ఏకబిగిన దాడులు చేయడంతో ప్రస్తుతం ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని స్థితికి చేరుకున్నానని, కనుక వేరే ఉద్యోగాలు చూసుకోవాలని ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు. బ్యాంకు ఖాతాలతోపాటు ఇతర ఆస్తులు కూడా జప్తు చేయడం ఇందుకు కారణమని ఆయన చెప్పారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ బిల్లులు, కార్యాలయాల నిర్వహణ చార్జీలను కూడా చెల్లించలేనన్నారు. దీంతో కంపెనీ ఉద్యోగులు కానీ, ఇతర వర్గాలు వారుకాని తన వల్ల ఇబ్బందులు రావద్దనే ఉద్దేశంతో ఈ లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. నియంత్రణ మండళ్లు న్యాయబద్ధంగా వ్యవహరించకపోవడంతో సిబ్బందిలో భయాందోళనలు నెలకొన్నాయన్న ఆయన.. భారత్‌లో వ్యాపార లావాదేవీలు నిలిచిపోవడానికి వారే కారణమని విమర్శించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు కుదుటపడిన తర్వాతనే ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తానని ఆయన చెప్పడం కొసమెరుపు. గీతాంజలి గ్రూపు హెచ్ఆర్ కంపెనీ ఉద్యోగులకు సంబంధించిన రిలీవింగ్ లేటర్, అనుభవం సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు.

ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు

- అంతర్రాష్ట్ర వస్తు రవాణాకు తప్పనిసరి
- జీఎస్టీఎన్ మంత్రుల బృందం నిర్ణయం



విలేకరులతో మాట్లాడుతున్న సుశీల్ మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: రాష్ట్రాల మధ్య ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు విధానం అమల్లోకి రానున్నది. శనివారం ఇక్కడ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నెట్‌వర్క్‌పై జైట్లీ నేతృత్వంలో సమావేశమైన రాష్ట్ర ఆర్థిక మంత్రుల బృందం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల మధ్య రూ.50,000, అంతకంటే ఎక్కువ విలువైన ఉత్పత్తుల రవాణాకు ఎలక్ట్రానిక్ వే బిల్లును ఏప్రిల్ 1 నుంచి తప్పనిసరి చేశామని ఆర్థిక మంత్రుల బృందానికి నాయకత్వం వహిస్తున్న బీహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీ తెలిపారు. 'ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు విధానం ద్వారానే అంతర్రాష్ట్ర గూడ్స్ రవాణా ఉండాలని మేము నిర్ణయించాం' అని సమావేశం అనంతరం విలేఖరులకు సుశీల్ మోదీ తెలిపారు. అయితే ఐటీ నెట్‌వర్క్ సిద్ధంగా లేకపోవడంతో ఈ-వే బిల్లు అమలు ఇన్నాళ్లూ వాయిదా పడుతూ వచ్చింది. ఈ నెల 1 నుంచే అమల్లోకి రావాల్సింది. కానీ వాయిదా వేశారు. అంతా సిద్ధం కావడం, అడ్డంకులన్నీ తొలగిపోవడంతో ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే రెండుసార్లు ఈ-వే బిల్లు వేదికను పరిశీలించామని సుశీల్ వెల్లడించారు. ఇక జీఎస్టీఎన్ పోర్టల్‌పై రోజుకు 6.5 లక్షల ఈ-వే బిల్లుల్ని జారీ చేయవచ్చన్న జీఎస్టీఎన్ సీఈవో ప్రకాశ్ కుమార్.. మొత్తం వ్యవస్థను ఆధునికీకరించామని, అదనపు భారాన్నీ మోయగలదన్న ధీమాను వ్యక్తం చేశారు.

కుదరని ఏకాభిప్రాయం

ఇదిలావుంటే జీఎస్టీ విధానం కింద వ్యాపార రిటర్నుల దాఖలు ప్రక్రియను ఎలా సరళతరం చేయాలన్న దానిపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. సమావేశంలో ఈ అంశంపై కూలంకషంగా చర్చించినప్పటికీ, ఏకాభిప్రాయం కుదరలేదని విలేఖరులతో సుశీల్ మోదీ చెప్పారు. ఈ క్రమంలోనే 'జీఎస్టీఆర్-3బీ మరికొంత కాలం కొనసాగుతుంది' అని అన్నారు.

ఐఐఎస్సీలో పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్

విద్య, ఉద్యోగ సమాచారం

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) రిసెర్చ్ ప్రోగ్రామ్స్ (పీహెచ్‌డీ/పీజీ)లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.



వివరాలు:

దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఐఐఎస్సీ ఒకటి. దీన్ని 1909లో ప్రారంభించారు. పరిశోధన, ప్రమాణాలతో కూడిన విద్యకు కేరాఫ్‌గా ఐఐఎస్సీ నిలిచింది.

కోర్సులు - వివరాలు:

- **పీహెచ్‌డీ ఇన్ సైన్స్ ఫ్యాకల్టీ:** ఆస్ట్రానమి & ఆస్ట్రోఫిజిక్స్, బయోకెమిస్ట్రీ, ఎకలాజికల్ సైన్సెస్, హై ఎనర్జీ ఫిజిక్స్, ఇనార్గానిక్ కెమిస్ట్రీ & ఫిజికల్ కెమిస్ట్రీ, మెటీరియల్స్ రిసెర్చ్, మ్యాథ్స్, మైక్రోబయాలజీ & సెల్ బయాలజీ, మాలిక్యులర్ ఫిజిక్స్, మాలిక్యులర్ రిప్రొడక్షన్, డెవలప్‌మెంట్ & జెనెటిక్స్, న్యూరోసైన్సెస్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, సాలిడ్ స్టేట్ & స్ట్రక్చరల్ కెమిస్ట్రీ.
- **ఎంటెక్ (రిసెర్చ్), పీహెచ్‌డీ ఇన్ ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ:** ఏరోస్పేస్, సీఎస్ఈ, మెకానికల్ ఇంజినీరింగ్ తదితర బ్రాంచీలు ఉన్నాయి.
- **పీహెచ్‌డీ ఇన్ ఇంటర్‌డిసిప్లేనరీ విభాగాలు:** బయో సిస్టమ్ అండ్ ఇంజినీరింగ్, మ్యాథమెటికల్ సైన్సెస్, వాటర్ రిసెర్చ్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్, క్లైమెట్ చేంజ్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** నాలుగేండ్ల బీఈ/బీటెక్‌తోపాటు వ్యాలిడ్ గేట్/నెట్ - జేఆర్‌ఎఫ్ స్కోర్ లేదా సంబంధిత అంశంలో పీజీతోపాటు వ్యాలిడ్ గేట్/నెట్ జేఆర్‌ఎఫ్ లేదా ఎంబీబీఎస్/ఎండీ/బీఫార్మాతోపాటు వ్యాలిడ్ గేట్/నెట్ జేఆర్‌ఎఫ్ కలిగి ఉండాలి.
- **ఎంటెక్/ఎండిజైన్ లేదా ఎం మేనేజ్‌మెంట్:** మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ (ఎంటెక్)లో కింది విభాగాలు ఉన్నాయి.
- **విభాగాలు:** ఏరోస్పేస్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, సీఎస్ఈ, మెకానికల్, మెటీరియల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సిగ్నల్ ప్రాసెసింగ్, సిస్టమ్స్ ఇంజినీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్, క్లైమెట్ సైన్స్, కంప్యుటేషనల్ డాటా సైన్స్, ఎర్త్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, కమ్యూనికేషన్ అండ్ నెట్‌వర్క్, నానో సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఉన్నాయి.
- **అర్హతలు:** కనీసం సెకండ్ క్లాస్ మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్‌తో లేదా సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతోపాటు గేట్ 2016 లేదా 2017 లేదా 2018లో వ్యాలిడ్ స్కోర్ కలిగి ఉండాలి.

ఎం.డిజైన్ (మాస్టర్ ఆఫ్ డిజైన్):

- **అర్హత:** బీఈ/బీటెక్ లేదా బీడిజైన్/ఆర్కిటెక్చర్‌లో సెకండ్ క్లాస్ మార్కులతో ఉత్తీర్ణత. గేట్ 2016/2017 లేదా 2018 లేదా సీడ్ 2018లో వ్యాలిడ్ స్కోర్ కలిగి ఉండాలి.

మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎం.మేనేజ్‌మెంట్):

- **అర్హత:** ప్రథమశ్రేణిలో బీఈ/బీటెక్‌తోపాటు గేట్ 2016/2017 లేదా 2018 లేదా క్యాట్ 2017/జీమ్యాట్‌లో స్కోర్ కలిగి ఉండాలి.

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్:

- **విభాగాలు:** బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్.
- **అర్హతలు:** ప్రథమశ్రేణి మార్కులతో బీఎస్సీ లేదా తత్సమాన డిగ్రీలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయలాజికల్ సైన్సెస్‌తో ఉత్తీర్ణత. దీంతోపాటు జామ్ 2018లో వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఫిజికల్ సైన్స్ స్ట్రీమ్‌కు జెస్ట్ 2018లో అర్హత సాధించినవారు కూడా అర్హులే.

పీహెచ్‌డీ -ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్ (ఈఆర్‌పీ):

- ఈఆర్‌పీని వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఆర్ అండ్ డీ ఆర్గనైజేషన్స్/ఇండస్ట్రీ, ఫ్యాకల్టీ మెంబర్స్ కోసం ప్రారంభించారు. అయితే అభ్యర్థులను ఆయా సంస్థలు స్పాన్సర్ చేయాల్సి ఉంటుంది.
- **అర్హతలు:** రెగ్యులర్ పీహెచ్‌డీ చేసేవారికి ఉండాల్సిన అర్హతలన్నీ ఈ కోర్సులో చేరడానికి ఉండాలి. వీటితోపాటు అభ్యర్థులు సీఎస్ఐఆర్ - యూజీసీ నెట్ జేఆర్‌ఎఫ్/ యూజీసీ నెట్ జేఆర్‌ఎఫ్, ఐసీఎంఆర్ జేఆర్‌ఎఫ్, గేట్, ఎన్‌బీహెచ్‌ఎం వంటి వాటిల్లో వ్యాలిడ్ స్కోర్ సాధించి ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. ఆయా సంస్థల్లో ఫుల్‌టైం రెండేండ్లు ఉద్యోగ సర్వీస్ పూర్తిచేసి ఉండాలి.
- ఐఐఎస్సీ నిర్వహించే ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 26
- **ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ. 800/-,
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ. 400/-
- **వెబ్‌సైట్:** http://www.iisc.ac.in

పవర్‌గ్రిడ్‌లో డిప్లొమా ట్రెయినీలు

నార్తర్న్ రీజియన్‌లోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఎలక్ట్రికల్ విభాగంలో ఖాళీగా ఉన్న డిప్లొమా ట్రెయినీ, జూనియర్ ఆఫీసర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

- మొత్తం పోస్టుల సంఖ్య: 44
- **పోస్టు పేరు:** డిప్లొమా ట్రెయినీ -40 పోస్టులు (ఎలక్ట్రికల్)
- **అర్హత:** గుర్తింపు పొందిన టెక్నికల్ బోర్డు నుంచి డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్/సివిల్ ఇంజినీరింగ్‌లో 70 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **పోస్టు పేరు:** జూనియర్ ఆఫీసర్ ట్రెయినీ (హెచ్‌ఆర్)-4 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హెచ్‌ఆర్/పర్సనల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ రిలేషన్‌లో ఎంబీఏ లేదా పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా, ఎంఎస్‌డబ్ల్యూలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2018 మార్చి 13 నాటికి 27 ఏండ్లకు మించరాదు. రిజర్వేషన్ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **స్టయిఫండ్ :** రూ.16,500/ - శిక్షణ పూర్తయిన తర్వాత రూ. 16,000 - 35,500/- పే స్కేల్ చెల్లిస్తారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 300/-, ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:**రాత పరీక్ష/ కంప్యూటర్ స్కిల్‌టెస్ట్ ద్వారా.
- రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో పార్ట్ ఏ, పార్ట్ బీ రూపంలో ఉంటుంది. పార్ట్ ఏ (టెక్నికల్/ప్రొఫెషనల్ నాలెడ్జ్)లో 120 ప్రశ్నలు, పార్ట్ బీ (వొకాబులరీ, వెర్బల్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, డాటా సఫిషియన్సీ అండ్ ఇంటర్ ప్రిటేషన్, న్యూమరికల్ ఎబిలిటీ)లో 50 ప్రశ్నలు ఇస్తారు. 120 నిమిషాల్లో పూర్తిచేయాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 13
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

ఎన్‌ఐఎన్‌లో

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్) ఖాళీగా ఉన్న ప్రాజెక్టు టెక్నీషియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- **పోస్టు పేరు:** ప్రాజెక్టు టెక్నీషియన్ -2 ఖాళీలు
- **అర్హత:** సైన్స్ గ్రూప్‌లో ఇంటర్ ఉత్తీర్ణత. రెండేండ్ల డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్/పీఎండబ్ల్యూ/ రేడియాలజీ, రేడియోగ్రఫీలో సర్టిఫికెట్ ఉండాలి లేదా ఇంటర్‌తోపాటు ఏడాది కోర్సులో డీఎంఎల్‌టీ సర్టిఫికెట్ ఉండాలి.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్ :** రూ. 18,000/-
- **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనా దరఖాస్తులను నింపి ఒరిజినల్ సర్టిఫికెట్లతో మార్చి 1 తేదీన ఉదయం 9.30 గంటలకు సంబంధిత పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి.
- **వెబ్‌సైట్:** http://ninindia.org

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో 21 ఖాళీలు

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మేనేజర్, ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఈ పోస్టులను నిర్ణీత కాలవ్యవధికి భర్తీ చేస్తారు.

- **ఆపరేషనల్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీలు:**
- కో ఆర్డినేటర్-ఫ్లైట్ ఆపరేషన్స్/డిస్‌ప్యాచ్-2, మేనేజర్-ఫ్లైట్ డిస్‌ప్యాచ్-3, సీనియర్ ఆఫీసర్-ఫ్లైట్ డిస్‌ప్యాచ్-2, ఆఫీసర్ -కాక్‌పిట్/క్యాబిన్ క్రూ షెడ్యూలింగ్-1, అసిస్టెంట్ టెక్నికల్ లైబ్రరీ-1
- **ఆపరేషనల్ డిపార్ట్‌మెంట్‌లో ఖాళీలు:**
- రూట్ మేనేజర్-1, ఆఫీసర్ సేల్స్-1, మేనేజర్ షెడ్యూలింగ్ అండ్ నెట్‌వర్క్ ప్లానింగ్-1ఆఫీసర్-ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్-6, సీనియర్ ఆఫీసర్-క్యాటరింగ్ సర్వీస్-1
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ, ఇంటర్ (ఎంపీసీ), డీజీసీఏ సర్టిఫికెట్, ఎంబీఏ, బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-, ఎస్సీ, ఎస్టీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ



- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో

చిరునామా: The Chief of HR
Air India Express Limited , Airlines House, Durbar Hall Road,
Near Gandhi Square,Kochi- 682016

- **చివరి తేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో వెలువడిన తేదీ నుంచి 15 రోజుల్లోగా దరఖాస్తులను పంపించాలి. పూర్తి వివరాలకు ఫిబ్రవరి 17-23 ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** www.airindiaexpress.in.

ఎన్‌ఐఆర్‌డీలో

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్‌ఐఆర్‌డీపీఆర్) ఖాళీగా ఉన్న అసిస్టెంట్, మేనేజర్ పోస్టుల (తాత్కాలిక ప్రాతిపదికన) భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- ప్రాజెక్టు అసిస్టెంట్-1 పోస్టు
- **అర్హత:** సోషల్ సైన్స్, స్టాటిస్టిక్స్, మేనేజ్‌మెంట్‌లో పీజీ. పీజీడీఎం, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫిల్ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. సోషల్ సైన్స్‌లో పీహెచ్‌డీ ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ట్రెయినింగ్ మేనేజర్-1 పోస్టు
- **అర్హత:** సోషల్ సైన్స్, స్టాటిస్టిక్స్, మేనేజ్‌మెంట్‌లో పీజీ. పీజీడీబీఎం, ఎంబీఏ (బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్) ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. సంబంధిత సెక్టార్‌లో అనుభవం.
- **వయస్సు:** 40 ఏండ్లకు మించరాదు (రిసెర్చ్ అసోసియేట్ 45 ఏండ్లు)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.nird.org.in

ఎన్‌ఏఆర్‌ఎల్‌లో జేఆర్‌ఎఫ్

డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ పరిధిలో పనిచేస్తున్న నేషనల్ అట్మాస్ఫియరిక్ రిసెర్చ్ ల్యాబొరేటరీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న జేఆర్‌ఎఫ్, రిసెర్చ్ అసోసియేట్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



వివరాలు:

- మొత్తం పోస్టుల సంఖ్య: 18

విభాగాల వారీగా ఖాళీలు:

- రిసెర్చ్ అసోసియేట్(ఆర్‌ఏ)/పోస్టు డాక్టోరల్ ఫెలో(పీడీఎఫ్)-3 ఖాళీలు
- జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్‌ఎఫ్)-15
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ), ఫిజిక్స్, అట్మొస్ఫియరిక్ సైన్స్, స్పేస్ సైన్స్, మెటీరియాలజీ, మ్యాథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో కనీసం 60 మార్కులతో ఎంఈ/ఎంటెక్ లేదా ఎమ్మెస్సీ ఉత్తీర్ణత. సీఎస్ఐఆర్/యూజీసీ నెట్, గేట్, జామ్, జెస్ట్‌లో ఉత్తీర్ణత ఉండాలి.
- **వయస్సు:** జేఆర్‌ఎఫ్‌కు 30 ఏండ్లు, ఆర్‌ఏ లేదా పీడీఎఫ్‌కు 35 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** జేఆర్‌ఎఫ్‌కు రూ. 25,000+ హెచ్‌ఆర్‌ఏ, ఆర్‌ఏ/పీడీఎఫ్‌కు రూ. 36,000+ హెచ్‌ఆర్‌ఏ అలవెన్స్‌లు ఉంటాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. సంబంధిత అర్హత, ఎక్స్‌పీరియన్స్ తదితర సర్టిఫికెట్లను జతచేసి పర్సనల్ అధికారికి పంపాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ
- **చివరితేదీ:** మార్చి 25
- **వెబ్‌సైట్:** www.narl.gov.in

నమస్తే తెలంగాణ

ఆట

[హైదరాబాద్]

ఆదివారం 25 ఫిబ్రవరి 2018

'కాంస్య' కాంతుల

అరుణ తార

జిమ్నాస్టిక్స్ ప్రపంచ కప్‌లో భారత్‌కు తొలి పతకం

కాంస్యం సాధించిన తెలంగాణ బిడ్డ



పతకంతో అరుణ రెడ్డి

మెల్‌బోర్న్: భారత జిమ్నాస్టిక్స్ చరిత్రలో సంచలన ప్రదర్శన నమోదైంది. ప్రపంచ కప్‌లో ఏండ్లుగా పతకం కోసం ఎదురుచూస్తున్న భారతావని మది పులకించేలా హైదరాబాదీ బుడ్డా అరుణారెడ్డి అదురగొట్టింది. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్ మహిళల వాల్ట్స్‌లో మూడోస్థానంతో కాంస్య పతకం సాధించింది. తద్వారా ప్రపంచకప్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన జిమ్నాస్ట్‌గా అరుణ రికార్డు నమోదు చేసింది. 13.800 స్కోరుతో స్లావేనియాకు చెందిన జాసా కైస్లెఫ్ స్వర్ణం అందుకోగా ఆస్ట్రేలియాకు చెందిన ఎమిలీ 13.699 పాయింట్లతో రజతం, 22 ఏండ్ల హైదరాబాదీ అరుణ 13.649 స్కోరుతో మూడోస్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకుంది. భారత్‌కే చెందిన ప్రణతి నాయక్ 13.416 స్కోరుతో ఆరోస్థానంలో నిలిచింది. 'అరుణ సాధించిన విజయం మహత్తరం. ప్రపంచకప్‌లో పతకం సాధించిన తొలి భారత జిమ్నాస్ట్‌గా అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఆమె సాధించిన ఘనతతో మేం గర్విస్తున్నాం' అని భారత జిమ్నాస్టిక్స్ సంఘం కార్యదర్శి శాంతికుమార్ సింగ్ అన్నారు. గతంలో దీపా కర్మాకర్ వాల్ట్స్ విభాగంలో ఒలింపిక్స్‌లో నాలుగోస్థానంతోనూ ఆసియా చాంపియన్‌షిప్‌తోపాటు 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్యం సాధించింది. ఇప్పటివరకు భారత్ తరపున ఇదే అత్యుత్తమ ప్రదర్శన కాగా.. తాజాగా ప్రపంచకప్ విభాగంలో దేశానికి తొలి పతకంతో అరుణారెడ్డి కొత్త రికార్డు అందుకుంది. గతంలో 2013 ప్రపంచకప్ ఆర్టిస్టిక్స్ జిమ్నాస్టిక్స్‌తోపాటు 2014కామన్వెల్త్ గేమ్స్, 2014, 2017 ఆసియాగేమ్స్‌లో పతకం సాధించడంలో విఫలమైనా ఇప్పుడు ఏకంగా ప్రపంచకప్‌లో విజయంతో తొలి అంతర్జాతీయ పతకం కైవసం చేసుకుంది.

గల్లీ నుంచి ప్రపంచకప్ దాకా..

నిరుపేద కుటుంబం.. తండ్రి చిరుద్యోగి.. తనకు తోడు ఇంట్లో మరో ఆడపిల్ల.. అయినా నాన్న ప్రోత్సాహంతో కరాటే నేర్చుకోవాలని పసివయస్సులోనే మైదానంలోకి అడుగుపెట్టింది.. ఈ అమ్మాయి శరీరం అద్భుతంగా సాగుతుంది.. జిమ్నాస్టిక్స్ వైపు వెళ్లండి అన్న గురువు సలహాతో క్లిష్టమైన క్రీడ జిమ్నాస్టిక్స్ వైపు మళ్లింది. పొద్దంతా బడిలో పాఠాలు.. సాయంత్రం గంటలకొద్దీ కఠోర శిక్షణ. ఒంటిని విల్లులా వంచి.. జిమ్నాస్టిక్స్‌లో కీలకమైన ఆర్టిస్టిక్‌లో ఆరితేరింది. ముందు వరుసలోని క్రీడాకారులను ఓడిస్తూ.. 14ఏండ్ల రికార్డును తిరుగరాసి ఆలిండియా చాంపియన్ స్థాయికి ఎదిగింది. అంతలోనే తండ్రి అకాల మరణం, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినా.. సాధనే ఆయుధంగా సాహసంతో సాగింది. అంతర్ యూనివర్సిటీ స్థాయిలో 3 బంగారుల పతకాలు సాధించింది.. జిమ్నాస్టిక్స్ అంటే దీపా కర్మాకర్ అనుకున్న దేశ ప్రజలకు మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచకప్‌లో పతకంతో తన పేరును విశ్వాంతరాలకు చాటింది. ప్రపంచకప్‌లో భారత్‌కు తొలి పతకం అందించింది. మేటి జిమ్నాస్ట్ కావాలన్న తండ్రి కలను మాత్రమే కాదు.. దేశ ఖ్యాతిని ప్రపంచ యవనికపై రెపరెపలాడించి జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో 'కాంస్య'కాంతులతో తెలంగాణ పేరును విశ్వవ్యాప్తం చేసింది మన హైదరాబాద్ అమ్మాయి బుడ్డా అరుణారెడ్డి.

ఫైనల్లో మెదక్ X ఆదిలాబాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: వరుస విజయాలతో జోరు మీదున్న మెదక్ మావెరిక్స్ జట్టు వెంకటస్వామి మెమోరియల్ టీ20 లీగ్‌లో ఫైనల్‌కు చేరింది.ఆదివారం జరుగనున్న తుదిపోరులో ఆదిలాబాద్‌తో తలపడుతుంది. శనివారం జరిగిన సెమీఫైనలో మెదక్ జట్టు, హైదరాబాద్ థండర్ బోల్ట్స్‌పై ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. అభిరత్ రెడ్డి 54 బంతుల్లో 84 పరుగులు (10 ఫోర్లు, మూడు సిక్సర్లు)తో అదురగొట్టగా హైదరాబాద్ విధించిన 151 పరుగుల లక్ష్యాన్ని మెదక్ 19 ఓవర్లలోనే ఛేదించింది. మల్లికార్జున్ (31) ఫరవాలేదనిపించాడు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ థండర్ బోల్ట్స్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. చైతన్య 43, చందన్ 31 పరుగులతో ఆకట్టుకున్నారు. మెదక్ బౌలర్లలో ప్రణీత్, చైతన్య, జైస్వాల్‌కు తలా రెండు వికెట్లు దక్కాయి. అభిరత్ రెడ్డికి మ్యాన్ ఆఫ ద మ్యాచ్ అవార్డు దక్కింది.మరో సెమీఫైనల్లో అదిలాబాద్ టైగర్స్ 16 పరుగుల తేడాతో రంగారెడ్డి రైజర్స్‌పై గెలిచి ఫైనల్‌కు చేరింది. రంగారెడ్డి బ్యాట్స్‌మన్ అక్షత్‌రెడ్డి (81) రాణించినా జట్టును గెలిపించుకోలేకపోయాడు. ఆదిలాబాద్ బ్యాట్స్‌మన్ జావెద్ అలీ (45) మ్యాన్ ఆఫ ద మ్యాచ్‌గా నిలిచాడు.



అభిరత్ రెడ్డికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న సినీ నటుడు తరుణ్, టోర్నీ డైరెక్టర్ ఆగమరావు, మెదక్ మావెరిక్స్ యజమాని జగన్మోహన్‌రావుతదితరులు

పొట్టి సిరీస్ మనదే

- మూడో టీ20లో భారత్ విజయం
- దక్షిణాఫ్రికాపై 2-1తో సిరీస్ కైవసం
- గెలుపుతో పర్యటన ముగింపు




టీమ్ ఇండియా గెలుపు సంబురాలు

కేప్‌టౌన్: ఎక్కడైతే భారత్‌కు తొలి ఓటమి ఎదురయ్యిందో.. అక్కడే ఆఖరి విజయాన్ని అందుకుంది. ఎక్కడైతే సఫారీలతో పోరాటం మొదలుపెట్టిందో.. అక్కడే అద్భుతాన్ని ఆవిష్కరించింది. 51 రోజుల సుదీర్ఘ పర్యటనలో టెస్టు సిరీస్ వైఫల్యం నుంచి తేరుకున్న టీమ్‌ఇండియా అటు వన్డేల్లోనూ ఇటు టీ20ల్లోనూ తన తడాఖా ఏంటో చూపెట్టింది. ఒకేసారి రెండు సిరీస్‌లను ఒడిసిపట్టుకుని సఫారీ గడ్డపై సరికొత్త చరిత్రకు దారులు తెరిచింది. ఆల్‌రౌండ్ షోతో అదురగొడుతూ శనివారం జరిగిన మూడో టీ20లో భారత్ 7 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై గెలిచింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. ధవన్ (40 బంతుల్లో 47; 3 ఫోర్లు), రైనా (27 బంతుల్లో 43; 5 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగడంతో భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 172 పరుగులు చేసింది. తర్వాత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్లకు 165 పరుగులు మాత్రమే చేసింది. డుమిని (41 బంతుల్లో 55; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్. టీమ్‌ఇండియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో సఫారీల లక్ష్య ఛేదన తబడుతూ సాగింది. పవర్‌ప్లేలో 25/1 స్కోరుతో వెనుకబడింది. మిల్లర్ (24) డుమినితో కలిసి రెండో వికెట్‌కు 35 పరుగులు జోడించి ఔటయ్యాడు. రన్‌రేట్ ఐదు పరుగుల కంటే తక్కువగా ఉండటంతో తొలి 10 ఓవర్లలో ఆతిథ్య జట్టు 52/2 స్కోరుకే పరిమితమైంది. చివర్లో జంకెర్ (49) మెరుపులు మెరిపించినా ప్రయోజనం లేకపోయింది.

కీలక భాగస్వామ్యం

తొలి ఓవర్‌లోనే వరుసగా రెండు ఫోర్లతో దూకుడు చూపెట్టిన రోహిత్ (8 బంతుల్లో 11; 2 ఫోర్లు)కు తర్వాతి ఓవర్‌లో దాల (3/35) కళ్లెం వేశాడు. ఎదుర్కొన్న తొలి బంతినే స్టాండ్స్‌లోకి పంపిన రైనా ఉన్నంతసేపు భారీ షాట్లతో ఆకట్టుకున్నాడు. మోరిస్ (2/43)ను లక్ష్యంగా చేసుకుని రెండోఎండ్‌లో ధవన్ కూడా జోరు పెంచడంతో పవర్‌ప్లేలో భారత్ స్కోరు 57/1కి చేరింది. 11 ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరు 85/2కు చేరింది. చివరో పాండ్యా (21), ధోనీ (12) స్కోరు పెంచే ప్రయత్నం చేశారు. కార్తీక్ (6 బంతుల్లో 13; 3 ఫోర్లు) మెరువడంతో భారత్ మంచి స్కోరు సాధించింది.



స్కోర్‌బోర్డు

భారత్: రోహిత్ ఎల్బీ (బి) దాల 11, ధవన్ రనౌట్ 47, రైనా (సి) బెహర్డీన్ (బి) షమ్సీ 43, మనీష్ పాండే (సి) మిల్లర్ (బి) దాల 13, పాండ్యా (సి) క్లాసెన్ (బి) మోరిస్ 21, ధోనీ (సి) మిల్లర్ (బి) దాల 12, దినేశ్ కార్తీక్ ఎల్బీ (బి) మోరిస్ 13, అక్షర్ పటేల్ నాటౌట్ 1, భువనేశ్వర్ నాటౌట్ 3, **ఎక్స్‌ట్రాలు:** 8, **మొత్తం:** 20 ఓవర్లలో 172/7. **వికెట్లపతనం:** 1-14, 2-79, 3-111, 4-126, 5-151, 6-163, 7-168. **బౌలింగ్:** మోరిస్ 4-0-43-2, దాల 4-0-35-3, డుమిని 3-0-22-0, పెహెల్‌కావో 3-0-26-0, షమ్సీ 4-0-31-1, ఫాంగిసో 2-0-13-0. **దక్షిణాఫ్రికా:** హెండ్రిక్స్ (సి) ధవన్ (బి) భువనేశ్వర్ 7, మిల్లర్ (సి) పటేల్ (బి) రైనా 24, డుమిని (సి) రోహిత్ (బి) శార్దూల్ 55, క్లాసెన్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్యా 7, జంకెర్ (సి) రోహిత్ (బి) భువనేశ్వర్ 49, మోరిస్ (బి) బుమ్రా 4, బెహర్డీన్ నాటౌట్ 15, **ఎక్స్‌ట్రాలు:** 4, **మొత్తం:** 20 ఓవర్లలో 165/7. **వికెట్లపతనం:** 1-10, 2-45, 3-79, 4-109, 5-114. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-24-2, బుమ్రా 4-0-30-1, శార్దూల్ 4-0-35-1, పాండ్యా 4-0-22-1, రైనా 3-0-27-1, అక్షర్ 1-0-16-0.

హుస్సాముద్దీన్‌కు కాంస్యం

సోఫియా(బల్గేరియా): స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నీలో రాష్ట్ర బాక్సర్ మహ్మద్ హుస్సాముద్దీన్ కాంస్య పతకంతో ఆకట్టుకున్నాడు. శనివారం జరిగిన పురుషుల 56కిలోల సెమీస్ బౌట్‌లో హుస్సాముద్దీన్..రష్యా బాక్సర్ శక్రీర్ అహ్మదోవ్ చేతిలో ఓటమి పాలయ్యాడు. హోరాహోరీగా సాగిన పోరులో ప్రత్యర్థి విసిరిన పంచ్‌లకు హుస్సాముద్దీన్ ఎడమ కన్నుపై గాయమైంది. దీంతో రష్యా బాక్సర్‌కు దీటైన పోటీనివ్వడంలో విఫలమయ్యాడు. మరోవైపు వికాస్ కృష్ణన్(75కి), అమిత్ పంగల్(49కి) ఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం రజత పతకాలు ఖాయం చేసుకున్నారు. మహిళల విభాగంలో సీమా పూనియా(81+కి) ఫైనల్లోకి ప్రవేశించింది.

ఫైనల్లో కర్ణాటక

- విజయ్ హజారే ట్రోఫీ

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో కర్ణాటక 9 వికెట్ల తేడాతో మహారాష్ట్రపై ఘన విజయం సాధించింది. మహారాష్ట్ర నిర్దేశించిన 161 పరుగుల లక్ష్యఛేదనలో కర్ణాటక వికెట్ కోల్పోయి 30.3 ఓవర్లలో 164 పరుగులు చేసింది. ఓపెనర్లు మయాంక్ అగర్వాల్(81), కరుణ్ నాయర్(70 నాటౌట్) అర్ధసెంచరీలతో అదురగొట్టారు. మహారాష్ట్ర బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు(633) చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. తొలుత గౌతమ్(3/26)ధాటికి మహారాష్ట్ర 44.3 ఓవర్లలో 160 పరుగులకు కుప్పకూలింది. జట్టులో శ్రీకాంత్ ముండే(50) మినహా ఎవరూ అంతగా ఆకట్టుకోలేకపోయారు. ఆదివారం జరిగే మరో సెమీస్‌లో ఆంధ్ర, సౌరాష్ట్ర తలపడుతాయి. ఇందులో గెలిచిన జట్టు ఈనెల 27న కర్ణాటకతో ఫైనల్లో ఆడుతుంది.

ఇది అమ్మాయిల చరిత్ర



- ఆఖరి టీ20లో దక్షిణాఫ్రికా మహిళలు చిత్తు
- 3-1తో టీ20 సిరీస్ భారత్ కైవసం
- రెండు సిరీస్‌లు గెలుచుకుని సరికొత్త రికార్డు

క్రికెట్ చరిత్రలో సంచలనం నమోదైంది. భారత మహిళా క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే, టీ20 సిరీస్‌లను గెలిచి ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా రికార్డు సృష్టించింది. అంతకుముందు మిథాలీ సారథ్యంలోని భారత్ వన్డే సిరీస్‌ను 2-1తో గెలుచుకోగా, తాజాగా హర్మన్ ప్రీత్ నాయకత్వంలోని జట్టు 3-1తో టీ20 సిరీస్‌ను దక్కించుకున్నది.

కేప్‌టౌన్: అదే జోరు, అదే తీరు, ఎక్కడా తగ్గలేదు, ఏ చిన్న పొరపాటుకూ తావివ్వలేదు. భారత మహిళా జట్టు తమ విజయాల పరంపరను కొనసాగిస్తూ శనివారం జరిగిన ఐదో టీ20లో దక్షిణాఫ్రికాపై 54 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను దక్కించుకున్నది. ముందుగా మిథాలీ(50బంతుల్లో62;8ఫోర్లు, 3సిక్స్‌లు)అర్ధసెంచరీతో భారీ స్కోరు సాధించిన భారత్.. బౌలింగ్‌లో శిఖా పాండే, ధార్, గైక్వాడ్ విజృంభించడంతో ప్రత్యర్థిని చిత్తుగా ఓడించింది. 167 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమైన సఫారీ జట్టు 112 పరుగులకే ఆలౌటైంది. మిథాలీకి ప్లేయర్ ఆఫ ద మ్యాచ్, ప్లేయర్ ఆఫ ద సిరీస్ అవార్డులు దక్కాయి.

సఫారీలు టపటపా: ఛేదించ దగ్గ లక్ష్యమే అయినప్పటికీ దక్షిణాఫ్రికా మహిళా జట్టు తడబడింది. ఓపెనర్లు లీ (3) నీకెర్క్ (10)ను రుమేలీ ధార్(3/26) పెవిలియన్‌కు పంపి ఆదిలోనే దెబ్బతీసింది. ఆ తర్వాత శిఖా(3/16) వరుసగా లుస్ (5), డుప్రీజ్ (17) క్లెర్క్ (4) వికెట్లను తీయడంతో సఫారీ జట్టు కోలుకోలేకపోయింది. ట్రయాన్ (25) కాప్ (27) కాసేపు ప్రతిఘటించినా లాభం లేకపోయింది. ముఖ్యంగా జెమీమా కండ్లు చెదిరే క్యాచ్‌తో కాప్‌ను పెవిలియన్‌కు పంపిన తీరు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

అంతకు ముందు హర్మన్ సేన 20 ఓవర్లలో 166/4 స్కోరు చేసింది. ఓపెనర్లు మందన (13) మిథాలీ రాజ్(62) తొలి వికెట్‌కు 32 పరుగులతో శుభారంభం అందించారు. కాప్ బౌలింగ్‌లో మందన ఔట్ అవడంతో క్రీజులోకి వచ్చిన జెమీమా (44) మిథాలీతో కలిసి పరుగుల వేటను కొనసాగించింది. ఈ క్రమంలో సూపర్ ఫాంలో ఉన్న మిథాలీ మూడో అర్ధసెంచరీ సాధించింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 98 పరుగులు జోడించారు. ఈ ఇద్దరూ ఔటైన తర్వాత హర్మన్ (27 నాటౌట్) ఒక ఫోర్, రెండు సిక్సర్లు బాది భారత్‌కు సముచిత స్కోరును అందించింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో కాప్, షబ్నిమ్, ఖాకకు తలా వికెట్ దక్కింది.

స్కోర్‌బోర్డు

భారత మహిళలు: మిథాలీ (సి) లీ (బి) షబ్నిమ్ 62, మందన (సి) క్లాస్ (బి) కాప్ 13, జెమీమా (సి) అండ్ (బి) ఖాక 44, హర్మన్‌ప్రీత్ 44 నాటౌట్, వేద (రనౌట్) 8. **ఎక్స్‌ట్రాలు:** 12. మొత్తం 20 ఓవర్లలో 166/4. **వికెట్లు:** 1-32, 2-130, 3-134, 4-166. బౌలింగ్: కాప్ 4-1-22-1, ఖాక 4-0-41-1, షబ్నిమ్ 4-0-35-1, క్లాస్ 2-0-21-0, నీకెర్క్ 4-0-22-0, ఎన్‌టొజకె 2-0-21-0.

దక్షిణాఫ్రికా మహిళలు: లీ (సి) పూనమ్ (బి) ధార్ 3, నీకెర్క్ (సి) పాండే (బి) ధార్ 10, లూస్ (బి) పాండే 5, డుప్రీజ్ (సి) మిథాలీ (బి) పాండే 17, ట్రయాన్ (సి) కౌర్ (బి) గైక్వాడ్ 25, క్లెర్క్ (బి) పాండే 4, కాప్ (సి) జెమీమా (బి) ధార్ 27, షబ్నిమ్ (స్టంప్డ్) భాటియా (బి) పూనమ్ 8, క్లాస్ (స్టంప్డ్) భాటియా (బి) గైక్వాడ్ 9, ఖాక (సి) మందన (బి) గైక్వాడ్ 1, ఎన్‌టొజఖే నాటౌట్ 0, **ఎక్స్‌ట్రాలు:** 3, మొత్తం 18 ఓవర్లలో 112 ఆలౌట్.

వికెట్లు: 1-12, 2-18, 3-20, 4-40, 5-44, 6-71, 7-100, 8-108, 9-112, 10-112.

బౌలింగ్: వస్త్రాకర్ 3-1-14-0, శిఖాపాండే 3-0-16-3, ధార్ 4-0-26-3, పూనమ్ 4-0-25-1, గైక్వాడ్ 3-0-26-3, హర్మన్ 1-0-5-0.